
మనం
జనం కోసం అక్షర యజ్ఞం..
హైదరాబాద్ - గురువారం 18 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 163 | పేజీలు:12 | వెల రూ.5
HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

పెళ్లి కోసం రూ.4 కోట్ల నగలు చోరీ



2

అంతరిక్ష యాత్రకు ఇండో-అమెరికన్



2

వాళ్లు పరాన్నజీవులు..

## కఠినంగా ఉండాల్సిందే



### సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

**ఢిల్లీ, జూన్ 17:** దేశంలో రోజురోజుకీ పెరిగిపోతున్న సైబర్ నేరాలపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సైబర్ నేరగాళ్లు అమాయక ఇన్వెస్టర్లను మోసగించి.. కోట్ల రూపాయలు దోచుకుంటున్నారంటూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి పరాన్నజీవుల పట్ల కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. సైబర్ నేరారోపణలు ఎదుర్కొంటున్న ఓ వ్యక్తి వివిధ రాష్ట్రాల్లో తనపై నమోదైన

...మిగతా 2లో

దేశానికి రోల్ మోడల్‌గా రాష్ట్రాన్ని

# తీర్చిదిద్దుతం

## ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభం




- విద్యా వికాసం కోసమే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్
- విధ్వంసమైన విద్యా వ్యవస్థను వికాసం వైపు నడిపిస్తున్న
- విద్యార్థుల భవిష్యత్ అద్దాల మేడల్లో కాదు...తరగతి గదుల్లో
- సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 17 ( మనం బ్యూరో ) :** విధ్వంసమైన విద్యా వ్యవస్థను వికాసం వైపు నడిపిస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అందులో భాగంగానే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించి విద్యార్థులకు అంకితమిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ అద్దాల మేడలు, రంగుల గోడల్లో లేదనీ, తరగతి గదుల్లోనే ఉందని తాము సంపూర్ణంగా విశ్వసిస్తామన్నారు. అందుకే విద్యా కమిషన్ నివేదిక ప్రకారం ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేస్తూ ముందుకు వెళుతోందన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కేవలం ఆరుట్ల గ్రామానికి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి మాత్రమే పరిమితం కాదనీ, రాష్ట్రంలోని 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇది స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.

ఈ పాఠశాలలో ఇప్పటికే 1814 మంది విద్యార్థులు చేరారనీ, రాష్ట్రంలోని 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇది స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఒక ప్రభుత్వ పాఠశాలకు నో అడ్మిషన్ బోర్డు పెట్టే పరిస్థితి ఉందంటే విద్యా ప్రమాణాల్లో ప్రభుత్వ చిత్తశుద్ధి ఎలాంటిదో స్పష్టమవుతోందని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం ఉందనీ, ఈ స్కూల్ ద్వారా వచ్చే ఫలితాలు, సమస్యలను అవగాహన చేసుకుని రాష్ట్రంలో మరిన్ని తెలంగాణ స్కూళ్లను ప్రారంభిస్తామని వెల్లడించారు. మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకే ప్రభుత్వ పాఠశాలలను పునరుద్ధరిస్తున్నామనీ, ఈ పాఠశాలల్లో చదివిన ఎందరో గొప్ప నాయకులు, అధికారులుగా ఎదిగారని చెప్పారు. తల్లిదండ్రులు ఆత్మగౌరవంతో బతికేలా విద్యార్థులు చదువులో రాణించాలనీ, ఐఏఎస్, ఐపీఎస్, రాజకీయ నాయకులుగా రాణించాలని సూచించారు.

ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేశామనీ, ఇందుకోసం క్రీడలను ప్రోత్సహించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఇందులో భాగంగా ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్ తీసుకొచ్చి విద్యార్థులతో ఫుట్‌బాల్ ఆడిస్తే కొందరు కడుపులో కుళ్లు పెట్టుకుని విమర్శలు చేశారనీ, అలాంటి వారికి ప్రజలు భవిష్యత్తులో ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వరని పరోక్షంగా బీఆర్ఎస్ నాయకులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రజా ప్రభుత్వానికి అండగా నిలిస్తే అద్భుతాలు చేసి చూపిస్తామనీ, రాష్ట్రాన్ని దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. విద్యార్థుల మధ్య వివక్షను దూరం చేసేందుకు ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## భిన్నంగా నేడు ఈ క్యాబినెట్

- ఇప్పటికే మంత్రులకు ఎజెండా పంపిణి

**హైదరాబాద్, జూన్ 17 ( మనం బ్యూరో ) :** రాష్ట్ర క్యాబినెట్ సమావేశం గురువారం జరుగనుంది.సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో ఈ సమావేశం జరుగనుంది. వర్షాకాలం ప్రారంభమైనందున వ్యవసాయ సాగు, వర్షాల పరిస్థితి, ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీరు, యూరియా కొరత, తాగు, సాగు నీరు, మెట్రో రెండో దశకు ఏ విధంగా ముందుకు వెళ్లాలనే అంశంపై చర్చించనున్నట్లు సమాచారం.

ఇప్పటివరకు సేకరించిన ధాన్యం విషయంలో కేంద్రం వైఖరి సానుకూలంగా లేనందున ఈ అంశంపై చేపట్టాల్సిన కార్యాచరణపై సైతం నేటి మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారు. కాగా, గతానికి భిన్నంగా ఈసారి ఈ క్యాబినెట్‌ను నిర్వహించాలని సీఎం నిర్ణయించారు. పేపర్ లెస్ విధానంలో పరిపాలన సాగించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించగా, అందుకు అనుగుణంగా అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా మంత్రులకు క్యాబినెట్ ఎజెండా ప్రతులను సైతం పేపర్‌లెస్ విధానంలోనే పంపిణి చేసినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నారు.

ఐఎస్ఐ ముఠా

# గుట్టురట్టు

### ఏడుగురి అరెస్ట్

**ఢిల్లీ, జూన్ 17:** పాకిస్థాన్ గూఢచారి సంస్థ అయిన ఐఎస్ఐ మద్దతుతో భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న అంతర్జాతీయ ఉగ్రముఠాను ఛేదించారు ఢిల్లీ పోలీసులు. ఈ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేయగా.. వారిలో ఆరుగురు ఉత్తరప్రదేశ్‌లోని గాజియాబాద్ వాసులుగా పోలీసులు గుర్తించారు. గాజియాబాద్‌లో అరెస్టైన ఆరుగురిలో నలుగురు గతంలో పుల్వామా ప్రాంతాన్ని సందర్శించినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి సున్నితమైన సమాచారాన్ని పాక్కు పంపినట్లు అనుమానిస్తున్నారు. పుల్వామా తరహాలో మరో పెద్ద దాడికి పాక్ ప్లాన్ చేస్తోందనే కోణంలో దర్యాప్తు సాగిస్తున్నారు. ఈ ముఠా ఢిల్లీ నుంచి జమ్మూ వరకు గల ప్రముఖ రైల్వే స్టేషన్ల వద్ద సోలార్ సంబంధిత సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేసి భారత సైనికుల కదలికలను గుర్తించేందుకు యత్నించినట్టు పోలీసులు వెల్లడించారు. ఇప్పటికే వీరు ఢిల్లీలోని కాంట్, హరియాణాలోని సోనిపట్ రైల్వే స్టేషన్ల వద్ద అలాంటి కెమెరాలను అమర్చినట్టు గుర్తించారు. ఈ దర్యాప్తులో మరో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. భారతీయ ఫోన్ నంబర్లకు వచ్చే ఓటీపీలను విదేశీయులకు పంపిస్తూ వాట్సాప్, సోషల్ మీడియా అకౌంట్లను నిర్వహించుకునేందుకు

...మిగతా 2లో

బ్యాన్‌ను ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసిన టెలిగ్రామ్ | తర్వాత వాట్సప్‌ను బ్యాన్ చేస్తారా? | పాఠశాల కరిక్యులంలో కేంద్రం జోక్యం వద్దు | పీఎం కిసాన్ నిధులు విడుదల తేదీ ఖరారు | టెక్సాస్‌లో కూలిన విమానం 9

అంచలంచెలుగా

## అవినీతి



- చైన్‌మెన్ టు డిప్యూటీ కలెక్టర్
- 38 ఏళ్లలో రూ.300 కోట్ల అక్రమార్జన
- డిప్యూటీ డైరెక్టర్‌పై సస్పెన్షన్ వేటు
- అరెస్ట్.. రిమాండ్.. చంచల్‌గూడ జైలుకు తరలింపు

2

శాస్త్రీయ పద్ధతిలో

## పూడిక తొలగింపు



- జలాశయాల పూర్వ నిల్వ సామర్థ్య పునరుద్ధరణ
- జలాశయాలు, నీటిపారుదల ప్రాజెక్టుల సమీక్షలో మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, జూన్ 17, (మనం బ్యూరో) :** రాష్ట్రంలోని ప్రధాన నీటి పారుదల ప్రాజెక్టులు, జలాశయాల్లో పూడిక తొలగింపు కోసం దీర్ఘకాలిక వరద నియంత్రణ అవసరాలకు ఉపయోగపడే విధంగా ఆచరణాత్మక, స్థిరమైన శాస్త్రీయ నమూనాను రూపొందించాలని రాష్ట్ర నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆ శాఖ అధికారులను ఆదేశించారు. జలాశయాల పూర్వ నిల్వ సామర్థ్య నిర్వహణకు చర్యలు చేపట్టాలని సూచించారు. బుధవారం తన కార్యాలయంలో జలాశయాలు, నీటిపారుదల ప్రాజెక్టులలో పూడిక తొలగింపు కార్యక్రమాలపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన మంత్రి గోదావరి, కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రధాన జలాశయాల అసలు నీటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. దీంతో నీటి భద్రత మెరుగుపడటంతో పాటు సాగునీటి విస్తీర్ణం పెరుగుతుందనీ, వరద ముప్పు కూడా తగ్గుతుందన్నారు. ఇతర రాష్ట్రాలలో అమలవుతున్న పూడిక తొలగింపు విధానాలను సమగ్రంగా అధ్యయనం చేసి రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా అమలు చేయగల ఉత్తమ విధానాలను గుర్తించాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల అనుభవాలను ప్రస్తావిస్తూ పూడిక తొలగింపు వంటి నివారణ చర్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందనీ, గత ఏడాది పంజాబ్‌లో సంభవించిన తీవ్ర వరదల కారణంగా 16 జిల్లాలు ముంపునకు గురయ్యాయనీ, నష్టపరిహారం, పునరుద్ధరణ చర్యల కోసం దాదాపు రూ. 2 వేల కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చిందని గుర్తు

...మిగతా 2లో

## భారత నావికుల భద్రతే మాకు ముఖ్యం



- అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో మోడీ
- భారత్‌కు అండగా ఉంటాం - ట్రంప్

**పారిస్, జూన్ 17:** హర్మూజ్ జలసంధి వద్ద ఎలాంటి ఆంక్షలు ఉండొద్దని, అక్కడ స్వేచ్ఛా వాణిజ్యం జరగాలని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. అక్కడ వేలాది మంది భారత నావికుల భద్రతే తమకు ముఖ్యమని, వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్‌తో ప్రధాని నరేంద్ర మోడీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. ప్రధాని మోడీ మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో శాంతి కోసం ట్రంప్ కృషి చేశారని, హర్మూజ్ తెరవడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మేలు జరిగిందన్నారు. ఇరు దేశాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం జరగనుందని చెప్పారు.

**భారత్కు అండగా ఉంటాం - ట్రంప్**

ప్రధాని మోడీతో భేటీ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు

...మిగతా 2లో

రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో...

## గుడిసెవాసులకే తొలి ప్రాధాన్యం



- 75 వేల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన
- పూర్తి పారదర్శకతతో అర్హుల ఎంపిక
- మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, జూన్ 17 ( మనం బ్యూరో ) :** రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో గుడిసెవాసులకే తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల గుర్తింపునకు ప్రత్యేక సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఇందిరమ్మ ఇళ్లపై గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 వేల దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పూర్తి పరిశీలన నిర్వహిస్తామన్నారు. పూర్తి పారదర్శకతతో అర్హుల ఎంపిక నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేయని గుడిసె వాసుల కోసం మరో అవకాశం ఇస్తున్నామనీ, రెండో విడతలో భాగంగా 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామని వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 2 వేల ఇళ్లు నిర్మిస్తామనీ, అలాగే, రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామన్నారు.ప్రతి నియోజకవర్గానికి రూ.500 ఇళ్లు నిర్మిచి ఇస్తామనీ, తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ప్రమాదకర ఇంటి పైకప్పుల మార్పునకు రూ.2 లక్షల వరకు సాయం

...మిగతా 2లో

ఆ ఒప్పందం ఫైనల్ కాదు..

## నచ్చకపోతే మళ్లీ దాడులు



### అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్,జూన్ 17:** ఇరాన్ లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్‌తో తాము చేసుకోబోయేది కేవలం అవగాహన ఒప్పందమేనని.. అది ఫైనల్ కాదని పేర్కొన్నారు. ఒకవేళ అందులోని అంశాలు తనకు నచ్చకపోతే, ఇరాన్ తీరు సరిగ్గా లేకపోతే.. ఆ దేశంపై మళ్లీ బాంబులు వేస్తామన్నారు. జీ7 సదస్సు నేపథ్యంలో ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న ట్రంప్ ఈ తరహా వ్యాఖ్యలు చేశారు. మరో రెండు రోజుల్లో అవగాహన ఒప్పందంపై ఇరుదేశాలూ సంతకాలు చేయనున్న వేళ ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

అమెరికా- ఇరాన్ ఒప్పందంలో భాగంగా పునర్నిర్మాణ నిధుల కింద టెహ్రాన్‌కు 300 బిలియన్ డాలర్లు సమకూర్చే అంశం ఉందని వస్తున్న వార్తలు అవాస్తవమని ట్రంప్ తెలిపారు. తాము ఒక్క పైసా కూడా వెచ్చించడం లేదన్నారు. ''మేం పెట్టుబడి పెట్టడం లేదు. మా దగ్గర అటువంటి ఫండ్ ఏదీ లేదు. ఇరాన్‌లో పెట్టుబడులు పెట్టాలని గల్ఫ్ దేశాలనూ కోరడం లేదు. ఒకవేళ వారు ముందుకొస్తే మాకు అభ్యంతరం లేదు. అయితే.. ఇరాన్ ధోరణి ఎలా ఉంటుందో ఒక అవగాహన వచ్చేవరకు కొంతకాలం పాటు ఆ దేశాలు అటువంటి పని చేయకపోవచ్చు'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

'ఇండో' తీసేసి.. మ్యాప్ మార్చి...

## భారత్‌కు షాకిచ్చిన అమెరికా..!



**పారిస్, జూన్ 17:** ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ తమకు కీలకమైన వ్యూహాత్మక భాగస్వామి అని ఒకప్పుడు చాటిచెప్పిన అమెరికా.. ఇప్పుడు గట్టి షాకిచ్చింది. ఈ ప్రాంతంలో పనిచేసే అగ్రరాజ్య సైనిక కమాండ్ పేరు నుంచి 'ఇండో' అనే పదాన్ని తీసేసింది. అంతేకాదు.. భారత చిత్రపటాన్ని కూడా మార్చి చూపించడం వివాదాస్పదమైంది. జీ-7 సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్రమోడీ మధ్య ద్వైపాక్షిక భేటీ జరగనున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

అమెరికాకు చెందిన చారిత్రక 'యూఎస్ ఇండో-పసిఫిక్ కమాండ్' పేరును మళ్లీ 'యూఎస్ పసిఫిక్ కమాండ్'గా మార్చినట్లు అగ్రరాజ్య రక్షణశాఖ వెల్లడించింది. ''చారిత్రక మూలాలను గౌరవించడం, పసిఫిక్‌లో సేవలందించే సైనికుల్లో స్ఫూర్తి పెంపొందించడం కోసం ఈ కమాండ్‌కు పాత పేరునే కొనసాగించాలని నిర్ణయించాం'' అని అమెరికా రక్షణశాఖ పేర్కొంది. ఇక, ఈ కమాండ్ ఎక్కడెక్కడ పనిచేస్తుందో తెలుపుతూ తమ వెబ్‌సైట్‌లో ఓ ఫొటోను ఉంచింది. అందులో 'పాక్ ఆక్రమిత కశ్మీర్'ను పాకిస్థాన్ భూభాగంగా చూపించడం వివాదానికి దారితీసింది.

యూఎస్ పసిఫిక్ కమాండ్ను 1947 జనవరి 1న నాటి అమెరికా అధ్యక్షుడు హ్యారీ ఎస్. ట్రుమ్యాన్ ఏర్పాటుచేశారు. అగ్రరాజ్య వెస్ట్ కోస్ట్ నుంచి భారత పశ్చిమతీరం వరకు గత ఏడు దశాబ్దాలకు పైగా ఈ కమాండ్ సేవలందిస్తోంది. రెండో ప్రపంచయుద్ధం తర్వాత ప్రాంతీయ స్థిరత్వంలో ఈ దళం కీలక పాత్ర పోషించింది. కొరియన్, వియత్నాం యుద్ధాల్లోనూ పనిచేసింది. ఎన్నో మానవతా ఆపరేషన్లను చేపట్టింది. అయితే,

...మిగతా 2లో

ఎవరిది వృద్ధి..

## ఎవరికి వృద్ధి?

### జీ-7లో మోడీ కీలక వ్యాఖ్యలు

**పారిస్, జూన్ 17:** ఫ్రాన్స్‌లోని ఎవియాన్-లే-బేలో బుధవారం జరిగిన జీ-7 కూటమి దేశాల సమావేశంలో ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. జీడీపీ, వాణిజ్య గణాంకాలను దాటి, ఆర్థిక వృద్ధిపై చర్చలు ఉండాలన్నారు. 'అందరికీ సమాన, స్థిర ఆర్థిక వృద్ధి అంశం'పై చర్చ జరపడం మంచి విషయమన్నారు. ''వృద్ధి గురించి ప్రస్తావన వస్తే.. జీడీపీ, వాణిజ్య గణాంకాలు ప్రధానంగా ఉండకూడదు. ఎవరిది వృద్ధి? ఎవరికి వృద్ధి? అది ఏ దిశలో ఉంది? అనే అంశాలను చర్చించాలి'' అని పేర్కొన్నారు. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోయాయి. దీనిని ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనకబడిన దేశాలను వాటిమానాన వాటిని వదిలేయొద్దని, వాటికి సహకరించేందుకు అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సు నేపథ్యంలో ఇంతకుముందు మోడీ మాట్లాడుతూ.. ఇంధనం, ఆహారం, ఆరోగ్యం, సైబర్ సెక్యూరిటీ, ఆర్థిక భద్రత వంటి రంగాలు పెనవేసుకున్న ఈ ప్రపంచంలో.. మానవాళి పురోగతి, శ్రేయస్సు కోసం అంతర్జాతీయ భాగస్వామ్యాలను నిర్మించడం అత్యవసరమని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ సదస్సు ఫ్రాన్స్ ఆతిథ్యం ఇస్తోంది. ఆ దేశ ఆహ్వానం మేరకు మన ప్రధాని అక్కడకు వెళ్లారు. జీ-7లో కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యూకే, యూఎస్ఏ సభ్య దేశాలు. ఐరోపా యూనియన్ కూడా ఈ సదస్సుకు ప్రాతినిధ్యం వహిస్తోంది.

# పెళ్లి కోసం రూ.4కోట్ల నగలు చోరీ

గజియాబాద్, జూన్ 17: ఉత్తర ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో ఓ ప్రముఖ నగల దుకాణంలో భారీ చోరీ జరిగింది. ఈ ఘటనపై దర్యాప్తు చేసిన పోలీసులు విస్తుపోయే విషయాలు వెల్లడించారు. షోరూమ్‌లో పనిచేస్తున్న నితిన్ వర్మ అనే వ్యక్తి తన ప్రేయసి కాజల్ వర్మతో పెళ్లి కోసం ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

నితిన్ అనే వ్యక్తి ప్లాన్ ప్రకారమే నెలన్నర క్రితం షోరూమ్లో చేరాడు. స్టోర్ అంతర్గత కార్యకలాపాలు, భద్రతా ఏర్పాట్లు, విలువైన ఆభరణాలు ఎక్కడ ఉన్నాయి? అనే కీలక విషయాలు తెలుసుకున్నాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు.. తన



ప్రియురాలు కాజల్‌తో వివాహం నిశ్చయమైందని జూన్ 12న నమ్మించి షోరూమ్ సిబ్బందికి మందు పార్టీ ఇచ్చాడు. ఈ పార్టీకి కాజల్ వర్మ, నిందితుడి తండ్రి కూడా హాజరయ్యారు. షోరూమ్ తాళాల బాధ్యత చూసే క్యాషియర్ గౌతమ్ రాజ్ను ఎక్కువ మద్యం తాగేలా ప్రోత్సహించి.. అతడిని ఇంటి దగ్గర దింపే నెపంతో తాళాల్ని కాజేశాడు. మరుసటి రోజు ఉదయాన్నే నితిన్ తన స్నేహితుడితో నగల దుకాణానికి వచ్చి.. దొంగిలించిన తాళం చెవితో షట్టర్ తెరిచి లోపలికి వెళ్లాడు. కేవలం 25 నిమిషాల్లో మొదటి అంతస్తులో ఉన్న బంగారం, వజ్రాలు, రత్నాలు పొదిగిన రూ. 4 కోట్ల విలువైన ఆభరణాలను దోచుకొని అక్కడి నుంచి పరారయ్యారు. షోరూమ్‌లో ఎటువంటి అలారం వ్యవస్థ లేకపోవడంతో ఈ విషయాన్ని ఎవరూ గుర్తించలేకపోయారని పోలీసులు వెల్లడించారు. రాత్రిపూట కాపలాగా ఉండే సెక్యూరిటీ గార్డు ఉదయం 7గంటలకు ఇంటికి వెళ్లిపోయిన అనంతరం ఈ దోపిడీ జరిగిందని వివరించారు. పెళ్లి ఖర్చుల కోసమే ఈ దొంగతనం చేసినట్లు విచారణలో తేలిందన్నారు.ఈ కేసులో నిందితుడు నితిన్తో పాటు అతడి తండ్రి, ప్రేయసిని అరెస్ట్ చేశామని.. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# అంతరిక్ష యాత్రకు ఇండో–అమెరికన్

వాషింగ్టన్,జూన్ 17: ఇండో-అమెరికన్ వ్యోమగామి అనిల్ మేనన్ అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతున్నారు. అనిల్ జులై 14న ప్రారంభం కానున్న



అంతర్జాతీయ అంతరిక్ష యాత్రకు ఆయన మరో ఇద్దరు వ్యోమగాములు ప్యోటర్ డుబ్రోవ్, అన్నా కికినాతో కలిసి వెళ్లనున్నారు. వారు 240 రోజుల పాటు కక్ష్యలో గడపనున్నారు. జూన్ 22న అనిల్ మేనన్ ఇంటర్వ్యూలు ఇస్తారని నాసా వెల్లడించింది.

భారత్, ఉక్రెయిన్ తల్లిదండ్రులకు జన్మించిన అనిల్.. అమెరికా పౌరుడు. 2021లో ఆయన వ్యోమగామిగా ఎంపికయ్యారు. 2024లో 23 ఆస్ట్రోనాట్ క్లాస్ గ్రాడ్యుయేట్ అయ్యారు. అంతకుముందు హార్వర్డ్ నుంచి న్యూరోబయాలజీలో బ్యాచిలర్ డిగ్రీ, స్టాన్‌ఫోర్డ్ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్, మెడికల్లో మాస్టర్ డిగ్రీలను అందుకున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఈయన వ్యోమగామిగానే కాకుండా ఎమర్జెన్సీ మెడిసిన్ ఫిజీషియన్, మెకానికల్ ఇంజినీర్, అమెరికా స్పేస్‌ఫోర్స్ కర్నల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

వ్యోమగామి కాకముందు అనిల్ నాసా ఎక్స్‌పెడిషన్ ఫ్లైట్ సరన్‌గా పనిచేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోని వ్యోమగాములకు సహకరించేవారు. 2021లో నాసా తన వ్యోమగాముల బందంలో అనిల్ను ఎంపిక చేసింది. రెండేళ్ల శిక్షణ తర్వాత 2024లో ఆయన వ్యోమగామిగా పట్టభద్రుడయ్యారు. నాటినుంచి కక్ష్యలోకి తన మొదటి అంతరిక్ష యాత్ర కోసం సిద్ధమవుతున్నారు.

# కఠినంగా ఉండాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఎఫ్ఐఆర్‌లను ఒక్కటిగా కలిపేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణలో భాగంగా భారత ప్రధాన న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు నిరాకరించారు.

సైబర్ నేరాల బాధితులు దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉంటారని సీజేఐ అన్నారు. సైబర్ నేరస్థులు ఒక రాష్ట్రంలో పోలీసులకు దొరికితే మరో రాష్ట్రానికి వెళ్లి అక్కడి ప్రజలను దోచుకుంటారని.. వారిని జైల్లో ఉంచడమే ప్రజలకు మంచిదని పేర్కొన్నారు. గతేడాది చివరి నాటికి భారతీయులు డిజిటల్ మోసాల వల్ల రూ.3వేల కోట్లకు పైగా నష్టపోయారని.. దేశంలో సైబర్ నేరాల తీవ్రతను ఇది తెలియజేస్తోందని సీజేఐ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఉపశమనం కోరేందుకు సంబంధిత హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించారు.

# ఐఎస్ఐ ముఠా గుట్టురట్టు



(మొదటి పేజీ తరువాయి)

సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. ఇందుకు రూ.500 నుంచి రూ.5 వేల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. సిమ్ కార్డుల చోరీ, గతంలోనే యాక్టివేట్ చేసిన సిమ్లను కొనుగోలు చేయడం వంటివి వినియోగించినట్లు సమాచారం. ఆర్థిక లావాదేవీలనూ తమ సొంత అకౌంట్ల ద్వారా కాకుండా జనసేవా కేంద్రాలు, స్థానిక దుకాణాల ద్వారా నగదు రూపంలో స్వీకరించి పోలీసుల కళ్లుగప్పేందుకు యత్నించినట్టు అధికారులు తేల్చారు. ఈ కేసులో మరికొందరి ప్రమేయంపైనా విచారణ కొనసాగుతోందని, దేశ భద్రతకు ముప్పుగా మారే ఇలాంటి నెట్‌వర్క్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# భారత నావికుల భద్రతే మాకు ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. మోడీ అధికారంలో ఉన్నంత కాలం ఎవరైనా దాడి చేస్తే.. భారత్‌కు అమెరికా అండగా ఉంటుందని నవ్వుతూ చెప్పారు. ప్రధాని మోడీ తనకు చిరకాల మిత్రుడని, బేరసారాల్లో ఆయన నిక్కచ్చిగా ఉంటారని అన్నారు. పెట్టుబడుల విషయంలో ఆయన సహకరిస్తున్నారని, అందుకు అభినందిస్తున్నామన్నారు. నేవీ సిబ్బంది భద్రత విషయంలో భారత్తో కలిసి పని చేస్తామన్నారు. భవిష్యత్తులో భారత్‌లో పర్యటిస్తానని అన్నారు.

# శాస్త్రీయ పద్ధతిలో పూడిక తొలగింపు



(మొదటి పేజీ తరువాయి)

చేశారు. సకాలంలో పూడిక తొలగింపు, డ్రైనేజీ వ్యవస్థలు, జలాశయాల సామర్థ్యాల నిర్వహణ వంటి చర్యలు చేపట్టినట్లయితే ఆ వ్యయంలో గణనీయమైన భాగాన్ని నివారించవచ్చన్నారు. పనుల వేగాన్ని పెంచేందుకు కార్యాచరణలో ఉన్న అడ్డంకులను తొలగించేందుకు ఆచరణాత్మక పరిష్కారాలను గుర్తించాలనీ, అదే విధంగా ఎస్సారెస్పీ, నిజాం సాగర్ ప్రాజెక్టుల ప్రధాన ఇంజినీర్లు ఆయా ప్రాజెక్టుల్లో పూడిక పరిస్థితిని సమగ్రంగా అంచనా వేసి కోల్పోయిన నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించేందుకు చేపట్టగల చర్యలపై నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జలాశయాల నిర్వహణలో శాస్త్రీయ, దీర్ఘకాలిక దృక్పదాన్ని అవలంబించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందనీ, వరద నియంత్రణ, నీటి సంరక్షణ, సాగునీటి స్థిరత్వం సాధనలతో పూడిక తొలగింపును కీలక అంశంగా పరిగణిస్తూ ముందుకు సాగుతామని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# గుడిసెవాసులకే తొలి ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)



అందిస్తామనీ, అసంపూర్తిగా వదిలిన ఇళ్లను కూడా ఈ పథకంలో ప్రభుత్వం చేర్చనుందని వెల్లడించారు. లబ్దిదారుడే ఇంటి నిర్మాణదారుడనీ, బీఎల్‌సి విధానంలో నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు. గత పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడూ పేదలకు ఇల్లు నిర్మించి ఇవ్వాలన్న ఆలోచన చేయలేదని విమర్శించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో చాలీచాలని ఇళ్లు నిర్మించి పేద ప్రజలను ఇబ్బంది పెట్టారనీ, వాటిని కూడా సరైన విధంగా పంపిణీ చేయడంలో విఫలమైందన్నారు. పట్టణాల్లో అవసరమైతే జీ ప్లస్ వన్ నిర్మాణాలకు అనుమతి ఇస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి వెల్లడించారు.

### జర్నలిస్టుల ఇండ్లస్థలాలపై

# క్యాబినెట్ సబ్ కమిటీ నివేదికనివ్వాలి



## డిప్యూటీ సీఎం భట్టికి టీడబ్ల్యూజేఎఫ్ వినతి

హైదరాబాద్,జూన్17(మనం న్యూస్) : జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారిధిగా ఉంటూ విస్తృతంగా ప్రజా సేవ చేస్తున్న నేపథ్యంలో వేగంగా ఇండ్లస్థలాలు కేటాయించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మెన్ భట్టి విక్రమార్కను కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎంకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) నాయకత్వం వినతిపత్రం సమర్పించింది. ఈసందర్భంగా జర్నలిస్టుల పరిస్థితులను ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి. బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు ఎల్లోయి ప్రభాకర్, జి మాణిక్‌ప్ర భు, కార్యదర్శి బి.జగదీశ్వర్, రాష్ట్ర నాయకులు పి. విజయ, షేరిభాయి గణేష్, బి. సైదులు, లలిత మంత్రికి వివరించారు. జర్నలిస్టులు సరైన వేతనాలు లేకుండా జీవనం సాగిస్తున్నారని గుర్తు చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పెట్టుబడులతో మీడియా రంగంలో ఉద్యోగ భద్రత కొరవడిందని,ఆర్థిక పరిస్థితులు సవ్యంగా లేక మీడియా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని మంత్రి ప్రతినిధులు వెల్లడించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, వెబ్ మీడియాలో అనేక మార్పులు వస్తున్నాయని,కనీస అవసరాలకు సైతం ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని వివరించారు. గత 40 ఏండ్లకు పైగా జర్నలిస్టులకు హైదరాబాద్‌లో ఇండ్ల స్థలాలు ఇవ్వలేదని, దీంతో ఇంటి అద్దెల భారం విపరీతంగా పడుతున్నదని వివరించారు. హైదరాబాద్ నగరంతోపాటు మున్సిపల్ కార్పొరేషన్‌లు, జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చాలీచాలని వేతనాలతో జర్నలిస్టులు, వారి కుటుంబాల జీవనం అగమ్యగోచరంగా తయారైందని,స్థిర నివాసం లేక అష్ట కష్టాలు పడుతున్నారని మంత్రికి వివరించారు. ఈ పరిస్థితుల్లో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాల్సిన అవసరం ఎంతైన ఉందని వారు పేర్కొన్నారు. ఇందుకోసం ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీ నివేదికను త్వరిగతన సమర్పించాలని సూచించారు. అయితే ఈ ప్రక్రియను ఎలాంటి న్యాయ సంబంధమైనా వివాదాలు లేకుండా చెపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇండ్ల స్థలాలమంజూరి కోసం జర్నలిస్టులు వేయి కండ్లతో దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారని, అలాగే గతంలో మాదిరిగా జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే హెల్త్ కార్డులను మంజూరు చేయాలని భట్టి వారు కోరారు. కాంట్రిబ్యూషన్ జర్నలిస్టుల తరపున ప్రభుత్వమే ఖర్చులు చెల్లించాలి. తద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం అందించాలని వివరించారు. జర్నలిస్టులకు ఇచ్చే అక్రెడిటేషన్‌ల ప్రక్రియను వేగంగా ముగించి, జర్నలిస్టుల అందరికి న్యాయం చేయాలని సూచించారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాల్లో 50 శాతం రాయితీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న ధరలు, ఆకాశాన్నంటిన స్కూల్ ఫీజుల నేపథ్యంలో ఈ విషయమై దృష్టిసారించాలని కమిటి బృందం ఉపముఖ్యమంత్రికి వెల్లడించారు.

# ఇంటింటికీ యోగా

- 1.33 లక్షల సెంటర్లలో కోటి మందితో యోగాంధ్ర
- 20, 21వ తేదీల్లో బాబా రాందేవ్తో కలిసి సీఎం యోగా

(అమరావతి, పి.మీరా హుస్సేన్, మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి) : ఆంధ్రప్రదేశ్ లో సంజీవని కార్యక్రమంతో అనుసంధానం ద్వారా యోగాను రాష్ట్రంలో ప్రతీ ఇంటికి తీసుకు వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఆరోగ్యంపై అందరూ ధ్యాస పెట్టేలా యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ నెల 21న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన యోగా డే కార్యక్రమం నిర్వహణపై అధికారులతో ముఖ్యమంత్రి సచివాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. యోగాంధ్ర నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనే వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని సీఎం నిర్దేశించారు. అత్యుత్త ప్రదర్శన కనపర్చిన యోగా మాస్టర్ ట్రైనర్లకు వచ్చే ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు ప్రత్యేక పురస్కారాలు అందజేయాలని సీఎం సూచించారు. ఇంటింటికీ యోగా ప్రధాన థీమ్గా ఏడాది పాటు కార్యాచరణ ప్రణాళిక చేయాలన్నారు. వివిధ వైద్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి కోసం ప్రత్యేక థెరప్యూటిక్ యోగా కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేయాలని చెప్పారు. ఈసారి యోగా డేకు రాష్ట్రానికి ప్రత్యేక అతిధిగా వస్తున్న ప్రముఖ యోగా గురు బాబా రాందేవ్తో కలిసి ఈనెల 20న ఉండవల్లి గుహల దగ్గర జరిగే యోగా కార్యక్రమంలో పాల్గొనాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. 21వ తేదీన విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహించనున్నారు. స్టేడియంలో 5 వేలు నుంచి 6 వేల మంది యోగా చేసేలా ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి కూడా బాబా రాందేవ్ సహా ముఖ్యమంత్రి హాజరవుతారు. వర్షం కారణంగా ఏమైనా అవాంతరం తలెత్తితే.. ప్రత్యామ్నాయంగా విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో వెయ్యి మందితో స్టేట్ ఈవెంట్ నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. యోగా ప్రచారంలో భాగంగా 19వ తేదీనే రాష్ట్రానికి వస్తున్న బాబా రాందేవ్, అదే రోజు ముఖ్యమంత్రితో సమావేశం అవుతారు. యోగాంధ్రలో భాగంగా ఇప్పటివరకు 2.6 లక్షల మందిని ట్రైనర్లుగా తీర్చిదిద్దినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 21న యోగాడేలో పాల్గొనేందుకు ఇప్పటికే కోటికి మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ముఖ్యమంత్రికి తెలిపారు. 18వ తేదీ నుంచి 20 వరకు విజయవాడలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్టు అధికారులు వివరించారు. 21వ తేదీన 1.33 లక్షల సెంటర్లలో యోగా కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నామని సీఎంకు తెలిపారు. 21 తేదీన 'యోగాడెస్టినేషన్' పేరుతో వచ్చే ఏడాది యోగా డే వరకు కేలండర్ ను ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారు. ఈ సమీక్షకు ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్ బాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా, ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ తదితరులు హాజరయ్యారు.



### 'ఇండో' తీసేసి.. మ్యాప్ మార్చి...

# భారత్‌కుషాకిచ్చిన అమెరికా..!

(మొదటి పేజీ తరువాయి)

ట్రంప్ తొలి దఫా అధికారంలో ఉన్న సమయంలో 2018లో దీని పేరును 'యూఎస్ ఇండో-పసిఫిక్ కమాండ్'గా మార్చారు. హిందూ మహాసముద్రం, పసిఫిక్ మహా సముద్రాల మధ్య పెరుగుతున్న అనుసంధానతను గుర్తించి దీని పేరులో 'ఇండో' అనే పదం చేర్చినట్లు నాటి అమెరికా రక్షణ మంత్రి జేమ్స్ మ్యాటిస్ వెల్లడించారు. అయితే, ఎనిమిదేళ్ల తర్వాత అమెరికా ఇప్పుడు యూటర్న్ తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. వ్యూహాత్మక రక్షణ వ్యవహారాల్లో భారత్ను అగ్రరాజ్యం దూరం పెడుతోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**క్వాడ్ అంతానికి మరో మేకు: శశిథరూర్**

ఈ పరిణామాలపై కాంగ్రెస్ నేత శశిథరూర్ స్పందించారు. 'క్వాడ్ అంతానికి మరో మేకు' అని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సైనిక ప్రాబల్యం పెంచుకుంటున్న చైనాకు అడ్డుకట్ట వేసేందుకు భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ కలిసి క్వాడ్‌గా ఏర్పడిన సంగతి తెలిసిందే. అయితే, ఇటీవల కాలంలో ఈ కూటమి బలహీనపడుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# అంచలంచెలుగా అవినీతి

హైదరాబాద్,జూన్ 17(మనం,ప్రత్యేక ప్రతినిధి): డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిరావు లాండ్ సర్వే విభాగంలో చైన్‌మెన్‌గా రూ. 700 జీతంతో మొదలై చేరి అంచలంచెలుగా రూ. 300 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు ఏసీబీ విచారణలో తేలింది. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిరావును ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరచగా కోర్టు 14 రోజులపాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని చంచల్ గూడ జైలుకు తరలించారు.

నరహరి ఇంట్లో నిర్వహించిన తనిఖీల్లో రూ.1.54 కోట్ల నగదు, బ్యాంక్ అకౌంట్లలో రూ.2.29 కోట్లు, ఆయన పేరిట రూ.5 కోట్ల విలువైన ఫిక్స్డ్ డిపాజిట్లు ఉన్నట్లు గుర్తించారు. అంతేకాక భారీగా బంగారం, వెండి ఆభరణాలను కూడా సీజ్ చేశారు. ఆయన ఇంటిలో 1.3 కిలోల బంగారం, 8 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఇవే కాకుండా విలువైన బాండ్ పేపర్లు, ల్యాండ్ పేపర్లు స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలిలో ఒక జీ ప్లస్ 3 భవనం, నార్సింగిలో 2 హైరైజ్ బిల్డింగ్స్, పుప్పాలగూడ, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో మరికొన్ని హైరైజ్ బిల్డింగ్స్ ను అక్రమంగా సంపాదించినట్లు గుర్తించారు. రంగారెడ్డి జిల్లాలో 5 ఓపెన్ ప్లాట్లు, మహేశ్వరంలో వ్యవసాయ భూమి, ఛత్రినాకలో జీప్లస్ 2 బిల్డింగ్ లకు సంబంధించిన డాక్యుమెంట్లను సీజ్ చేశారు. ఆయన సంపాదనకు, సోదాల్లో బయటపడిన కళ్లు చెదిరే స్థిరాస్తులకు ఏమాత్రం సంబంధం లేకపోవడంతో ఏసీబీ అధికారులే వాటిని చూసి షాకయ్యారు. వాటన్నింటి విలువ మార్కెట్లో సుమారు రూ.300 కోట్ల వరకూ ఉంటుందని అంచనా వేస్తున్నారు.

తెలంగాణ సర్వే, సెటిల్మెంట్, భూ రికార్డుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నరహరి రావుకు తన తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన చైన్‌మెన్ ఉద్యోగంలో చేరాడు. ఈక్రమంలో 1987లో నెలకు రూ.700 జీతంతో ఈ విభాగంలో చైన్‌మెన్‌గా ఉద్యోగం ప్రారంభించిన నరహరి రావు, ప్రస్తుతం రూ.300 కోట్లకు పైగా ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు విచారణ చేపడుతున్నారు. వారసత్వంగా తండ్రి నుంచి వచ్చిన చైన్‌మెన్ ఉద్యోగంతో ప్రస్థానం ప్రారంభించిన నరహరి రావు, అనంతరం డిప్యూటీ డైరెక్టర్ హోదా వరకు ఎదిగారు.

2020 నుంచి 2024 వరకు రెవెన్యూ శాఖకు సంబంధించిన శిక్షణా కేంద్రం తాలీమ్ లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన సమయంలో నరహరి రావుపై అవినీతి ఆరోపణలు ఎక్కువగా ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ కాలంలో రెవెన్యూ శాఖలోని ఆర్ఐలు డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతి పొందేందుకు నిర్వహించిన అర్హత పరీక్షల్లో కొందరిని ఉత్తీర్ణులు చేసే పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు లంచాలు డిమాండ్ చేసి వసూలు చేసినట్లు ఏసీబీ అధికారుల దృష్టికి వచ్చినట్లు సమాచారం. నరహరి రావు తాలీమ్‌లో పనిచేసిన సమయంలో దాదాపు 200 నుంచి 300 మంది ఆర్ఐలు డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతి పొందినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తాలీమ్ అధికారిగా ఉన్న సమయంలో భారీ స్థాయిలో లంచాలు స్వీకరించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ తాలీమ్‌కు సంబంధించిన ఆరోపణల పై ఏసీబీ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిసింది.

# మోదీ నాయకత్వంలో దేదీప్యమానంగా దేశం

- కూటమి రెండేళ్ల విజయోత్సవ సభలో డా. ఏలూరి రామచంద్రారెడ్డి

మార్కాపురం.జూన్, 17,(మనం న్యూస్) :రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మార్కాపురం జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో నిర్వహించిన విజయోత్సవ సభ ఘనంగా జరగడం సంతోషకరమని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు.

సభకు హాజరైన జనసందోహాన్ని చూస్తేనే కూటమి ప్రభుత్వ పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు..

ఈ సందర్భంగా గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి విజయాలు, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజాహిత నిర్ణయాలు మరియు రాష్ట్ర ప్రగతి కోసం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించినట్లు చెప్పారు.

పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన వెలిగొండ ప్రాజెక్టు పూర్తి దిశగా వేగంగా అడుగులు వేయడం, మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేయాలనే ప్రజల ఆకాంక్షను సాకారం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం వంటి అంశాలు ఈ ప్రాంత అభివృద్ధికి కీలక మైలురాళ్లుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలు, ప్రాంతీయ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని అన్నారు. అలాగే కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పన, జాతీయ రహదారుల నిర్మాణం, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, రైతులు, మహిళలు, యువత సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నాయని దేశం దేదీప్యమానంగా వెలిగిపోతుందని తెలిపారు. ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్ఠను మరింతగా పెంచడంలో ప్రధాని మోదీ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ విజయ సునీత, ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, యర్రగొండపాలెం టీడీపీ ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు తదితరులు హాజరయ్యారు.

సభలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు, ప్రాంతీయ అభివృద్ధికి చేపడుతున్న చర్యలపై నాయకులు వివరంగా ప్రసంగించారు. భారీ సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు హాజరై విజయోత్సవ సభను విజయవంతం చేసినందుకు బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అందరికీ ధన్యవాదాలు తెలిపారు.



# రాయదుర్గం వేలంలో కొత్తట్విస్ట్

## ఆ భూముల్లో మా భూములున్నాయ్

### హైకోర్టును ఆశ్రయించిన ఎస్‌బీఐ

హైదరాబాద్,జూన్ 17(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన ప్రాంతమైన రాయదుర్గం భూముల వేలంలో సరికొత్త వివాదం చోటుచేసుకుంది. రాయదుర్గం పరిధిలోని ఐటీ హబ్‌లో ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన భూముల వేలంపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రభుత్వం వేలం వేసిన భూమిలో కొంత భాగం తమదేనని పేర్కొంటూ ఎస్‌బీఐ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది.ఇదిలావుండగా గత నెల 28న రాయదుర్గం పరిధిలో ఉన్న నాలెడ్జ్ సిటీలోని సర్వే నంబర్ 83/1లో ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూములను తెలంగాణ సర్కార్ పబ్లిక్ ఆక్షన్ ద్వారా విక్రయించిన విషయం విదితమే. ఈ వేలంలో ఒక్కో ఎకరం కనీస ధర రూ.170 కోట్ల చొప్పున ప్రభుత్వం నిర్ధారించగా ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ గౌరా వెంచర్స్ ఎకరం ఏకంగా రూ.237 కోట్ల చొప్పున వేలంలో దక్కించుకుని రియల్ రంగంలో చరిత్ర సృష్టించింది.

**ఐదు ఎకరాలపై ః**

సర్వే నంబర్ 83/1 పరిధిలోని భూమిలో 5 ఎకరాల స్థలం తమ బ్యాంక్‌కు చెందినదని, దానికి సంబంధించిన పూర్తి హక్కులు తమ వద్దే ఉన్నాయని ఎస్‌బీఐ తన పిటిషన్‌లో పేర్కొంది. తమ యాజమాన్యంలో ఉన్న భూమిని ప్రభుత్వం ఏకపక్షంగా ఎలా వేలం వేస్తుందని ప్రశ్నిస్తూ, ఈ వేలం ప్రక్రియను నిలిపివేయాలని కోర్టును ఆశ్రయించింది. రూ.కోట్ల విలువైన భూ వివాదానికి సంబంధించిన పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ జరపనుంది.

## హైకోర్టులో బాల్క సుమన్ బెయిల్ పిటిషన్

హైదరాబాద్,జూన్ 17(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః విద్వేషపూరిత ప్రసంగాల చేసిన కేసులో అరెస్ట్ అయిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ హైకోర్టును ఆశ్రయిఁచాడు. ఈ నేపథ్యంలో కింది కోర్టులో ఆయన బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురికావడంతో న్యాయ సహాయం కోసం ఆయన తరపు న్యాయవాదులు హైకోర్టులో అత్యవసర బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. గతనెల 30న బాల్క సుమన్‌ను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయన చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. బాల్క సుమన్ ఇప్పటికే 17 రోజులుగా జైలులోనే ఉన్నారని, దర్యాప్తుకు ఆయన పూర్తిగా సహకరిస్తున్నారని ఆయన తరపు లాయర్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయనకు రాజకీయంగా ఉన్న ప్రతిష్టను దెబ్బతీయడానికే ఈ కేసు పెట్టారని, తక్షణమే బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరారు. కాగా, బాల్క సుమన్ దాఖలు చేసిన లీగల్ బెయిల్ పిటిషన్ హైకోర్టు పరిశీలనకు స్వీకరించింది. దీనిపై ఒకటి రెండు రోజుల్లోనే హైకోర్టు ధర్మాసనం విచారణ జరిపే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.

## సీఎం క్వాష్ పిటిషన్లపై విచారణ పూర్తి

### తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు

హైదరాబాద్,జూన్ 17(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః సీఎం రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో సుదీర్ఘ విచారణ ముగిసింది. గత కొన్ని రోజులుగా ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం బుధవారం ఈ కేసులపై తుది తీర్పును రిజర్వ్ చేసింఇ. 2019లో జరిగిన హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల సమయంలో అప్పటి మల్కాజిగిరి ఎంపీగా ఉన్న సీఎం రేవంత్ కాంగ్రెస్ పార్టీ తరఫున విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అయితే, ఆ ప్రచార పర్వంలో రేవంత్‌రెడ్డి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారంటూ సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ పోలీస్ స్టేషన్లలో వేర్వేరుగా మొత్తం 5 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఏలాంటి అనుమతులు లేకుండా ర్యాలీలు నిర్వహించడం, రోడ్షోల ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి ఆరోపణలను పోలీసులు చార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు.

**క్వాష్ పిటిషన్..ః**

తనపై నమోదైన 5 కేసులను కొట్టేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్‌లు దాఖలు చేశారు. విచారణ సందర్భంగా రేవంత్‌రెడ్డి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. కేసులన్నీ రాజకీయ వత్తిడితో పెట్టినవని, ఎలక్షన్ కోడ్ కింద నేర నిరూపణకు సరైన ఆధారాలు లేవని కోర్టుకు వివరించారు. మరోవైపు ఎన్నికల సంఘం తరపున లాయర్లు నిబంధనల ఉల్లంఘన జరిగిన మాట వాస్తవమేనని వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలను విన్న హైకోర్టు ధర్మాసనం రేవంత్ క్వాష్ పిటిషన్లపై తీర్పును రిజర్వ్ చేసింది. ఈ క్రమంలోనే కోర్టు తీర్పుపై రాజకీయ వర్గాలలో ఉత్కంఠ నెలకొంది.

# ప్రైవేట్ సెక్యూరిటీపై పోలీసు నజర్




- లైసెన్స్‌లేని ఏజెన్సీలపై కఠిన చర్యలు
- సెక్యూరిటీ గార్డుల వెరిఫికేషన్ తప్పనిసరి
- కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలి
- ఇంటెలిజెన్స్ ఏడీజీ విజయ్ కుమార్

హైదరాబాద్, జూన్ 17(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః పీఎస్ఏఆర్ఏ లైసెన్స్ లేని ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటెలిజెన్స్ ఏడీజీ విజయ్‌కుమార్ హెచ్చరించారు. నగరంలోని ఇంటెలిజెన్స్ కార్యాలయంలో ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల ఓనర్స్, అసోసియేషన్ ప్రతినిధులతో బుధవారం ఏడీజీ కీలక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగం ఓఎస్డీ కమలాసన్ రెడ్డి , కూకట్‌పల్లి డీసీపీ రితురాజ్ , అడ్మిన్ ఏజెన్సీ ఎస్పీ జి. చక్రవర్తి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సుమతి గోపాల్ దాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటెలిజెన్స్ ఏడీజీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థలకు లైసెన్స్ లేకుంటే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ 'ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీస్ (రెగ్యులేషన్) యాక్ట్ -2005', తెలంగాణ ప్రభుత్వ జీవో ప్రకారం ప్రతి ఏజెన్సీకి లైసెన్స్ తప్పనిసరి అన్నారు. గతంలో కొందరు ప్రాపర్ లైసెన్స్ లేకుండానే గార్డులను, సూపర్వైజర్లను నియమించినట్లు ఇంటెలిజెన్స్ విభాగం గుర్తించిందన్నారు. ఇకపై నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు ఉంటాయని ఏడీజీ తేల్చిచెప్పారు.

**పోలీస్ వెరిఫికేషన్ ః**

ఇటీవల కాలంలో కొందరు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు నేరాల్లో పాల్గొన్న సంఘటనలు వెలుగుచూడటంపై అడిషనల్ డీజీ ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెన్సీల యజమానులు తాము నియమించుకునే ప్రతి సిబ్బంది యొక్క పూర్వాపరాలను, నేర చరిత్రను పోలీస్ వెరిఫికేషన్ ద్వారా క్షుణ్ణంగా పరిశీలించి వారు 21 రోజుల బేసిక్ ట్రైనింగ్ పొందిన తర్వాతే విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించారు. అలాగే సెక్యూరిటీ గార్డుల శ్రమను దోపిడీ చేయకుండా, ప్రభుత్వం నిర్దేశించిన కనీస వేతన చట్టాలు, ఈఎస్ఐ , పీఎఫ్ వంటి సౌకర్యాలను యజమానులు ఖచ్చితంగా కల్పించాలని సూచించారు. ఈ నిబంధనలను పోలీసు శాఖతో పాటు కార్మిక శాఖ నిరంతరం పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు.

**పోలీసులకు సహకరించాలి ః**

క్షేత్రస్థాయిలో పనిచేసే ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది స్థానిక పోలీసులకు కళ్ళు, చెవులుగా వ్యవహరించాలని ఏడీజీ పిలుపునిచ్చారు. తమ పరిధిలో ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. కాగా ఈ సమావేశంలో పాల్గొన్న సెక్యూరిటీ ఏజెన్సీల ఓనర్స్ అసోసియేషన్ల ప్రతినిధులు తమ లైసెన్సింగ్ ప్రక్రియలు, లైసెన్స్ పునరుద్ధరణ , ఆన్‌లైన్ పోర్టల్, కార్మిక నిబంధనలు, జీతాలకు సంబంధించిన పలు సమస్యలను ఏడీజీ దృష్టికి తీసుకెళ్లారు.వీటిపై సానుకూలంగా స్పందించిన ఏడీజీ పరిపాలనా పరమైన సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కారం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. చట్టబద్ధంగా, నిబంధనల ప్రకారం నడుచుకునే ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలకు పోలీస్, ఇంటెలిజెన్స్, కార్మిక శాఖల తరపున పూర్తి సహకారం అందిస్తామన్నారు.

## టీజీ 20లో వివాదాల పరుగులు

### సెలబ్రెటీలకు లీగల్ నోటీసులు

హైదరాబాద్,జూన్ 17(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'టీజీ20 లీగ్' మ్యాచ్‌లకు లీగల్ వివాదాలు మొదలయ్యాయి. ఈ లీగ్‌ను ప్రమోట్ చేస్తున్న టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండతో పాటు పలువురు సినీ, క్రీడా ప్రముఖులకు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ లీగల్ నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశమైంది. బీసీసీఐ నుంచి ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండానే హెచ్‌సీఏ టీజీ20 లీగ్‌ను నిర్వహిస్తోందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆరోపిస్తోంది. బీసీసీఐ అనుమతి లేని లీగ్‌ను అక్రమంగా ప్రమోట్ చేయడం చట్టప్రకారం నేరమని టీసీఏ స్పష్టం చేసింది. అదేవిధంగా ఈ లీగ్ పేరుతో హెచ్‌సీఏ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ కంపెనీలతో రూ.వందల కోట్ల వ్యాపారాలు చేస్తోందని మండిపడింది.

**లీగల్ నోటీసులు ః**

యువ క్రికెటర్లను తప్పుదోవ పట్టించేలా ఉన్న ఈ లీగ్‌ను ప్రమోట్ చేయడాన్ని తప్పుబడుతూ తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ టాలీవుడ్ హీరోలు విజయ్ దేవరకొండ, వెంకటేష్‌లతో పాటు స్టార్ క్రికెటర్లు మహ్మద్ సిరాజ్, తిలక్ వర్మ, అంబటి రాయుడు లీగల్ నోటీసులు పంపింది. బీసీసీఐ నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్వహిస్తున్న ఈ లీగ్ పునరాలోచన చేయాలని, లేని పక్షంలో చట్టపరంగా కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆ నోటీసుల్లో టీసీఏ స్పష్టంగా పేర్కొంది.

## బాలల భద్రతపై వర్క్‌షాప్



హైదరాబాద్, జూన్ 17(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః నగరంలోని నల్లగండ్లలోని ఇంజీనియం వరల్ స్కూల్లో బాలల భద్రతపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రముఖ శిక్షకురాలు సోనియా గుప్తా ముఖ్యఅతిథిగా పాల్గొని సమగ్ర బాలసురక్ష (బాలల భద్రత) అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సోనియా గుప్తా మాట్లాడుతూ ప్రతి బిడ్డ సురక్షితమైన, రక్షిత వాతావరణంలో పెరగడానికి అర్హులున్నారు. పిల్లల పట్ల దురుసుగా వ్యవహరించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. అలాగే పిల్లలు తమను తాము రక్షించుకునేలా సాధికారత కల్పించడంలో అవగాహన, విద్య అత్యంత శక్తివంతమైన సాధనాలని పేర్కొన్నారు.

## తిని.. బిల్లు కట్టమంటే గన్‌గురి పెట్టాడు

- నగరంలో కానిస్టేబుల్ దురాగతం

హైదరాబాద్,జూన్ 1।(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః కడుపు నిండా తిని బిల్లు కట్టమంటే ఓ కానిస్టేబుల్ గన్ తీసి బెదిరింపులకు పాల్పడ్డాడు. తాను తిన్న తిండికి బిల్లు తగ్గించలేదనే నెపంతో సదరు కానిస్టేబుల్ గన్ తీసి బెదిరింపులకు దిగడం పోలీసు శాఖలో చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ వివేక్ గచ్చిబౌలిలోని మెమోస్ డిలైట్ ఫుడ్ కోర్టులో ఫుడ్ ఆర్డర్ చేశాడు. తిన్న తర్వాత వచ్చిన బిల్లును చూసి, తనకు బిల్లు తగ్గించాలంటూ ఫుడ్ కోర్టు యజమానితో వాగ్వాదానికి దిగాడు. అందుకు వారు అంగీకరించకపోవడంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన గురైన కానిస్టేబుల్ వివేక్.. తన వద్ద ఉన్న సర్వీస్ గన్ను బయటకు తీశాడు.

యజమానిపైకి గన్ గురిపెట్టి, కాల్చేస్తానంటూ బహిరంగంగా బెదిరింపులకు దిగాడు. ఈ షాకింగ్ ఘటనతో అక్కడున్న కస్టమర్లు అంతా భయంతో పరుగులు తీశారు.రంగంలోకి గచ్చిబౌలి పోలీసులు..అయితే, కానిస్టేబుల్ వివేక్ గన్ బెదిరింపులపై ఫుడ్ కోర్టు యజమాని వెంటనే స్థానిక గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, బాధితుడి నుంచి ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు.



## ఉస్మానియా మెడికల్ కాలేజీలో ర్యాగింగ్

### 12మంది విద్యార్థులపై కేసు

### 6నెలల పాటు కాలేజీ నుంచి సస్పెండ్

హైదరాబాద్,జూన్ 17(మనం,ప్రత్యేక ప్రతినిధి) ః హైదరాబాద్ నగరంలోని ఉస్మానియా మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ వ్యవహారంలో 12 మంది విద్యార్థులపై పోలీసులు కేసు నమోదు చేశారు. బీడీఎస్ బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జరీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులను బీడీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు ర్యాగింగ్ చేశారని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఉస్మానియా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ సంజీవ్ సింగ్ యాదవ్ ఫిర్యాదుతో 12 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులపై తెలంగాణ ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్ కింద సుల్తాన్ బజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈక్రమంలో ర్యాగింగ్ కు పాల్పడిన వారిని మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆరు నెలల పాటు సస్పెండ్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ ఘటన కలకలం రేపుతోంది. ర్యాగింగ్ పై నిషేదం విధించినప్పటికీ కొంతమంది విద్యార్థులు దానిని కొనసాగించడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు కాలేజీల్లో కొన్ని ర్యాగింగ్ ఘటనలు వెలుగులోకి వస్తున్నా చాలా వరకు అసలు బయటకు రావడంలేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో యాజమాన్యాలు సైతం ర్యాగింగ్ భూతాన్ని నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట

### పాత్రికేయ కుటుంబాలకు అండగా మీడియా అకాడమీ

### మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్,జూన్17(మనం న్యూస్)ః జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ ఆడిటోరియంలో నిర్వహించిన జర్నలిస్టుల సంక్షేమ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన 21 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఇందులో 17 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబ సభ్యులు,నలుగురు అనారోగ్యానికి గురైన జర్నలిస్టులు ఉన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడి, ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని వెల్లడించారు. జర్నలిస్టుల సంక్షేమ నిధి పథకం కింద మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించడంతోపాటు ఐదు సంవత్సరాల పాటు నెలకు రూ.3,000 పెన్షన్, అలాగే కుటుంబంలోని ఇద్దరు పిల్లలకు నెలకు రూ.1,000 చొప్పున ట్యూషన్ ఫీజు అందిస్తున్నాట్లు చైర్మన్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు ఈ ప్రభుత్వం 159 మంది పాత్రికేయ కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు. అనంతరం సభలో పాల్గొన్న వారందరూ తమ మధ్య నేడు లేని పాత్రికేయులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించి సంతాపం వ్యక్తం చేశారు. మరణించిన జర్నలిస్టుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

# లాభాల పేరిట మోసాలు

- దేశ వ్యాప్తంగా 10వేల మంది బాధితులు
- ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్‌లో ఫిర్యాదులు
- నిందితునిపై లుక్ అవుట్ నోటీసులు

హైదరాబాద్,జూన్ 8(మనం,ప్రత్యేక ప్రతినిధి) ః షేర్ మార్కెట్లో పెట్టుబడుల పేరుతో అమాయక ప్రజలను నమ్మించి వందల కోట్ల రూపాయల మేర భారీ మోసానికి పాల్పడిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. తమ ద్వారా షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయంటూ షేర్స్ బజార్ , కిసాన్ పరివార్ సంస్థలు నమ్మబలికాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన వందల మందితో పాటు దేశవ్యాప్తంగా వేలాది మందిని ఈ సంస్థలు బురిడీ కొట్టించాయి. ఈ క్రమంలో మోసపోయిన బాధితులు సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ దందా గుట్టు రట్టయింది. మహబూబాబాద్ జిల్లా కందికొండ గ్రామానికి చెందిన భూపాల్ భారీ మోసానికి సూత్రధారిగా గుర్తించారు. అతను కొండాపూర్ 'షేర్స్ బజార్' అనే సంస్థను ప్రారంభించి.. తమకు సెబీ రిజిస్ట్రేషన్ ఉందని నకిలీ ప్రచారం చేస్తూ పెట్టుబడిదారులను ఆకర్షించాడు. లక్ష రూపాయల పెట్టుబడి పెడితే నెలకు 4 శాతం చొప్పున ఖచ్చితమైన రాబడి ఇస్తామని నమ్మబలికాడు. తన వ్యాపారాన్ని విస్తరించేందుకు ఏకంగా 150 మందికి పైగా ఉద్యోగులతో ఒక పెద్ద కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశాడు. ఈ కాల్ సెంటర్ ద్వారా ఫోన్ కాల్స్, ఆన్‌లైన్ ప్రచారాలు చేస్తూ పెద్ద ఎత్తున కస్టమర్లను వలలో వేసుకున్నాడు.

**నమ్మించి మోసం ః**

భూపాల్ ప్రారంభించిన సంస్థ మాటలు నమ్మిన బాధితులు లక్షల నుంచి కోట్ల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టారు. కొందరైతే తమ పొలాలు, భూములు, బంగారం అమ్మి వచ్చిన డబ్బును కూడా ఈ సంస్థలో డిపాజిట్ చేశారు. అయితే, 2025 అక్టోబర్ నుంచి పెట్టుబడిదారులకు ఇవ్వాల్సిన పేఔట్లను భూపాల్ అకస్మాత్తుగా నిలిపివేశాడు. బాధితుల నుంచి ఒత్తిడి పెరగడంతో.. తానూ ఎవరికీ డబ్బులు ఇవ్వనని, తనను ఎవరూ ఏమీ చేయలేరంటూ బెదిరింపులకు దిగాడు.ఇప్పటికే గుజరాత్‌కు చెందిన కొందరు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్కడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు భూపాల్ దేశం విడిచి పారిపోకుండా గుజరాత్ పోలీసులు లుక్ అవుట్ నోటీసులు కూడా జారీ చేశారు. దేశవ్యాప్తంగా దాదాపు 10 వేల మంది వరకు బాధితులు ఉండవచ్చని, మోసం విలువ వందల కోట్ల రూపాయల్లో ఉంటుందని అంచనా వేస్తున్నారు.

## రెండేళ్లలో 20 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం: మంత్రి టీజీ భరత్ గుప్తా

- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో పనిచేస్తున్నాం



కర్నూలు జూన్ 17 మనం న్యూస్: కూటమి ప్రభుత్వం రెండేళ్లలో 20 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా అన్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం బండపురంలో బోద రిత్విక్ వెంచూర్స్ ప్రైవేట్ లిమిటెడ్ క్యాంపా ష్యూర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ను స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం ప్లాంట్ యజమానులు మంత్రి, ఎమ్మెల్యేకు ప్లాంట్ గురించి వివరించారు. అనంతరం మంత్రి టీజీ భరత్ గుప్తా మాట్లాడుతూ 90 రోజుల్లో ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తి చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా 150 మందికి, పరోక్షంగా 200 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తమ ప్రభుత్వంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం అమలుచేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కృషితో దేశంలోకి వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. రిలయన్స్ కంపెనీ రాష్ట్రానికి రావడంతో దానికి అనుబంధంగా చాలా యూనిట్స్ ఏర్పాటవుతున్నాయని అన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ స్థానికంగా ఇలాంటి కంపెనీలు రావడం సంతోషంగా ఉందన్నారు. పెట్టుబడిదారులకు తమ సహకారం ఎప్పటికీ ఉంటుందన్నారు. ప్లాంటును మరింత విస్తరించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, మంత్రి టీజీ భరత్ నాయకత్వంలో రాష్ట్రం పారిశ్రామికంగా దూసుకువెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ప్రతినిధులు ఆర్పన్ బసు, ప్రథమేష్ మెహ్తా, రాకేష్శర్మ, ఎం.డి కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## భ్రమల్లో బ్రతుకులు.!

అన్నీ నాలిక దగ్గరగా వచ్చి
అర్థాంతరంగా ఆగిపోతున్నాయి
అన్నీ ముందుకు నడిచినట్టే
వెనకబడిపోతున్నాయి
అన్నింటిలోనూ సరితూగుతూనే
కాలానికి రెక్కలొచ్చేస్తున్నాయి

ప్రతిదీ అర్హతకు అతుక్కున్నట్టు
భ్రమల్లోకి నెట్టబడుతూనే
ఆశల తివాచీపై నడిచినట్టు
ప్రతి పథకం ఊరిస్తుంది
గాలి దీపాల వెలుతురులో
జీవనం సర్దుకుంటూనే
చీకటితో చేయి కలపాల్సి వస్తుంది

అన్నీ అందినట్టే అందుతూ
ఏదో ఒక వైఫల్యంతో
నీరుగారిపోతూ కనిపిస్తాయి
గాలి విసురు మాటల కోటలో
చిరు దీపపు తండ్లాటలో
ఏన్నో కోరికల ముళ్ళు మధ్య
బ్రతకడమే సాహసమైపోయింది

ప్రతిదీ హత్తుకున్నట్టే
ప్రతి భరోసా తలుపు తట్టినట్టే
అగుపిస్తూ మురిపిస్తాది
తెల్లవారితే కల చెదిరిపోయినట్లు
వాగ్దానపు తెరలు తొలిగిపోతాయి
గందరగోళపు సమయాలతో
రోజూవారి జీవన సంద్రంలో
మునకలేయడమే పనైపోయింది

**- నరెద్దుల రాజారెడ్డి**
9666016636

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు**
**manamlekhalu@gmail.com**
**మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**

**ఈ పేపర్ కోసం**
**https://www.manamepaper.com/**
**వెబ్‌సైట్‌లో చూడండి**
**- ఎడిటర్**


# ‘సర్’ ప్రజాస్వామ్య శుద్ధికా? రాజకీయ లబ్ధికా?

భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు సంపూర్ణమైన, నిష్పాక్షికమైన ఎన్నికల ప్రక్రియే ప్రాణాధారం. ఓటరు జాబితా ఎంత ఖచ్చితంగా, పారదర్శకంగా ఉంటే ప్రజాస్వామ్య పునాదులు అంతగా బలపడతాయి. ఈ నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ‘ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం’ (ఎస్ఐఆర్ - స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) తీవ్ర రాజకీయ చర్చకు, మేధోమథనానికి దారితీసింది. అధికారికంగా ఇది ఓటరు జాబితాల్లోని దీర్ఘకాలిక లోపాలను సరిచేయడం, నకిలీ, అర్హతలేని ఓటర్లను తొలగించడం, అర్హులైన ప్రతి పౌరుడిని జాబితాలో చేర్చడం కోసం తలపెట్టిన బృహత్తర సంస్కరణగా ఎన్నికల సంఘం పేర్కొంటోంది. ప్రతిపక్షాలు మాత్రం దీనిని ఎన్నికల ముంగిట అధికార పక్షానికి లబ్ధి చేకూర్చేలా, ఒక వ్యూహం ప్రకారం ప్రతిపక్ష సానుభూతిపరుల ఓట్లను గైర్హాజరు చేసేందుకు ఉద్దేశించిన రాజకీయ ప్రేరిత చర్యగా విమర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ సాధ్యాసాధ్యాలను, చారిత్రక పరిణామాలను సమగ్రంగా విశ్లేషించాల్సిన అవసరముంది.

భారత రాజ్యాంగంలోని 324వ అధికరణ ప్రకారం దేశంలో స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికల నిర్వహణ బాధ్యత స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘానికి అప్పగించబడింది. ఓటరు జాబితాలను నిరంతరం నవీకరించడం, వాటి స్వచ్ఛతను కాపాడడం ఈ రాజ్యాంగబద్ధ సంస్థ ప్రాథమిక విధి. సాధారణంగా ప్రతి సంవత్సరం దేశంలో సంక్షిప్త సవరణ జరుగుతుంది. ఇందులో కేవలం కొత్తగా 18 ఏళ్లు నిండిన వారిని చేర్చడం, మరణించిన వారి వివరాలను తొలగించడం వంటి పరిమిత ప్రక్రియలు ఉంటాయి. కానీ, దేశంలో మారుతున్న జనాభారేటు, ఉపాధి కోసం సాగుతున్న అంతర్గత వలసలు, పట్టణీకరణ, సాంకేతిక మార్పుల వల్ల క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాల్లో భారీ వ్యత్యాసాలు చోటుచేసు కుంటున్నాయి. ఒకే వ్యక్తి పేరు బహుళ నియోజకవర్గాల్లో లేదా ఒకే నియోజకవర్గంలో వివిధ బూత్లలో నమోదవడం వంటి ‘ద్వంద్వ ఓట్ల’ సమస్య ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోంది. ఈ క్రమరాహిత్యాలను శాశ్వతంగా నివారించేందుకు, సాధారణ సంక్షిప్త సవరణల కంటే భిన్నంగా, క్షేత్రస్థాయిలో లోతైన పరిశీలనతో కూడిన ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల సంఘం తెరపైకి తెచ్చింది.

ప్రస్తుతం భారతదేశంలో నమోదిత ఓటర్ల సంఖ్య సుమారు 100 కోట్లకు పైగా ఉండి, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఓటరు గణాంక వ్యవస్థగా నిలిచింది. ప్రతి సార్వత్రిక ఎన్నికల చక్రంలో లక్షలాది మంది కొత్త ఓటర్లు ఈ జాబితాలోకి ప్రవేశిస్తుండగా, మరణాలు, శాశ్వత వలసల కారణంగా వేలాది మంది పేర్లను తొలగించాల్సి వస్తోంది. ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం, గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా దాదాపు 2 నుండి 3 శాతం ఓట్లు సాంకేతిక లోపాలు, తప్పుడు చిరునామాలు లేదా నకిలీ గుర్తింపు కార్డుల కారణంగా దుర్వినియోగం అవుతున్నట్లు అంచనా. ఈ సమస్యను అధిగమించడానికి ఎన్నికల సంఘం ఆధార్ అనుసంధానం, డిజిటల్ బయోమెట్రిక్ ధ్రువీకరణ, కేంద్ర జనన-మరణ నమోదుల విభాగం సమాచార వ్యవస్థలను సమన్వయం చేసుకుంటూ, స్థానిక రెవెన్యూ యంత్రాంగం సాయంతో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది.

ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని భౌతికంగా సందర్శించి, ఓటర్ల సజీవ స్థితిని ధ్రువీకరించేలా రూపకల్పన చేశారు. పౌరుల నుంచి అభ్యంతరాలను, సూచనలను స్వీకరించడానికి ప్రత్యేక గడువులను ప్రకటించారు. ఇది పూర్తిగా నిష్పాక్షికమైన, చట్టబద్ధమైన పరిపాలనా ప్రక్రియ అని, ఇందులో ఎలాంటి రాజకీయ జోక్యానికి తావులేదని ఎన్నికల సంఘం




వాదిస్తోంది. పారదర్శకతను నిరూపించేందుకు గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను, బూత్‌స్థాయి ఏజెంట్లను ఈ ప్రక్రియలో భాగస్వాములను చేసి, సవరించిన డ్రాఫ్ట్ కాపీలను క్రమం తప్పకుండా పంపిణీ చేస్తున్నట్లు స్పష్టం చేస్తోంది.

కానీ, క్షేత్రస్థాయి వాస్తవాలు, ప్రతిపక్షాల ఆందోళనలు మరో కోణాన్ని ఆవిష్కరిస్తున్నాయి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ వంటి ప్రధాన జాతీయ, ప్రాంతీయ శక్తులు ఎస్ఐఆర్ తుది ఫలితాలపై తీవ్ర అపనమ్మకాన్ని వ్యక్తపరుస్తున్నాయి. ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఇటువంటి భారీ ప్రక్షాళన చేపట్టడం వల్ల సమాజంలో వెనుకబడిన వర్గాలైన పేదలు, వలస కార్మికులు, గిరిజనులు, సంచార జాతులు, పట్టణ మురికివాడల ప్రజలు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. నిరక్షరాస్యత, అవగాహనా లోపం కారణంగా వీరు నిర్ణీత సమయంలో అవసరమైన గుర్తింపు పత్రాలను సమర్పించలేరని, దీన్ని ఆసరాగా చేసుకుని అధికార పక్ష అనుకూల యంత్రాంగం ఉద్దేశపూర్వకంగా ప్రతిపక్ష ఓటు బ్యాంకును నిర్వీర్యం చేసే అవకాశం ఉందని ఆరోపిస్తున్నారు. తగిన పత్రాలు లేవనే సాకుతో లక్షలాది మంది నిరుపేదల పేర్లను జాబితాల నుండి తొలగించడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే అవుతుందని ప్రతిపక్షాలు గళమెత్తు తున్నాయి.

ఈ వివాదంలో అత్యంత కీలకమైన అంశం ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై వస్తున్న విమర్శలు. గత కొన్నేళ్లుగా ఎన్నికల షెడ్యూళ్ల ఖరారు, ఎన్నికల నియమావళి అమలు, ఈవీఎంల పనితీరు, విపక్ష నాయకులపై చర్యల వంటి విషయాల్లో ఎన్నికల సంఘం తీరు అధికార పక్షానికి అనుకూలంగా ఉందనే ఆరోపణలు దేశంలో బలంగా వినబడు తున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియను కూడా రాజకీయ విశ్లేషకులు, పౌర సమాజం అనుమానపు దృక్పథంతోనే పరిశీలిస్తున్నాయి.

దీనికి భిన్నంగా అధికార పక్షమైన భారతీయ జనతా పార్టీ మరియు దాని మిత్రపక్షాలు ఈ సంస్కరణను గట్టిగా సమర్థిస్తున్నాయి. ఓటరు జాబితా స్వచ్ఛత అనేది పారదర్శక ప్రజాస్వామ్యానికి కనీస అవసరమని వారి వాదన. చనిపోయిన వారి పేరిట దొంగ ఓట్లు పడటం, సరిహద్దు రాష్ట్రాల్లో అక్రమ వలసదారులు దేశీయ ఓటరు కార్డులు పొందడం, ఒకే ఓటరు వేర్వేరు నియోజక వర్గాల్లో ప్రభావం చూపడం వంటి అక్రమాలను అడ్డుకోకపోతే, నిజాయితీ గల పౌరుడి ఓటుకు విలువ లేకుండా పోతుందని అధికార పక్షం పేర్కొంటోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఓటరు జాబితాలను శుద్ధి చేయడం ద్వారా ఎన్నికల ఫలితాలపై దేశ ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుందని, దీన్ని రాజకీయం చేయడం తగదని వారు హితవు పలుకుతున్నారు.

భారత ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే ఓటరు జాబితాలపై వివాదాలు, ఆరోపణలు సరికొత్తవేమీ కావు. 1990ల కాలంలో టి.ఎన్. శేషన్ ముఖ్య ఎన్నికల కమిషనర్‌గా ఉన్నప్పుడు ఫోటో గుర్తింపు కార్డులను (ఎపిక్) ప్రవేశపెట్టి నప్పుడు కూడా ఇలాంటి రాజకీయ అభ్యంతరాలు, సవాళ్లు ఎదురయ్యాయి. కాలక్రమేణా డిజిటలైజేషన్ పెరిగినప్పటికీ లోపాలు పూర్తిగా సమసిపోలేదు. 2015 బీహార్ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ, 2018 తెలంగాణ ఎన్నికల్లో లక్షలాది మంది ఓట్లు అకస్మాత్తుగా మాయమయ్యాయనే ఆరోపణలపైనా తీవ్ర దుమారం రేగింది. 2019 పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో, అలాగే 2024 సార్వత్రిక ఎన్నికల్లో సైతం కొన్ని నిర్దిష్ట వర్గాల ఓట్లను తొలగించారంటూ న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఒకవైపు వేలాది మంది అర్హుల పేర్లు జాబితాలో కనిపించకపోవడం ఎన్నికల వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు.

ఎన్నికల సంఘం తాజా నివేదికల ప్రకారం, ప్రతి శాస్త్రీయ సవరణ ప్రక్రియలో సగటున 1.5 నుండి 2 కోట్ల మంది కొత్త ఓటర్లు నమోదవుతుండగా, దాదాపు కోటికి పైగా అనర్హులైన లేదా మరణించిన వారి పేర్లు తొలగించబడుతున్నాయి. గతిశీలమైన భారత జనాభా రీత్యా ఈ ప్రక్రియను పూర్తిగా నిలిపివేయడం ఏ ప్రభుత్వానికైనా, వ్యవస్థకైనా అసాధ్యం. అయితే, ఈ సాంకేతిక ప్రక్షాళన వేగంలో ఏ ఒక్క నిజమైన పౌరుడి ప్రాథమిక ఓటు హక్కు కూడా హరించుకుపోకూడదనే రాజ్యాంగ స్ఫూర్తిని మరువరాదు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది కేవలం ఐదేళ్లకు ఒకసారి వేసే ముద్ర కాదు. అది పౌరుడి ఆత్మగౌరవానికి, దేశ సార్వభౌమాధికారంలో భాగస్వామ్యానికి ప్రతీక. అందువల్ల ఈ సవరణ ప్రక్రియలో అత్యంత అప్రమత్తత అవసరం.

చివరగా, ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే పవిత్ర సంస్కరణగా నిలుస్తుందా, లేక కేవలం రాజకీయ వివాదాల కేంద్రబిందువుగానే మిగిలి పోతుందా అనేది అది క్షేత్రస్థాయిలో అమలయ్యే తీరుపైనే పూర్తిగా ఆధారపడి ఉంటుంది. ఈ ప్రక్రియ విజయవంతం కావాలంటే, ఎన్నికల సంఘం కేవలం పరిపాలనాపరమైన మొండితనంతో కాకుండా, సంపూర్ణ పారదర్శకతతో వ్యవహరించాలి. జాబితా నుండి ఏ ఒక్క పేరును తొలగించినా, అందుకు గల నిర్దిష్ట కారణాలను, ఆధారాలను బహిరంగపరచాలి.

అభ్యంతరాలు తెలపడానికి, తప్పులను సరిదిద్దుకోవడానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పౌరులకు గడువును, తగినంత ప్రచారాన్ని విస్తృతంగా కల్పించాలి. కేవలం రాజకీయ పక్షాలపైనే కాకుండా స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజ ప్రతినిధుల పర్యవేక్షణను కూడా అనుమతించాలి. ఎన్నికల సంఘం యొక్క నిష్పాక్షికత, రాజకీయ పార్టీల బాధ్యతాయుతమైన సహకారం, ప్రజల అప్రమత్తత సమ్మిళితమైనప్పుడే ఓటరు జాబితాలు పవిత్రంగా, విశ్వసనీయంగా మారుతాయి. లేనిపక్షంలో, ప్రతి ఎన్నికల ముందు పునరావృతమయ్యే ఈ అనుమానాలు, ఆరోపణలు దేశ ప్రజాస్వామ్య పునాదులను బలహీనపరిచే ప్రమాదముంది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# పిల్లలకు పుస్తకాల మోత!

రాష్ట్రంలో బడిగంట మోగింది. రెండు నెలల వేసవి సెలవులనంతరం పాఠశాలలు పునప్రారంభం అయ్యాయి. పై చదువులు కొత్త పాఠ్యాంశాలకు పిల్లలు మానసికంగా సన్నద్ధం అవుతుంటే తల్లిదండ్రులు మాత్రం పెరిగే ఫీజులకు ఆర్థికంగా సన్నద్ధం కావాల్సి వస్తుంది. దీంతో పిల్లలకు పుస్తకాల మోత తల్లిదండ్రులకు ఫీజుల మోత మోగనుంది. పిల్లలకు కాసంత నాణ్యమైన విద్య అందించాలనే ఆశ తల్లిదండ్రులది. సమాజమనేది పెద్ద నుండి చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగుల నుండి పెద్ద, చిన్న ప్రైవేటు ఉద్యోగులు, శ్రమను నమ్ముకునే కార్మికుల మిళితం. వీరిలో ఒక్కరి అంతరాన్ని బట్టి ఆర్థిక స్తోమతను బట్టి పాఠశాలలు ఎంచుకునే పరిస్థితిలు ఉన్నాయి మన విద్య విధానంలో. రాష్ట్రంలో సేవగా, ఉచితంగా అందాల్సిన విద్య వ్యాపారం ఐపోయింది.




తమ పిల్లలు ప్రయోజకులు కావాలన్న కాంక్ష ఏ తల్లిదండ్రులకైన ఉంటుంది. ఎన్ని కోట్లు సంపాదించిన ఉండని సంతృప్తి పిల్లలు ప్రయోజకులైతే కలుగుతుంది. ఈ చిన్న జిజ్ఞాసే తల్లిదండ్రులను తనువు తాకట్టు పెట్టై అయిన తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే భావన కలుగా చేస్తుంది. ప్రస్తుతం మన రాష్ట్రంలో ప్రైవేటు విద్యలయాల ఫీజు నిర్ధారించే విధి విధానాలు లేవు. ఫీజులపైన నియంత్రణ లేదు.

ఏ పాఠశాలల ఫీజులకు వారే నిర్ణయాధినేతలు. కొన్ని పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచేస్తున్నాయి. ఈ విద్య సంవత్సరం ప్రైవేట్ విద్యా సంస్థలు ఏకంగా 35 నుండి 40 శాతం వరకు ఫీజులు పెంచుతున్నాయనే వార్తలు సామాజిక మాధ్యమాల్లో చెక్కర్లు కొడుతున్నాయి. రాష్ట్రంలో ఐఐటి, ఈ టెక్నో, డిజి, ఇంటర్నేషనల్ ఇలా రకరకాలుగా ప్రైవేట్ విద్యాసంస్థలు పుట్టుకొస్తున్నాయి. వీటిల్లో లక్షల్లో ఫీజులు. విద్య సంవత్సరం ఫీజు పక్కనపెడితే కేవలం అడ్మిషన్ ఫీజు అని వేలకు వేలు వసూలు చేస్తున్నారు. వీటితో పాటు పుస్తకాల ఖర్చు, యూనిఫాం ఖర్చు, బెల్ట్ టై, షు, స్కూల్ బస్ ఫీజు అని అదనంగా వేలకు వేలు వసూలు చేస్తున్నారు. ఎడతెరిపిలేని ఫీజుల వసూళ్లతో తల్లిదండ్రుల జేబులు ఖాళీ అవుతున్నాయి అన్నది నిజం. కడుపున పుట్టిన బిడ్డలకు నాణ్యమైన విద్య అందించాలనే చిన్న స్వార్థం తల్లిదండ్రులను అప్పుల పాలు చేస్తుంది.

రాష్ట్రంలో కనీస మౌలిక సదుపాయాలు లేని విద్యాసంస్థలు చాలా ఉన్నాయి. పట్టణాలలో కనీస ఆట స్థలాలు లేని పాఠశాలలు ఉన్నాయి. ప్రైవేటు విద్య సంస్థల్లో అర్హత గల బోధన బోధనేతర సిబ్బందిపై పర్యవేక్షణ లేదు. పాఠశాలల పని వేళలా మీద ఖచ్చితమైన నిర్దేశాలు లేవు. కొన్ని పాఠశాలల ప్రారంభ సమయం పాఠశాల ముగింపు వేలలో పాఠశాలల తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాయి. నిర్ణీత సమయం కంటే ఎక్కువ సమయం పాఠశాలలు ఉంచి పిల్లలకు మానసిక భారం మోపుతున్నారనడంలో సందేహం లేదు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రామాణిక పాఠ్యాంశాలలో పాటు ప్రత్యేక తరగతులంటు అన్ని పుస్తకాలు పెన్నులతో నిండే బ్యాగుల బరువు మోయలేక కొందరి పిల్లల వెన్నుముక సైతం వంగిపోతుంది. సరియైన వెలుతురు లేని తరగతి గదులలో విద్యుత్ బల్బుల వెలుగులతో లేత కనులు దెబ్బతిని కళ్ళజోడు పెట్టుకోవాల్సిన వస్తుంది. కొన్ని పాఠశాలలు ర్యాంకుల కోసం పిల్లలను యాంత్రికంగా మారుస్తున్నారు. కేవలం కొన్ని పాఠశాలలు మాత్రమే తమ పారదర్శకత చాటుతూ తమ ఫీజుల వివరాలు, బోధన సిబ్బంది అర్హతలు, మౌలిక సదుపాయాలు బహిరంగంగా ప్రదర్శిస్తు పారదర్శకత చాటుతున్నాయి.


రాష్ట్రంలో తల్లిదండ్రులు చదువు కొనడంలో అలసిపోతున్నారన్నది నిజం. గత కొన్ని నెలల క్రితం దేశ అత్యున్నత న్యాయస్థాన న్యాయమూర్తి రిక్షా వారి పిల్లలైనా, కోటీశ్వరుల పిల్లలైనా, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి పిల్లలైనా ఒకే తరగతి గదిలో ఒకే బెంచిపై చదవాలని తీర్పు నిచ్చింది. కానీ దీని అమలు ఎక్కడ సాధ్యం కావడం లేదు. దీనికి కొంత ఊతమిచ్చే విద్య హక్కు చట్టం 2009 రాష్ట్రంలో అమల్లో లేదు.

కనీసం ప్రభుత్వాలైన ఫీజుల నియంత్రణపై చర్యలు చేపట్టాలి. ర్యాంకుల కన్న పిల్లలో సృజనాత్మకత పెంచేలా పాఠశాలలను ప్రోత్సహించాలి. ఇటు పిల్లల్లో మానసిక బారం అటు తల్లిదండ్రులకు ఫీజుల ఆర్థిక బారం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

**- భైరబోయిన వెంకటేశ్వర్లు**

# సామాజిక చైతనశిల్పి ‘గోర్కీ’

రష్యా విప్లవ సాహిత్యానికి శిల్పి, కార్మిక వర్గపు మౌనమైన ధ్వనికి శబ్దరూపం ఇచ్చిన గొప్ప రచయిత మాక్సిం గోర్కీ. ఆయన అసలు పేరు అలెక్సీ మక్సిమోవిచ్ పేష్కోవ్. 1868 మార్చి 28న నీజ్నీ నోవ్గొరోడ్ పట్టణంలో జన్మించిన గోర్కీ, 1936 జూన్ 18న మాస్కోలో మరణించాడు. తన రచనల ద్వారా సామాజిక వాస్తవికతకు (Social Realism) స్థాపకుడిగా నిలిచిన గోర్కీ, అంతర్జాతీయ స్థాయిలో సాహిత్యానికి, విప్లవాలకు ఒక ధ్రువ తారగా మారాడు.



బాల్యం నుంచి ఎదురైన కష్టాలే అయన రచనా శక్తికి పునాది. తల్లిదండ్రులను చిన్న వయసులో కోల్పోయి అనాథుడిగా మిగిలిన గోర్కీ, ఎన్నో కష్టాలు తలపడి, వివిధ పని వర్గాల్లో పనిచేస్తూ జీవితాన్ని అనుభవించాడు. యాచకుడిగా, ముద్రణ కార్మికుడిగా, నౌకల్లో సహాయకుడిగా ఎన్నో జీవన పాత్రలు పోషిస్తూ, సమాజంలోని అట్టడుగు వర్గాల జీవితాన్ని దగ్గరగా గమనించాడు. ఇదే అనుభవ సంపత్తి అతని రచనలకు జీవన వివేకాన్ని అందించింది.

1892లో ‘మకార్ చుద్రా‘ కథతో రచనా ప్రస్థానాన్ని ప్రారంభించిన గోర్కీ, అనంతరం అనేక నవలలు, నాటకాలు, కథలు, వ్యాసాలు రచించాడు. వాటిలో ముఖ్యమైనవి - ‘అమ్మ’ (1906), ‘నా బాల్యం’, ‘నా విశ్వవిద్యాలయాలు’, ‘ది లోయర్ డెప్త్స్’ తదితర రచనలు. ‘అమ్మ’ నవల ప్రపంచ విప్లవ సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిన కావ్యం. ఒక కార్మికుడి తల్లి, తన కొడుకు విప్లవ మార్గంలో పయనించడాన్ని చూసి, తానూ ఆ ఉద్యమంలో భాగమవడం అనే ఇతివృత్తం ద్వారా విప్లవ భావ జాలాన్ని గుండెల్లో నాటుతుంది. ఈ నవల లెనిన్ చేత మెచ్చుకోబడింది. ప్రపంచ వ్యాప్తంగా అనేక భాషల్లో అనువాదమై, తెలుగులోనూ విస్తృత ప్రచారం పొందింది.

The Lower depths నాటకంలో గోర్కీ, పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న వర్గాల జీవితాన్ని నిర్మొహమాటంగా చిత్రించాడు. మానవ అశక్తి, ఆశ, నిరాశలను గాఢంగా దర్శించిన ఈ నాటకం, తాత్వికతకు చేరువైన వాస్తవిక చిత్రణగా నిలుస్తుంది. ‘నా బాల్యం’, ‘నా విశ్వవిద్యాలయాలు’ వంటి స్వీయ చరిత్రాత్మక రచనలు గోర్కీ జీవితాన్ని అక్షర రూపంలో చెరిపి వేయకుండా నిలిపే ప్రయత్నంగా పేర్కొనవచ్చు.

రచయిత గానే కాక, రాజకీయ చింతనకారుడిగా గోర్కీ ప్రభావం విశేషం. సోషలిస్ట్ భావజాలాన్ని సమర్థించిన గోర్కీ, బోల్షెవిక్ విప్లవానికి మద్దతు తెలిపాడు. లెనిన్‌తో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నా, కొంతకాలం స్టాలిన్ విధానాలను విమర్శించాడు. కానీ తరువాత అధికారంతో మెలగడం ప్రారంభించాడు. ఈ మార్పు ఆయన వ్యాపకమైన విప్లవ ఆత్మ చింతనకు సంకేతంగా మారింది.

గోర్కీ రచనలు కాలాతీతమైన సామాజిక సందేశాల ప్రతి రూపాలు. వాస్తవికత, మానవతా స్పర్శ, శ్రమ జీవుల జీవన పోరాటాలే ఆయన సాహిత్య శైలికి మూలాధారాలు. సోవియట్ యూనియన్‌లో ఆయన పేరు మీద నగరాలు, వర్సిటీలు, సంస్థలు స్థాపించ బడ్డాయి. ప్రపంచ వ్యాప్తంగా విప్లవ కారులకు, సామాజిక సంస్కర్తలకు ఆయన రచనలు ప్రేరణగా నిలిచాయి.

గోర్కీ జీవితం మనకు ఒక మూల సందేశాన్ని అందిస్తుంది - సాహిత్యం వినోదానికి మాత్రమే కాదు, సమాజాన్ని మేల్కొలిపే శక్తిగా నిలవాలన్నది నిజమైన రచయిత ధర్మం. దుఃఖాల దారుల్లో నడిచి వెలుగుకు దారిచూపిన ఆయన జీవితమే ఈ ధర్మానికి ప్రత్యక్ష సాక్ష్యం. అన్యాయానికి ఎదిరించిన కళాన్ని, సమాజ మార్పుకు శబ్దాన్ని అందించిన కలాన్ని గోర్కీ కలం మలిచింది. అలాంటి కలం నుంచి జారిన ప్రతి అక్షరం - సమాజపు మార్పు కోసం శ్రమజీవుల గుండె చప్పుళ్ళ ప్రతిధ్వనిగా మారింది. మాక్సిం గోర్కీ రచనలు యుగయుగాలకూ సామాజిక సమరానికి శబ్దరూపంగా నిలుస్తాయి.

**జూన్ 18...మాక్సిం గోర్కీ వర్ధంతి**

**- ఆర్‌కేఎస్**
9440595494

# జనాభాలో ఎక్కువ.. ప్రగతిలో తక్కువ!



భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఎదిగింది. యువశక్తి, సహజ వనరులు, మేధో సంపత్తి, సాంకేతిక నైపుణ్యం వంటి అనేక బలాలు మనకున్నాయి. అయినప్పటికీ విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, రహదారి క్రమశిక్షణ, పర్యావరణ పరిరక్షణ, ప్రశ్నించే స్వేచ్ఛ, అవినీతి నిర్మూలన, బాధ్యతాయుత పాలన,పౌర బాధ్యత వంటి అనేక ప్రగతి ప్రమాణాల్లో మనం ఆశించిన స్థాయికి చేరుకోలేకపోతున్నాం. దీనికి కారణం కేవలం పాలకుల వైఫల్యమే కాదు, పాలితుల నిర్లక్ష్యమూ అంతే. అందుకే ఈ పరిస్థితిని తిలా పాపం తలా పిడికెడు అని చెప్పవచ్చు.

ప్రజాస్వామ్యంలో పాలకులు, పాలితులు ఒకే రథానికి రెండు చక్రాలు. ఒకరు బాధ్యత తప్పినా,మరొకరు తమ విధిని విస్మరించినా సమాజం వెనుకబడుతుంది. దేశాభివృద్ధి అంటే కేవలం ప్రభుత్వ పథకాలు, భారీ ప్రాజెక్టులు మాత్రమే కాదు. పౌరస్వేచ్ఛ తోపాటు, ప్రతి పౌరుడి బాధ్యతాయుతమైన ప్రవర్తన కూడా అంతే ముఖ్యం. ప్రజాస్వామ్య దేశంలో పౌరస్పృహ పాలకుల,పాలితుల అత్యంత ప్రధాన బాధ్యత. ఇదే సమిష్టి ప్రగతికి మార్గదర్శి.

ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఎన్నో హామీలు ఇస్తారు. ఉద్యోగాలు, అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాలు, అవినీతి నిర్మూలన వంటి అంశాలపై గొప్ప గొప్ప ప్రకటనలు చేస్తారు. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత వాటిలో హామీలు మరుగున పడిపోతాయి. ప్రజల సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాలు, అధికారం నిలబెట్టుకోవడమే కొందరు పాలకుల ప్రధాన లక్ష్యంగా మారుతోంది.

ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రజలే ఇస్తారు. కాబట్టి ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం పాలకుల మొదటి కర్తవ్యం. ప్రభుత్వాలు పారదర్శకంగా వ్యవహరించాలి. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయరాదు. అంతేకాదు జాగ్రత్తగా వినియోగించాలి. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై క్రమం తప్పకుండా సమాధానం చెప్పాలి. ప్రజల సమస్యలను వినాలి. అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా చూడాలి. పాలనలో జవాబుదారీ తనం లేకపోతే ప్రజల్లో విశ్వాసం తగ్గిపోతుంది. అభివృద్ధి మందగిస్తుంది. కాబట్టి మంచి పాలనకు రాజకీయ నాయకులు ప్రజల పట్ల నిబద్ధతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యాన్ని ఓటుతో పాటు, ఎన్నికైన ప్రభుత్వాల (నాయకుల) జవాబుదారీ తనమే బలాన్ని చేకూర్చుతోంది.

పాలకులను విమర్శించడం సులభం. కానీ మన బాధ్యతలను మనం ఎంతవరకు నిర్వర్తిస్తున్నామో కూడా ప్రశ్నించుకోవాలి. రోడ్లపై చెత్త వేయడం, ఎక్కడపడితే అక్కడ మూత్ర విసర్జన చేయడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, క్యూలను పాటించకపోవడం, పన్నులు ఎగవేయడం వంటి చర్యలు మన సమాజంలో తరచూ కనిపిస్తున్నాయి. శుభ్రమైన దేశం కావాలని కోరుకునే మనమే చెత్తను రోడ్లపై పడేస్తే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది? ప్రమాదాలు తగ్గాలని ఆశించే



మనమే ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే భద్రత ఎలా పెరుగుతుంది?. ప్రభుత్వ ఆస్తులు ప్రజల సొత్తే అని తెలుసుకున్నా వాటిని నిర్లక్ష్యంగా చూస్తే నష్టం చివరకు ప్రజలకే కదా!.

పౌరస్పృహ అనేది పెద్ద పెద్ద ప్రసంగాల్లో ఉండేది కాదు. అది మన రోజువారీ ప్రవర్తనలో కనిపించాలి. ఇంటి ముందు శుభ్రత పాటించడం, చెత్తను నిర్దిష్ట ప్రదేశంలో వేయడం, ట్రాఫిక్ నియమాలను గౌరవించడం, నీటిని పొదుపుగా వాడడం, చెట్లను కాపాడడం, ప్రజా ఆస్తులను సంరక్షించడం-లాంటివి అన్నీ పౌరులు బాధ్యతగా భావించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతి పౌరుడికి సామాజిక స్పృహ ఇసుమంతైనా ఉండాలి.

స్వేచ్ఛ అంటే మన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడం కాదు?. మన హక్కులను కాపాడు కుంటూనే,ఇతరుల హక్కులకు భంగం కలిగించ కుండా ప్రవర్తించడమే. బాధ్యతతో కూడిన స్వేచ్ఛే నిజమైన ప్రజాస్వామ్య సంస్కృతి.

ప్రజాస్వామ్యంలో ప్రజలు కేవలం ఓటర్లు మాత్రమే కాదు. దేశ నిర్మాణంలో భాగస్వాములు. ఎన్నికల రోజున ఓటు వేసి ఐదేళ్లు మౌనంగా ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, ప్రభుత్వ పనితీరును పరిశీలించడం, తప్పులను ఎత్తిచూపడం, మంచి కార్యక్రమాలను ప్రోత్సహించడం ప్రతి పౌరుడి బాధ్యత.

అదే సమయంలో ప్రశ్నించే హక్కుతో పాటు బాధ్యతాయుతమైన ప్రవర్తన కూడా అవసరం. ప్రభుత్వం చేయాలి అనే భావనతో మాత్రమే సరిపోదు. నేను ఏమి చేయగలను? అనే ఆలోచన కూడా ఉండాలి. సమాజంలోని ప్రతి వ్యక్తి తన బాధ్యతను నిర్వర్తించినప్పుడే అభివృద్ధి వేగవంతమవుతుంది.

ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలను పరిశీలిస్తే అక్కడి ప్రజల్లో ఉన్న క్రమశిక్షణ, పౌరస్పృహ, చట్టాల పట్ల గౌరవం ప్రధాన కారణాలుగా కనిపిస్తాయి. అక్కడ శిక్షల భయం కంటే బాధ్యతాభావమే ఎక్కువగా పనిచేస్తుంది.మన దేశం కూడా అదే దిశగా అడుగులు వేయాలి.

పిల్లలలో చిన్నప్పటి నుంచే పౌర బాధ్యతలను పెంపొందించాలి. కుటుంబం, పాఠశాల, సమాజం కలిసి మంచి పౌరులను తయారు చేయాలి. మీడియా, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు కూడా ఈ విషయంలో చైతన్యం కల్పించాలి. ‘పౌరస్పృహ’ సివిక్ సెన్స్ ఒక ఉద్యమంగా మారినప్పుడే సమాజంలో నిజమైన మార్పు వస్తుంది. దేశం అభివృద్ధి చెందాలంటే పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. పాలితులు తమ హక్కులతో పాటు బాధ్యతలను విస్మరించకూడదు. ఒకవైపు జవాబుదారీ పాలన, మరోవైపు బాధ్యతగల పౌరసమాజం ఉంటేనే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది.

మన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే పరువు పోయేది మనదే. నష్టం జరిగేది సమాజానికే. అందుకే కనీస పౌరస్పృహే ప్రగతికి తొలి మెట్టు.‘హక్కులు-బాధ్యతలు’ రెండు కళ్ళ లాంటివి. వీటి నుంచి పాలకులకు,పాలితులకు మినహాయింపు లేదు. నేటి నుంచే మనం పౌరస్పృహతో మెలుగుదాం.ప్రశ్నించే పౌరులుగా, బాధ్యతగల భారతీయులుగా ఎదుగుదాం. అప్పుడు మాత్రమే జనాభాలోనే కాదు, ప్రగతి ప్రమాణాల్లోనూ ప్రపంచానికి ఆదర్శంగా నిలవగలుగుతాం. ‘దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్’ అన్న మహాకవి గుర జాడ బాటలో నడిస్తే సమాజం చైతన్యవంతమవుతుంది. రాజకీయనాయకులు ఆకాశం నుంచి ఊడి పడరు. గురజాడ చెప్పినట్లు వాళ్ల మనుషులే కదా..ప్రతి మనిషి బాధ్యతా యుతంగా ఉండాల్సిన అవసరం ఉంది. అప్పుడే ప్రగతి సాధ్యమవుతుంది.

**- మేకిరి దామోదర్**
9573666650.

# మల్కాపూర్ ప్రజల దశాబ్దాల కల సాకారం

- ఆర్టీసీ బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- కరీంనగర్ - మల్కాపూర్ - వేములవాడ రూట్లో బస్సు సర్వీస్ షురూ
- బస్సుకు సాంప్రదాయబద్ధంగా పూజలు చేసిన గ్రామ మహిళలు




**బోయినపల్లి, జూన్ 17(మనం న్యూస్ ):** బోయినపల్లి మండలంలోని మల్కాపూర్ గ్రామ ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. రవాణా సౌకర్యాలు లేక ఇన్నాళ్లు తీవ్ర ఇబ్బందులు పడ్డ ఈ గ్రామ విద్యార్థులు, రైతులు,మహిళలు కార్మికుల ప్రయాణ కష్టాలను ప్రజా ప్రభుత్వం తీర్చింది. మల్కాపూర్ గ్రామానికి నూతనంగా కేటాయించిన టీజీఎస్ఆర్టీసీ బస్సు సర్వీసును చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం బుధవారం గ్రామంలో పచ్చజెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. ఈ బస్సు కరీంనగర్ నుండి బయలుదేరి గంగాధర,వయా మల్కాపూర్, నుండి తిప్పాయిపల్లి మీదుగా వేములవాడ వరకు నడవనుంది. ఇందులో ఆర్టీసీ వేములవాడ డిపో మేనేజర్ బోనాల శ్రీనివాస్ పాల్గొని రవాణా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**పండుగ వాతావరణంలో బస్సుకు స్వాగతం**

మల్కాపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు మంజూరు అయినట్టు సమాచారం అందడంతో గ్రామ శ్రేణులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సాంప్రదాయబద్ధంగా బస్సుకు పూజా కార్యక్రమాలు నిర్వహించి, పూలమాలలు, తోరణాలతో అందంగా అలంకరించారు. అనంతరం ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం చేతిలో ఆర్టీసీ జెండా పట్టి, బస్సుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ప్రారంభించారు. ఊరిలోకి బస్సు రావడం చూసి గ్రామస్థులు చప్పట్లతో, హర్షధ్వానాలతో ఎమ్మెల్యేకు, కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

**ప్రయాణికులతో కలిసి ఎమ్మెల్యే ముచ్చట్లు**

బస్సును ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, వేములవాడ డిఎం బోనాల శ్రీనివాస్, బోయినపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులు కొమ్మనబోయిన సువీన్ యాదవ్, మల్కాపూర్ సర్పంచ్ మడ్లపల్లి తులసి గంగయ్యలతో కలిసి స్వయంగా బస్సు ఎక్కారు. ప్రయాణికుల సీట్లలో కూర్చుని గ్రామ ప్రజలతో, మహిళలతో కలిసి ముచ్చటిస్తూ కొంతదూరం ప్రయాణించారు.

**ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సే లక్ష్యం: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం గ్రామీణ మహిళల జీవితాలలో ఆర్థిక వెలుగులు నింపిందని కొనియాడారు. మల్కాపూర్ లాంటి గ్రామీణ ప్రాంత మహిళలు, విద్యార్థినులు ఇకపై సురక్షితంగా, ఉచితంగా కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాలకు వెళ్లవచ్చని తెలిపారు. నియోజకవర్గంలో రవాణా సదుపాయం లేని ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సులను నడిపించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామ కష్టాన్ని గుర్తించి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి వెంటనే బస్సు సర్వీసును పునరుద్ధరించిన ఎమ్మెల్యేకు మల్కాపూర్ గ్రామస్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ డిపో సిబ్బందితో పాటు బోయినపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మల్కాపూర్ గ్రామ కాంగ్రెస్ ప్రతినిధులు, వార్డు సభ్యులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామ ప్రజలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# రెండు మూడు రోజుల్లో యూరియా బుకింగ్ యాప్ ప్రారంభం

**పెద్దపల్లి జిల్లాలో యూరియా నిల్వలు పుష్కలం**

**రైతులకు ఎలాంటి కొరత లేకుండా పకడ్బందీగా ఎరువుల సరఫరా**

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి, జూన్-17 (మనం ప్రతినిధి):** ప్రస్తుత వానాకాలం-2026 సీజన్కు సంబంధించి పెద్దపల్లి జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటికి జిల్లాలో 18,750 మెట్రిక్ టన్నుల యూరియా, ఐ.ఈ 4,12,511 యూరియా బస్తాలు నిల్వలో ఉండి, యూరియా బుకింగ్ యాప్ ద్వారా పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రతి వారం రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్సీఎల్)తో పాటు ఇతర కంపెనీల నుంచి యూరియా నిల్వలు జిల్లాకు చేరుతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువుల సరఫరాపై వ్యవసాయ శాఖ పకడ్బందీ ప్రణాళికతో పనిచేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఎల్నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం వల్ల పంటల విత్తనాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో ప్రస్తుతం యూరియా బుకింగ్ యాప్ను తాత్కాలికంగా నిలిపివేశామని, మరో రెండు లేదా మూడు రోజుల్లో యాప్ను తిరిగి ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. కావున పెద్దపల్లి జిల్లా రైతులు అందరూ యూరియా బస్తాల లభ్యతపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పెళ్లిరోజున సేవా స్ఫూర్తి

- సేవే లక్ష్యంగా, అభిమానుల చేతుల మీదుగా అన్నదానం





**సుల్తానాబాద్, జూన్ 17 (మనం న్యూస్):** 'అన్ని దానాల్లో కన్నా అన్నదానం మిన్న' అనే భావనతో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్ళపల్లి మనోజ్ గౌడ్ - శ్రీలత దంపతుల పెళ్లిరోజు సందర్భంగా ఆయన అభిమానులు వినూత్న సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలో మానసిక వికలాంగులు, రోడ్డుపై నివసించే నిరాశ్రయులు, యాచకులకు చికెన్ బిర్యానీతో భోజనాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ, సమాజ సేవలో ఎప్పుడూ ముందుండే మనోజ్ గౌడ్ చేస్తున్న సేవా కార్యక్రమాల నుంచి ప్రేరణ పొందే తాము ఈ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మనోజ్ గౌడ్కు భగవంతుడు అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సమాజంలో సేవా భావన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేశెట్టి రమేష్, సమీర్, చోటు, ఫరీద్, అకీల్, మొక్బీద్, పొన్నాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు మార్గదర్శిగా 'టీచింగ్ డైరీ'

- డీఈవో కే. రాము

**జగిత్యాల, జూన్ 17( మనం న్యూస్):** తెలంగాణ సాంఘిక శాస్త్ర టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన విద్యాసంవత్సరానికి సంబంధించిన 'టీచింగ్ డైరీ'ని జగిత్యాల జిల్లా విద్యాధికారి (డీఈవో) కే. రాము బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ, ఉపాధ్యాయులు సమర్థవంతమైన బోధన ప్రణాళికలు రూపొందించుకోవడంలో, విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంలో టీచింగ్ డైరీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం తెలంగాణ సాంఘిక శాస్త్ర టీచర్స్ ఫోరం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. విద్యార్థుల అభ్యాస ఫలితాలను పెంపొందించడంతో పాటు బోధనను మరింత ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు ఇటువంటి డైరీలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఫోరం ప్రతినిధులు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ టీచింగ్ డైరీని రూపొందించినట్లు తెలిపారు. బోధన, మూల్యాంకనం, విద్యా కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన అంశాలను ఇందులో పొందుపరిచినట్లు వివరించారు.ఐ ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా సాంఘిక శాస్త్ర టీచర్స్ ఫోరం అధ్యక్షుడు జోగ రవి, ప్రధాన కార్యదర్శి దాసరి రామస్వామి, రాష్ట్ర కార్యదర్శి మహిపాల్, సెక్టోరల్ అధికారులు సత్యనారాయణ, నీరజ, చంద్రశేఖర్, ఫోరం సభ్యులు కొమరయ్య, పద్మ, అర్చన, గంగయ్య, రాజేంద్రరావు, ప్రవీణ్, రాజేశం తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం విద్యా రంగ అభివృద్ధి, ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాల పెంపు దిశగా ఫోరం చేస్తున్న కృషికి నిదర్శనంగా నిలిచింది.



# ముందస్తు ప్రణాళికతో ఖరీఫ్కు సన్నద్ధం కావాలి




- లాభదాయక పంటల సాగులో రైతులను ప్రోత్సహించాలి
- వ్యవసాయ అనుబంధ రంగాల పురోగతిపై కలెక్టర్ సమీక్ష

**కరీంనగర్ జూన్ 17(మనం బ్యూరో):** సాంకేతికత, ముందస్తు ప్రణాళికలతో వానాకాలం వ్యవసాయానికి సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలైన పశుసంవర్ధక, మత్స్య, ఉద్యానవన శాఖల ప్రస్తుత పరిస్థితి, రాబోయే ఖరీఫ్ సీజన్ సన్నద్ధతపై సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ మార్పుల సవాళ్లను తట్టుకుంటూ, రైతుల పెట్టుబడి ఖర్చులను తగ్గించి, నికర ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా అధికారులు సరైన ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

ఎల్ నినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని అన్నారు. తృణధాన్యాలు, నూనెగింజలు, పత్తి సాగు పెరిగేలా చూడాలని తెలిపారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వస్తున్నందున ఆ పంటతో తయారయ్యే ఉత్పత్తి పరిశ్రమలు ఏర్పాటును జిల్లాలో ప్రోత్సహించాలని అన్నారు. నాణ్యత గల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని, రైతులకు వాతావరణ అంచనాలు తెలియజేయాలని, యాప్ ద్వారా ఎరువుల బుకింగ్ పై అవగాహన కల్పించాలని తెలిపారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. వ్యవసాయేతర రంగాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీ పథకాలపై రైతులకు గ్రామాల వారిగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఉద్యానవన శాఖ అందిస్తున్న పథకాలను వివరించే వాల్ పోస్టర్లు ముద్రించి.. రైతు వేదికల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.పండ్ల తోటలు, పూల తోటలు, ఆయిల్ సాగు చేస్తూ లాభాలు గడిస్తున్న రైతుల విజయ గాథలను, గ్రామాల్లో వివరించడం ద్వారా వారు సైతం పంటలు సాగు చేసేందుకు ముందుకు వస్తారని పేర్కొన్నారు. చేప పిల్లల విత్తనాల విడుదల సకాలంలో జరిగేలా ఇప్పటినుండే సన్నద్ధం కావాలని తెలిపారు. పశు సంపద అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, పశువుల ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, మత్స్య శాఖ అధికారి విజయభారతి, పశుసంవర్ధక శాఖ అధికారి లింగారెడ్డి, ఆత్మ పిడి చత్రు నాయక్, మార్క్ఫెడ్ డిఎం గౌరీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ మాట అంగన్వాడి బాట




**జగిత్యాల, జూన్ 17( మనం ప్రతినిధి):** అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం బీర్పూర్ మండలంలోని ఇందిరానగర్ లో, ఐసిడిఎస్ సూపర్వైజర్ శైలజ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం మరియు అన్నప్రాసనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెండున్నర సంవత్సరంలో పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించే పూర్వ ప్రాథమిక విద్య పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి పూడూరి శ్రీలత ముఖ్య అతితీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథి లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా అంగన్వాడి సేవలను వినియోగించుకోవాలని కల్తీ లేని ఆహార పదార్థాలను మన ప్రభుత్వము అంగన్వాడీల ద్వారా పంపిణీ చేస్తుందని పిల్లల యొక్క భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకొని ఖచ్చితంగా ప్రతి ఒక్కరు అంగన్వాడి కేంద్రానికి మీ యొక్క పిల్లల్ని పంపించాలని కోరారు.ఈ యొక్క కార్యక్రమంలో సర్పంచ్ , వార్డు మెంబర్లు ఆశా వర్కర్ అంగన్వాడి టీచర్లు తల్లులు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్కు కౌంట్డౌన్ మొదలైంది

- ప్రజలే తీర్పు చెప్పబోతున్నారు!
- హుస్నాబాద్లో హరీశ్రావు హెచ్చరిక
- హామీల అమలులో కాంగ్రెస్ ఘోర వైఫల్యం
- రైతు నుంచి జర్నలిస్టు వరకు ప్రతి వర్గం నిరాశలోనే ఉందన్న మాజీ మంత్రి
- ఎస్ఐఆర్ ప్రక్రియపై కార్యకర్తలకు దిశానిర్దేశం
- బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి
- రావడం ఖాయమని ధీమా




**హుస్నాబాద్,రిపోర్టర్: జూన్17మనం న్యూస్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేక ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని మాజీ మంత్రి హరీశ్రావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ సాయి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభ ప్రారంభం నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై విరుచుకుపడిన హరీశ్రావు, తెలంగాణ ఉద్యమ చరిత్రలో హుస్నాబాద్కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్కు ఈ ప్రాంతంపై ప్రత్యేక అభిమానం ఉండేదని, ఎన్నికల ప్రచారానికి తరచూ హుస్నాబాద్ నుంచే శ్రీకారం చుట్టేవారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలోనే హుస్నాబాద్ ప్రాంత ప్రజలు బీఆర్ఎస్కు అండగా నిలిచి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయాలు అందించారని పేర్కొన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హుస్నాబాద్కు అనేక అభివృద్ధి కార్యక్రమాలు తీసుకొచ్చామని, మినీ ఆర్టీసీ డిపోను పూర్తి స్థాయి డిపోగా మార్చడంతో పాటు తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించి దశాబ్దాల కలలను నెరవేర్చామని తెలిపారు. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త అభివృద్ధి పనులు చేయడం పక్కనపెట్టి, ఇప్పటికే ప్రారంభమైన పనులను కూడా పూర్తి చేయలేని పరిస్థితిలో ఉందని విమర్శించారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై పార్టీ కార్యకర్తలకు హరీశ్రావు ప్రత్యేక సూచనలు చేశారు. ఇది కొత్త ప్రక్రియ కాదని, ప్రతి 20 ఏళ్లకు ఒకసారి ఎన్నికల సంఘం నిర్వహించే సాధారణ ప్రక్రియేనని వివరించారు. డబుల్ ఓట్లు, మరణించిన వారి పేర్ల తొలగింపు, అర్హులైన ఓటర్ల వివరాల నమోదు వంటి అంశాల్లో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి బూత్ స్థాయిలో పార్టీ అభిమానులు, కార్యకర్తలు, కేసీఆర్ మద్దతుదారుల పేర్లు జాబితాలో ఉండేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.గౌరవెల్లి ప్రాజెక్టు విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీలతో నిర్వాసితులకు న్యాయం చేసి ప్రాజెక్టుకు నీళ్లు అందించే స్థాయికి తీసుకొచ్చిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు ముందుకు కదల్లేదని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రస్తావిస్తూ హరీశ్రావు కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హుస్నాబాద్ జర్నలిస్టులకు నివేశన స్థలాలు కేటాయించామని, వాటి అభివృద్ధి పనులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయలేకపోవడం దాని అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. జర్నలిస్టులు, రైతులు, యువత, మహిళలు సహా ప్రతి వర్గం ప్రస్తుతం నిరాశలో ఉందని అన్నారు.

## యూరియా నిల్వలు, పంట మార్పిడిపై
# ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, జూన్ 17(మనంన్యూస్):** రానున్న వ్యవసాయ సీజన్ను దృష్టిలో ఉంచుకుని యూరియా ఎరువుల సరఫరాకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు పంట మార్పిడిపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ఖరీఫ్ సీజన్లో ఎరువులు, విత్తనాల కొరత తలెత్తకుండా అవసరమైన నిల్వలను ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు. యూరియా పంపిణీపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వర్షపాతం అంచనాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయ పంటలు, పంట మార్పిడిపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. వ్యవసాయ, ఉద్యానవన, సహకార తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి రైతులకు సకాలంలో సలహాలు అందించాలని ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సీజన్కు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు కలెక్టర్కు వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాసరావు, డి సి ఓ నీరజ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మారెన్న మృతి వాల్మీకి సంఘానికి తీరని లోటు

- రాష్ట్ర ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు వాల్మీకి బి లక్ష్మన్న

**మంత్రాలయం ,జూన్ ,17,మనం న్యూస్ ;-** నదిచాగి మారెన్న మృతి వాల్మీకి సంఘానికి తీరని లోటు అని రాష్ట్ర ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు , మంత్రాలయం జనసేన పార్టీ ఇన్చార్జ్ బి. లక్ష్మన్న అన్నారు. బుధవారం కౌతాళం మండలం నది చాగి గ్రామానికి చెందిన ఎస్ మారెన్న ( పోస్ట్ మారన్న ) ఉదయం గుండె పోటు తో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి వెళ్ళి జనసేన పార్టీ కోసిగి మండల అధ్యక్షులు సి వీరారెడ్డి, నది చాగి బసవరాజు, టీడీపీ నాయకులు పకీరప్ప మారెన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బి లక్ష్మన్న మాట్లాడుతూ మారెన్న వాల్మీకి సంఘం స్థాపించినప్పటి నుంచి ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారు అని, సంఘానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ సంఘం తరఫున మేము అండగా ఉంటామని లక్ష్మన్న తెలిపారు.



# పెండింగ్ కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యం

- రాత్రి, పగలు తేడా లేకుండా పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

**కరీంనగర్, జూన్ 17(మనం బ్యూరో):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించి, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశించారు. బుధవారం కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో సీపీ గౌష్ ఆలం అధ్యక్షతన నెలవారీ నేర సమీక్షా సమావేశం సుదీర్ఘంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో కమిషనరేట్ పరిధిలోని ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, ఎస్హెచ్వోలు మరియు విభాగాధిపతులు పాల్గొని, తమ పరిధిలోని కేసుల డైరీలను (ఇన్వెస్టిగేషన్ ఊజీజ్యూట) సమర్పించి కేసుల పురోగతిని వివరించారు.ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు:మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు, పోక్సో ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ, మరియు తీవ్రమైన నేరాల దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. మహిళా పోలీస్ సిబ్బందికి 'బ్లూ కోల్ట్స్' విధులను కేటాయించాలని, 'షీ టీమ్స్' ద్వారా ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించాలని స్పష్టం చేశారు.నగరంలో 'విజిబుల్ పోలీసింగ్' స్పష్టంగా కనిపించాలని, రాత్రి పగలు పెట్రోలింగ్ మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై నిఘా ఉంచి, వారి ఇళ్లపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. విద్యాసంస్థల సమీపంలోని పాన్ షాపులు, బస్ డిపోలు, రైల్వే స్టేషన్లలో తనిఖీలు చేసి మాదకద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇటీవల జరిగిన నేపాలీ ముఠాల ఘటనలను దృష్టిలో ఉంచుకుని, కమిషనరేట్ వ్యాప్తంగా వివిధ రంగాలలో పనిచేస్తున్న 1000 మందికి పైగా ఉన్న నేపాలీ కార్మికుల వివరాలను పోలీస్ స్టేషన్ల వారీగా రిజిస్టర్లలో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.హోటళ్లు, లాడ్జీలలో సరైన గుర్తింపు కార్డులు, ఫోన్ నంబర్లు సరిచూసుకున్న తర్వాతే గదులు ఇవ్వాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బ్యాంకులు, జ్యువెలరీ వ్యాపార సంస్థల్లో సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించి భద్రతా ప్రమాణాలపై తగు సూచనలు చేయాలన్నారు.నంబర్ ప్లేట్ లేని వాహనాలు, మైనర్ డ్రైవింగ్, శబ్ద కాలుష్యం, టింటెడ్ గ్లాస్, పాఠశాల విద్యార్థుల రవాణా వాహనాలపై ప్రత్యేక తనిఖీలు (నాఖాబందీ) నిర్వహించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలని, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.కమిషనరేట్ వ్యాప్తంగా కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని, పాత కెమెరాల జియో-ట్యాగింగ్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం కోర్టు అధికారులతో నిర్వహించిన సమీక్షలో... ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజీపడే కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సీపీ గౌష్ ఆలం అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఏసీపీలు శ్రీనివాస్ జి, విజయకుమార్, వెంకటస్వామి,యాదగిరిస్వామి మాధవి, ప్రతాప్ లతోపాటు కమిషనరేట్ పలు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయి

● గోలి సంతోష్

**గజ్వేల్ జూన్ 17 మనం న్యూస్:** ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని గోలి సంతోష్, అంతునూరి శివకుమార్ అన్నారు. మే నెలలో ఎండాకాలం సందర్భంగా స్థానిక ఇంద్ర పార్క్ చరస్థ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, మూడు నెలపాటు ఈ చలివేంద్రా నిర్వహించడం జరిగిందని అలాగే ప్రతి బుధవారము చలివేంద్రం వద్ద అంబలి పంపిణీ కార్యక్రమం కానీ మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం తోట బిక్షపతి మాట్లాడుతూ గజ్వేల్ పట్టణానికి చుట్టుపక్కల ప్రాంతాలకు సంబంధించిన ప్రజలు రావడం జరుగుతుందని వారికి ఇబ్బంది దాహంతో ఇబ్బంది కలగవద్దనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది తోట బిక్షపతి తెలిపారు. మూడు నెలల పాటు నిరాకంగా ఈ చలివేంద్రాన్ని నిర్మించడం మాకెంతో సంతోషంగా ఉందని ఆయన ఆనందాన్ని వెళ్లి బుచ్చారు. అంబలి పంపిణీ కార్యక్రమం ఈ సంవత్సరం చివరి బుధవారం కావడంతో చాలామంది ప్రజలు అంబలి కార్యక్రమంలో పాల్గొని అంబలి తాగడం జరిగింది .ఈ కార్యక్రమంలో దూపకుంట రుక్మయ్య, దూపకుంట మెట్రాములు, దూపకుంట లచ్చయ్య, దూపకుంట లక్ష్మణ్, సిద్ధి రామచంద్రం, తడుపునూరి కాశీనాథ్, రమేష్, మరియాల లింగంతో పాటు పాల్గొన్నారు.

# గౌడ సోదరులకు కాటమయ్య కిట్లు పంపిణీ

**గజ్వేల్ జూన్ 17 మనం న్యూస్:** ఈదులు, తాళ్లు ఎక్కి కల్లు గీసే గౌడ సోదరుల కోసం కాటమయ్య రక్ష కిట్లను గజ్వేల్ ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి ఎస్ఐ దీప్తి బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం పోషాద్రి అందించారు. బుధవారం గజ్వేల్ నియోజకవర్గం గౌడ సంఘం సోదరులకు 90 కాటమయ్య కిట్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ చెట్టు ఎక్కి కల్లు గీసే క్రమంలో చాలాసార్లు ప్రమాదాల బారిన పడి గీత కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని ప్రమాదాల నివారణకు కాటమయ్య కిట్లను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు ఆధునికతను జోడించి సేఫ్టీ కిట్లను ప్రభుత్వం తయారు చేసి అందిస్తుంది అని విన్నవించారు. గీత కార్మికులు సులువుగా తాటి చెట్లు ఎక్కేలా ఈ కిట్లను రూపొందించారు అని చెప్పారు.ప్రమాదవశాత్తు తాటి చెట్ల మీద నుంచి కింద పడకుండా ఈ పరికరాల్లో అత్యాధునిక టెక్నాలజీని వినియోగించారు అని వ్యాఖ్యానించారు. ఒక్కో కిట్లో



మొత్తం 6 పరికరాలు ఉంటాయి అని తాడు, క్లిప్పులు, హ్యాండిల్స్, స్లింగ్ బ్యాగ్, లెగ్ లూప్ వంటివన్నీ వేర్వేరుగా ఉంటాయి అని వివరించారు. ప్రస్తుతం గీత కార్మికులు ఉపయోగిస్తున్న సాంప్రదాయ కిట్ల తరహాలోనే ఈ పరికరాలు ఉంటాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్ఐ వినయ్ కుమార్ పోలీస్ సిబ్బంది మరియు గౌడ్ సంఘం సభ్యులు నాచారం గౌడ్ సంఘం సొసైటీ అధ్యక్షుడు చింతల సంతోష్ గౌడ్, నాగరాజ్ గౌడ్, వి, లింగం , శ్రీధర్, రాజయ్య, అంజయ్య, శ్రీనివాస్, ప్రసాద్ యాదగిరి, మండల గౌడ్ సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తిని స్కిల్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

### అమెరికా సంస్థ ఇన్ఫోడేట్ గ్లోబల్ ఐఎన్ సితో ఐక్యత ఫౌండేషన్ భాగస్వామ్యం

### ఐదేళ్లలో 5,000 మంది యువతకు ఆధునిక నైపుణ్యాల శిక్షణ అందించడమే లక్ష్యం

### ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ -సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి




**ఉమ్మడి మహబూబ్ నగర్, కల్వకుర్తి రూరల్, జూన్ 17 (మనం బ్యూరో):** కల్వకుర్తి నియోజకవర్గ యువతకు ప్రపంచ స్థాయి సాంకేతిక నైపుణ్యాలు అందించి ఉపాధి అవకాశాలను విస్తరించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ కీలక ముందడుగు వేసింది. అమెరికాకు చెందిన ప్రముఖ టెక్నాలజీ సంస్థ ఇన్ఫోడేట్ గ్లోబల్ ఐఎన్ సి తో భాగస్వామ్యం కుదుర్చుకుని యువత కోసం ఉచిత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శిక్షణ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... వచ్చే ఐదేళ్లలో 5,000 మంది యువతకు భవిష్యత్ ఉద్యోగ అవకాశాలకు అవసరమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా అనలిటిక్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి అత్యాధునిక రంగాల్లో శిక్షణ అందించడమే లక్ష్యమని వెల్లడించారు.గ్రామీణ ప్రాంత యువతలో అపారమైన ప్రతిభ ఉన్నప్పటికీ సరైన శిక్షణ, మార్గదర్శకత్వం లేకపోవడంతో అనేక అవకాశాలకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ఐక్యత ఫౌండేషన్ -స్కిల్ ఫ్యాక్టరీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. శిక్షణతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, డిజిటల్ టూల్స్ వినియోగం, ఫ్రీలాన్సింగ్, రిమోట్ వర్క్ అవకాశాలు, స్టార్టప్లు, స్వయం ఉపాధి అంశాలపై కూడా ప్రత్యేక అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ రంగంలో నైపుణ్యాలకు పెరుగుతున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని కల్వకుర్తి యువతను అంతర్జాతీయ స్థాయి పోటీకి సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్, కార్పొరేట్, అంతర్జాతీయ సంస్థల్లో కూడా యువత రాణించేలా చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎం. మల్లారెడ్డి మాట్లాడుతూ...గ్రామీణ యువతకు ప్రపంచ స్థాయి సాంకేతిక నైపుణ్యాలు అందించేందుకు ఐక్యత ఫౌండేషన్తో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీసి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వారిని భవిష్యత్ అవకాశాలకు సిద్ధం చేయడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చని అభిప్రాయపడ్డారు.

కల్వకుర్తి యువతకు సరైన నైపుణ్యాలు, సరైన అవకాశాలు కల్పించి నియోజకవర్గాన్ని 'స్కిల్ అండ్ టెక్నాలజీ హబ్' గా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ యువతకు అంతర్జాతీయ స్థాయి ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రావడంతో పాటు కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి కొత్త దిశ ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కృత్రిమ మేధస్సుతో సాగు రంగానికి ఉజ్వల భవిష్యత్తు

**ములుగు, జూన్ 17(మనంన్యూస్):** కృత్రిమ మేధస్సు తో సాగు రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉండనుందని శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండా రాజి రెడ్డి అన్నారు. న్యూ ఢిల్లీ లోని ఐఎస్ఎఎస్టీఆర్ ఆధ్వర్యంలో జస్ట్ అగ్రికల్చర్ సౌజన్యం తో జరిగిన ఆగ్రో విజన్ 2.0 అనే అంశంపై రెండు వారాల అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమానికి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కృత్రిమ మేధా ఆధారిత సాగు, సాంకేతికత, స్మార్ట్ నైపుణ్యాలు ప్రస్తుతం లాభ సాటి సాగుకు అత్యవసరమని ఆయన అన్నారు. వ్యవసాయం మానవజాతి పురాతన శాస్త్రం అయినప్పటికీ, నేడు ఇది అత్యంత పెద్ద మార్పును ఎదుర్కొంటోంది. కృత్రిమ మేధస్సు రైతులను భర్తీ చేయడం కాదు, వారిని శక్తివంతం చేయడం, వర్షపాతం అంచనా, పంట వ్యాధుల నిర్ధారణ, ఎరువుల వినియోగం వంటి అంశాల్లో ఏఐ రైతులకు తోడ్పడుతుంది. స్మార్ట్ స్కిల్స్ విప్లవం



యంత్రాలకే పరిమితం కాదు; యువతను శిక్షణ ఇవ్వడం, ఎక్స్టెన్షన్ అధికారులు, సాగును తీర్చిదిద్దడం ద్వారా స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుంది అని ఆయన తెలిపారు. ఏరోపోనిక్స్, ప్రెసిషన్ ఇరిగేషన్, డ్రోన్లు, బయోచార్ వంటి సాంకేతికతలు వ్యవసాయాన్ని కొత్త దిశలో తీసుకెళ్తున్నాయి. ఆహార భద్రత సరిహద్దులు లేని అంశం. భారత్, ఆఫ్రికా, ఆసియా, యూరప్ దేశాల మధ్య జ్ఞానం మరియు వాణిజ్య మార్గాలు ఏర్పడాలి. వ్యవసాయాన్ని ఉపాధి కాకుండా వ్యాపారంగా చూడాలని, ఆవిష్కరణల ద్వారా సంపద సృష్టించాలని పిలుపునిచ్చారు. కాలమాన మార్పులు ప్రతిరోజూ సవాళ్లు విసురుతున్నాయి. ఏఐ ఆధారిత వ్యవసాయం వనరులను సమర్థవంతంగా వినియోగించి, వ్యర్థాలను తగ్గించి, గ్రీన్ ప్లానెట్ నిర్మించడంలో సహకరిస్తుంది అని వైస్ ఛాన్సలర్ డాక్టర్ రాజి రెడ్డి పేర్కొన్నారు అగ్రో వర్షన్ 2.0 కేవలం శిక్షణా కార్యక్రమం కాదు, ఇది ఒక ఉద్యమం. సాంకేతికత విత్తనాలను నాటడం, జ్ఞానంతో వాటిని పోషించడం, సమగ్ర సాగు అభివృద్ధి అనే లక్ష్యంతో ఈ కార్యక్రమం ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు.

# రెండు కోట్ల 80 లక్షల అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి జూపల్లి

**ఉమ్మడి మహబూబ్ నగర్, జూన్ 17 (మనం బ్యూరో):** వీపనగండ్ల మండలంలోని పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం మండలంలోని గోపాల్దిన్నె గ్రామంలో నిర్మించిన 33/11 కెవి సబ్ స్టేషన్ ను రెండు కోట్ల 12 లక్షల 53000 రూపాయలతో నిర్మించిన సబ్ స్టేషన్, వీపనగండ్ల సామాజిక ఆరోగ్య కేంద్రం లో రూ. 16 లక్షల 50 వేలతో ఏర్పాటుచేసిన ఎక్సరే మిషన్ను నాబార్డ్ నిధులతో రూ. 42 లక్షల కస్తూరిబా పాఠశాలకు అదనపు గదుల నిర్మాణానికి, మహిళా సంఘాలకు ప్రభుత్వం కల్పించినటువంటి బస్సును అదేవిధంగా రెండు ఇందిరమ్మ గృహాలను మంత్రి జూపల్లి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉన్న ప్రజా పాలన ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా ఎదగడం కోసం, మహిళలకు స్వయంగా ప్రభుత్వమే కొన్ని పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే బస్సులతో పాటు పెట్రోల్ బంకులు వారు నడుపుకునే విధంగా ప్రభుత్వం మహిళలకు ప్రోత్సహిస్తుదని మంత్రి ఈ




సందర్భంగా తెలిపారు. వీపనగండ్ల మండలంలో గతంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉండేదని, ఈ సమస్య నుండి రైతులకు గాని గ్రామాలలో విద్యుత్ దీపాలు వెలగడం కోసంమే, నాణ్యమైన విద్యుత్తును అందించడం కోసం సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే గోపాల్ దిన్నె గ్రామంలో 33/11 కెవి సబ్ స్టేషన్ను రైతులకు అంకితం చేయడం జరిగిందని మంత్రి సృష్టం వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం మొదటి విడతలో ఇందిరమ్మ గృహాలు ఏవైతే ఇవ్వడం జరిగిందో వాటిని పూర్తి చేసుకునేటటువంటి లబ్ధిదారుల ఇండ్లను ప్రారంభించడం జరిగిందని మంత్రి తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో పేద ప్రజలు ఆరోగ్యపరంగా పెద్దపెద్ద కార్పోరేట్ హాస్పిటల్ పోకుండా స్థానికంగానే వారి ఆరోగ్య పరిస్థితులు మెరుగుపరిచే విధంగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో విలువైనటువంటి ఎక్సరేను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలకు వివరించారు. అదేవిధంగా కస్తూరిబా పాఠశాలలో అదనపు గదులు విద్యార్థినిలకు ఇబ్బందులు ఎక్కడ కూడా తలెత్తకుండా వచ్చినటువంటి నిధులతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం కూడా వీపనగండ్ల కస్తూర్బాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరాన్ని ప్రారంభించుకోడం నాకెంతో సంతోషంగా ఉందన్నారు. ఇంటర్నెట్ మొదటి సంవత్సరం కస్తూరిబాలో ఏర్పాటు చేయడం పట్ల చుట్టుపక్కల పరిసర గ్రామాల విద్యార్థినిలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కాలేజీలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ ఎం పి హెచ్ డబ్ల్యు కోర్సును ప్రవేశ పెట్టుకోవడం జరిగిందని, దానితోపాటు ఎంపీసీ కోర్సు కూడా ఏర్పాటు ఏర్పాటు అయినందున ఈ ప్రాంత బాలికల విద్యార్థులకు ఎంతో ప్రయోజనాత్మకంగా ఉంటుందన్నారు. బాలికలు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా వారికి దగ్గరి ప్రాంతాలలో విద్య అందుబాటులో ఉండే విధంగా విద్యను అందించడం జరుగుతుందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వం దూరదృష్టం ఆలోచించి మరిన్ని అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిమ్యా నాయక్, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, విద్యుత్తు ఎస్ ఈ తిరుపతిరావు, డి ఈ శ్రీనివాసరావు, ఏఈ భగవంతు నాయక్, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసిల్దార్ ఖాజా మైనోద్దీన్ తో పాటు నాగర్ కర్నూల్ పర్యాటక శాఖ అధికారి కల్వరాళ్ల నరసింహ, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెంట్ చైతన్య గౌడ్, వనపర్తి జిల్లా డిఎంహెచ్ఓ సాయినాథ్ రెడ్డి, డి ఆర్ డి ఎ అధికారి ఉమాదేవి, ఏపిఎం మద్దిలేటి, వనపర్తి డిపో మేనేజర్, గోపాల్దిన్నె సర్పంచ్ దొడ్ల కవిత, వీపనగండ్ల సర్పంచ్ మీసాల పార్వతమ్మ, రంగవరం సర్పంచ్ మీనిగా శివయ్య నాయుడు, కల్వరాళ్ల సర్పంచ్ రాముడు, తూముకుంట రామన్ గౌడు, వీపనగండ్ల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావుల నారాయణరెడ్డి, సమ్మిరెడ్డి, రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు గోదాల బీరయ్య యాదవ్, గోపాల్దిన్నె మాజీ సర్పంచ్ బి బాల్ రెడ్డి, వెంకట రాజయ్య, తూముకుంట ఉపసర్పంచ్ రాంబాబు నాయుడు, రంగవరం రిటైర్డ్ విద్యుత్ అధికారి బిచ్చన్న తోపాటు విద్యుత్తు కాంట్రాక్టర్ ముంత శివయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ అవగాహన కోసం 2కే రన్ నిర్వహణ



**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 17 (మనం బ్యూరో):** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 2జు రన్ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియతో కలిసి బుధవారం జిల్లా కేంద్రంలోని స్టేడియం గ్రౌండ్లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,...భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్ ఐ ఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ నవీన్, మహబూబ్నగర్ తహసీల్దార్ ఘన్సిరామ్, అధికారులు, సిబ్బంది, ఇతరులు పాల్గొన్నారు.

# పశువుల ఆరోగ్య పరిరక్షణకు దాణా



**తుగ్గలి జూన్ 17(మనం న్యూస్ ):** పశువుల ఆరోగ్య పరిరక్షణకు పోషకాలతో కూడిన ఈ దాణా అత్యంత ప్రాముఖ్యమని పశువైద్యాధికారి బాలకృష్ణ అన్నారు. జొన్నగిరి పశు వైద్యశాలలో పశు పోషకులకు 50 శాతం రాయితీపై పశువుల దాణాను స్థానిక పశువుల బుధవారం పంపిణీ చేశారు. పశువైద్యాధికారి బాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ ఫండ్ లో తెల్ల రేషన్కార్డు కలిగిన పశు పోషకులు 50 కిలోల దాణా 1110 రూపాయలు ఉండగా 50 శాతం రాయితీ పోను రూ.555 రూపాయలు మాత్రమే పశుపోషకులు చెల్లించాలన్నారు. కిలో దాణా రూ.11 రూపాయలకు ప్రభుత్వం అందిస్తున్నదన్నారు.మండలానికి 10 మెట్రిక్ టన్నులు దాణాను ప్రభుత్వం కేటాయించినట్టు అయన పేర్కొన్నారు. ప్రభుత్వం పశుపోషకుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తూ చేయూత నిస్తున్నట్టు ఆమె తెలిపారు.ఈ దాణాలో 25 శాతం మాంసకృత్తులు ఉంటాయని అయన పశు పోషకులకు వివరించారు.50 శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన పశువుల దాణాను పశు పోషకులు సద్వినియోగపరుచుకోవాలని పశువైద్యాధికారి బాలకృష్ణ కోరారు.

# రెండేళ్ల పాలనలో... రాయదుర్గం ప్రగతి పథంలో




**రాయదుర్గం జూన్ 15 మనం న్యూస్:** కల్యం గ్రామంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనపై ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసుల.డీ. హీరేహల్ మండలం కల్యం గ్రామంలో నిర్వహించిన కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమంపై ప్రజలకు వివరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సహకారంతో, యువనేత నారా లోకేష్ గారి తోడ్పాటుతో రాయదుర్గం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ గత రెండేళ్లలో నియోజకవర్గానికి రూ.1267.44 కోట్ల నిధులు మంజూరు చేయించామని పేర్కొన్నారు. ఇందులో అభివృద్ధి పనులకు రూ.1025.22 కోట్లు, సంక్షేమ కార్యక్రమాలు, ఎన్నికల హామీల అమలుకు రూ.240.22 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.

# సర్ సర్వే గురించి ఎమ్మార్వోని అడిగి తెలుసుకున్న వైసీపీ నాయకులు



**కౌతాళం,జూన్ 17 మనం న్యూస్:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ఇంటింటా సర్వే సందర్భంగా బిఎల్ఓ అధికారులు మరియు ఓటర్లకు సంబంధించిన విషయాలును ఎమ్మార్వో ను అడిగి తెలుసుకున్న కౌతాళం మండలం వైఎస్ఆర్సిపి నాయకులు, వైఎస్ఆర్సిపి మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు దేశాయి ప్రహ్లాద ఆచారి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం మరియు ఎన్నికల సంఘం నిర్వహించిన(సర్) ప్రత్యేక సమగ్ర సవరణ ఓటర్ల ఇంటింటా సర్వే గ్రామ బూత్ లెవెల్ అధికారులు మరియు వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులు బూత్ కన్వీనర్ లతో కలిసి ప్రతి ఓటర్ సమస్యలను విని పరిష్కారం చూపుతూ,దీని ద్వారా అక్రమ, డూప్లికేట్ ఓట్లను తొలగించి,అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే దిశగా వైఎస్ఆర్సిపి కౌతాళం మండలం బుత్ కమిటీ సభ్యుల కు చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పిఎ పి. వెంకటరామిరెడ్డి,వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, మాజీ సర్పంచ్ పాల్ దినకర్,ఎంక్రబం రెడ్డి, రామస్వామి,నర్సిరెడ్డి, సక్రి శ్రీరామ్,ఖాలిల్ మరియు వివిధ గ్రామాలకు సంబంధించిన సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు మరియు సోషల్ మీడియా మండల కన్వీనర్ ఖాదర్ లింగ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సీపీఐ వినతి



**దేవనకొండ జూన్ 17( మనం న్యూస్ ):** మండలంలో డిఎస్టి హాస్టల్ ను పున: ప్రారంభించాలని, మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని, కస్తూరిబా పాఠశాలకు సి.సి రహదారి ఏర్పాటు చేయాలని, ప్రాథమిక వైద్య కేంద్రం నందు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టును భర్తీ చేయాలని రెగ్యులర్ ఫార్మాసిస్టు ని నియమించాలని అలాగే హంద్రీ-నీవా ప్రధాన కాలువకు గుండ్లకొండ దగ్గర సబ్-కెనాల్ ఏర్పాటు చేసి గుడిమిరాల్ల, చెల్లెల చెలిమల, పి. కోటకొండ మీదుగా మాచాపురం చెరువుకు నీరు మళ్లించాలని జిల్లా కలెక్టర్ డా..సిరి ని సిపిఐ మండల కార్యదర్శి ఎం నరసారావు కోరారు. బుధవారం దేవనకొండ మండలానికి వచ్చిన జిల్లా కలెక్టర్ ను మండలంలోని పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ పార్టీ మండల ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేసింది. ఈసందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ)లో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ మరియు ఫార్మసిస్ట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు.కలెక్టర్ ను కలిసిన వారిలో ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు ఖండప్ప, సిపిఐ మండల నాయకులు రవి, భాస్కర్, నరేష్, మద్దిలేటి, రాజశేఖర్, హరి, తిమ్మప్ప పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌కు ప్రాధాన్యత ఇవ్వండి



**గూడూరు, జూన్ 17( మనం న్యూస్ ):** భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని బిఎల్ఓ లందరూ ఈ కార్యక్రమానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేయాలని కోరారు. ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని పరిశీలించడానికి గూడూరు పట్టణంలోని పడకన వీధిలో పరిశీలించారు. బి ఎల్ ఓ చంద్రశేఖర్ ను ఎస్ ఐ ఆర్ గురించి పలు సూచనలు చేసి కార్యక్రమాన్ని పగడ్బందీగా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల దగ్గర ఉన్న సమాచారాన్ని పూర్తిగా సేకరించి ఆధారాలను తీసుకొని నమోదు చేయాలని చెప్పారు. తాసిల్దార్ వెంట ఆర్ఐ సందీప్ నాయక్ పాల్గొన్నారు.




# కాంగ్రెస్‌ది అరాచక పాలన

ప్రజలు గమనిస్తున్నారు
తెలంగాణలో మరోసారి
కేసీఆర్ నాయకత్వానికే ప్రజల మద్దతు
ముగ్గురు మంత్రులు దోచుకుంటున్నారు
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



మంత్రి పొంగులేటి అవినీతిపై వీడియో చూపించిన కేటిఆర్



ఖమ్మం, జూన్ 17(మనం బ్యూరో): కాంగ్రెస్‌ది అరాచక పాలన అని, తెలంగాణ ప్రజలు అంతా గమనిస్తున్నారని, మరోసారి కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు(కేటీఆర్) విమర్శించారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరిలో నిర్వహించిన సర్‌పై శిక్షణా కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పాలేరు మాజీ శాసనసభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి, పాలేరు నియోజకవర్గ ఇన్చార్జ్, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ ఆధ్వర్యంలో యువనేత కేటీఆర్‌కి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌దేనని, తెలంగాణ ప్రజలు మరోసారి కేసీఆర్ నాయకత్వానికే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో సంక్షేమం కనుమరుగైందని, ఎక్కడ చూసినా కూల్చివేతలు, వేధింపులు, ప్రజావ్యతిరేక నిర్ణయాలే కనిపిస్తున్నాయని విమర్శించారు.

పాలేరు ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలలో ఎన్ని అమలు చేశారో స్థానిక మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో రెవెన్యూ తగ్గిపోతున్నప్పటికీ రెవెన్యూ శాఖలో అవినీతి పెరిగిపోయిందని, ఆర్థిక వ్యవస్థ ఇబ్బందుల్లో ఉన్నా కొందరు అధికార వర్గాల ఆస్తులు మాత్రం అమాంతం పెరుగుతున్నాయని విమర్శించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాసంలో జరిగిన ఈడీ సోదాల సందర్భంగా బయటపడ్డ అంశాలపై ఇప్పటివరకు స్పష్టత ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య రాజకీయ అవగాహన కారణంగానే కొన్ని వ్యవహారాల్లో మౌనం పాటిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో బీఆర్ఎస్ మాత్రమే నిరంతరం పోరాడిందని, మిగతా జాతీయ పార్టీలు తెలంగాణ ఆకాంక్షలను దెబ్బతీసే విధంగా వ్యవహరించాయని పేర్కొన్నారు. గిరిజనుల భూములు, రైతుల హక్కులు ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా భూములను వివాదాస్పద జాబితాల్లో చేర్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. భూముల పేరుతో సెటిల్మెంట్లు, ఒత్తిళ్లు పెరుగుతున్నాయని అన్నారు.

**రైతులు, బలహీన వర్గాలపై కాంగ్రెస్ నిర్లక్ష్యం**

రైతులకు అవసరమైన ఎరువులు అందించడం నుంచి వ్యవసాయానికి మద్దతు ఇవ్వడం వరకు ప్రతి విషయంలో ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. భూమి శిస్తు రద్దు చేసి రైతులకు ఊరట కల్పించిన కేసీఆర్ ప్రభుత్వానికి విరుద్ధంగా మళ్లీ రైతులపై భారం మోపే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇళ్ల నిర్మాణంపై గతంలో చేసిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కుటుంబాలకు ఇళ్లు, ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీల పరిస్థితి ఏమైందని నిలదీశారు.

**అహంకార పాలనను ప్రజలు గమనిస్తున్నారు**

ప్రస్తుత ప్రభుత్వంలో అహంకారపూరిత ధోరణి పెరిగిపోయిందని, అధికారులను, ప్రజాప్రతినిధులను గౌరవించని పరిస్థితి నెలకొన్నదని కేటీఆర్ విమర్శించారు. తోటి మంత్రులను కూడా గౌరవించకుండా వ్యవహరించడం కాంగ్రెస్ ప్రభుత్వ అసలు స్వరూపాన్ని బయటపెడుతోందన్నారు.

**సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**

సర్ కార్యక్రమం ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమని కేటీఆర్ వివరించారు. జూన్ 25 నుంచి జూలై 25 వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రతి బూత్ స్థాయిలో పార్టీ కార్యకర్తలు, బీఎల్ఏలు చురుకుగా పనిచేయాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ, మ్యాపింగ్, కొత్త ఓటర్ల నమోదు, డాక్యుమెంట్ల పరిశీలన, ఓటరు హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ అందించబడిందన్నారు. పాలేరు నియోజకవర్గంలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా చూడడం ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త బాధ్యత అని స్పష్టం చేశారు. నిజాయితీగా ఎన్నికలు జరిగితే తెలంగాణలో బీఆర్ఎస్కు ప్రజలు ఘన విజయం అందిస్తారని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్చార్జ్ ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్ రెడ్డి, మెచ్చా నాగేశ్వరరావు, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, భద్రాద్రి జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ దిండిగళ్ల రాజేందర్, ఉద్యమకారులు బొమ్మెర రామ్మూర్తి, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిర్దేశిత సమయంలో టిజి ఐపాస్ దరఖాస్తులను పరిష్కరించాలి

**టిజి ఐ-పాస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించిన కలెక్టర్ దివాకర టీఎస్**



ఖమ్మం, జూన్ 17(మనం బ్యూరో): జిల్లాలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించేందుకు టిజి-ఐపాస్ కింద వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని కలెక్టర్ దివాకర టీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధికారులతో టిజి-ఐ-పాస్ కమిటీ సమావేశం నిర్వహించి పరిశ్రమల స్థాపన, టిజి ఐపాస్ అనుమతులు, టి - ప్రైడ్ పై పథకం అమలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో టీజి ఐపాస్ విధానం అమలవుతున్న తీరును ఆరా తీశారు. జిల్లాలో పరిశ్రమల అనుమతుల దరఖాస్తులను సకాలంలో జారీ చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు సంబంధించి వివిధ శాఖల అనుమతులకు వేచియున్న ప్రతిపాదనల సమస్యలపై సమీక్షించారు. పెండింగ్ లో ఉన్న ప్రతిపాదనలు సైతం తక్షణమే సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో టీ - ప్రైడ్ పథకం క్రింద నూతనంగా ఏర్పాటు చేసిన 12 ఎస్సీ, 13ఎస్టీ యూనిట్లకు ఒక కోటి 35 లక్షల 31 వేల 146 రూపాయల పెట్టుబడి సబ్సిడీని మంజూరు చేయడం జరిగిందన్నారు. పావలా వడ్డీ క్రింద ఒక ఎస్టీ యూనిట్ కు 46 వేల 374 రూపాయల సబ్సిడీ అందించామన్నారు. పరిశ్రమల శాఖ సంక్షేమ శాఖల సమన్వయంతో పథకాలు అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో జి.ఎం. పరిశ్రమల శాఖ ప్రవీణ్ కుమార్ , లీడ్ బ్యాంకు మేనేజర్ రవి ప్రసాద్, ఆర్టీవో శ్రీనివాస రావు, ఇడి ఎస్సి కార్పొరేషన్ ముజాహిద్, డిడి గిరిజన శాఖ విజయలక్ష్మి, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాస చారి, జిల్లా ఉపాధికల్పన అధికారిణి మాధవి, పరిశ్రమల శాఖ ఏడి నకుల్ రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు

**సమర్థవంతంగా అమలు చేయాలి: డాక్టర్ తుకారాం రాథోడ్**



భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 17 (మనంప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్ అధ్యక్షతన జిల్లా కుష్టు నిర్మూలన కార్యక్రమాల పై డిపిఎంఓలు (లెప్రసీ)మరియు హెల్త్ ఎడ్యుకేటర్ల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలో కుష్టు వ్యాధి నిర్మూలన కోసం చేపడుతున్న కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కుష్టు వ్యాధి అనుమానితులను త్వరితగతిన గుర్తించి పరీక్షలు నిర్వహించి, నిర్ధారణ అయిన వారికి వెంటనే మల్టీ డ్రగ్ థెరపీ (ఎం డి టి) చికిత్స ప్రారంభించి పూర్తిస్థాయిలో పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రతి ఆరోగ్య కేంద్ర పరిధిలో యాక్టివ్ కేస్ సెర్చ్, కాంటాక్ట్ సర్వేలు, ఫాలోఅప్ పర్యవేక్షణను క్రమం తప్పకుండా నిర్వహించాలని తెలిపారు. కుష్టు వ్యాధి పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించేలా ప్రజలను చైతన్యపరచాలని హెల్త్ ఎడ్యుకేటర్లకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత చికిత్స, వైకల్య నివారణ చర్యలు, స్వీయ సంరక్షణ (సెల్ఫ్ కేర్) పద్ధతులపై విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. పాఠశాలలు, గ్రామ సభలు, స్వయం సహాయక సంఘాలు, గ్రామ ఆరోగ్య పారిశుద్ధ్య మరియు పోషణ కమిటీ సమావేశాల ద్వారా ఆరోగ్య విద్యను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అంతేకాకుండా ఐఈసీ మరియు బీసీసీ, కార్యక్రమాలను బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో రికార్డులు, నివేదికలను సకాలంలో నవీకరించడం, నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలలో చేతబడి, బాణమతి క్షుద్ర పూజలు మరియు మూఢనమ్మకాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావాలని ఆరోగ్య విద్యా బోధకులకు ఆదేశించారు. ఈ సమావేశంలో డాక్టర్ ప్రతాప్ ప్రోగ్రాం ఆఫీసర్, భద్రూ పీజీయోతెరపిస్ట్ , మోహన్, శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్లు జయలక్ష్మి, రమాదేవి ,బేబీ , వినయ్ కుమార్, బద్రు, ప్రతిభ, మరియు సంబంధిత జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# డొంకను ఆక్రమించారు..

**కార్పొరేషన్ అధికారులకు వినతి...**



కొత్తగూడెం టౌన్ జూన్ 17 (మనం న్యూస్): జిల్లా కేంద్రమైన కొత్తగూడెం నగరంలోని ఎంజీ రోడ్డులోని దుకాణ సముదాయాల మధ్య ఉన్న ప్రజా సందును ఆక్రమిస్తూ స్లాబ్ నిర్మాణ పనులు చేపడుతున్నారని పలువురు స్థానికులు బుధవారం నగర ప్రణాళిక విభాగం అధికారులకు ఫిర్యాదు చేశారు. నిబంధనలను బేఖాతరు చేస్తూ జరుగుతున్న ఈ ఆక్రమణ వల్ల రాకపోకలు, మురుగునీటి పారుదలతో పాటు అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఈ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేసి, ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ విషయంపై స్పందించిన నగర ప్రణాళిక అధికారి నవీన్ మాట్లాడుతూ... అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా ప్రజా స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫిర్యాదుపై విచారణ నిర్వహించి, వాస్తవాలు నిర్ధారితమైతే ఆక్రమణలను తొలగించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# అశ్వారావుపేట బిఆర్ఎస్ రథసారధి ఎవరు?

దమ్మపేట, జూన్ 17(మనం న్యూస్): అశ్వారావుపేట బిఆర్ఎస్ రథసారధి ఎవరన్న దానిపై పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎప్పుడూ కూడా హాట్ టాపిక్ గా నిలిచే అశ్వారావుపేట నియోజకవర్గం ఇంచార్జ్ మీద ఆసక్తి నెలకొంది. ఈ నియోజకవర్గం ఆంధ్ర ప్రాంతానికి బోర్డర్ లో ఉండటం వల్ల మరీ ముఖ్యంగా ఒకసారి గెలిపించిన వారిని గెలిపించకుండా వేరే వారిని కొత్తవారికి ప్రాధాన్యత ఇవ్వడం కూడా ఇక్కడ ప్రజలకు ఆనవాయితీ మారింది. బిఆర్ఎస్ పార్టీలో మహిళా నేతలకు అవకాశం వచ్చినట్లయితే ముఖ్యంగా ముగ్గురు పేర్లు వినబడుతున్నాయి. వారిలో మాజీ జడ్పీటీసీ సున్నం నాగమణి, వగ్గేల పూజ, అన్నపురెడ్డిపల్లి మండలం నుండి మాజీ ఎంపీపీ సున్నం లలిత ఉన్నారు. మహిళా బిల్లు పాస్ అయితే తమకు అవకాశం వస్తుందని పోటీపడి మరి ప్రచారాలు చేసుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరావు, తాటి వెంకటేశ్వర్లు,తో పాటు సోయం వీరభద్రం కూడా ఈసారి గట్టిగా పోటీ పడుతున్నారు. నియోజవర్గ ఇంచార్జ్ లను మూడు నెలల క్రితం రద్దు చేసినప్పటికీ ఇంత వరకు ఈ నియోజకవర్గం ఇంచార్జ్ పదవి ఎవరికి ఇవ్వలేదు. ఈ పదవి ఎవరికి వరిస్తుందోనని నాయకులంతా పోటీపడి ఒకరి వెంట ఒకరు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు.

**అయోమయంలో బిఆర్ఎస్ కార్యకర్తలు**

ఎవరికి వారు యమునాతీరేలా నాయకులు ఉంటే కార్యకర్తలు ఎవరి వెంట వెళ్లాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు. ఎవరితో తిరిగితే ఏమవుతుందో తెలియని పరిస్థితిలో బీఆర్ఎస్ కార్యకర్తలున్నారు. కొంతమంది నాయకులు ఫోటోలు ఎందుకు దిగుతున్నారు, నా ఫోటో పెట్టాలని కూడా కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్నట్లు తెలుస్తోంది. ఇంతకీ అశ్వారావుపేట నియోజకవర్గ ఇంచార్జ్ పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి..

- కలెక్టర్ దివాకర టీఎస్
- ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ వంద శాతం చేపట్టాలి
- సర్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం



ఖమ్మం, జూన్ 17(మనం బ్యూరో): అర్హులైన ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ఈ నెల 25 నుండి ప్రారంభం కానుందని తెలిపారు. రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ స్థాయి ఏజెంట్ ల నియామకం చేయాలని, ఇంకనూ నియామకం చేయని రాజకీయ పార్టీలు వెంటనే ప్రక్రియ పూర్తి చేసి, జాబితా సమర్పించాలని అన్నారు.

బూత్ స్థాయి అధికారులతో, బూత్ స్థాయి ఏజెంట్ లు ఇంటింటి ఎన్యుమరేషన్ లో పాల్గొనాలన్నారు. ఇంకనూ మ్యాపింగ్ కాని వారి నుండి 11 రకాల ధృవీకరణలో ఏది ఉన్న సేకరించి బూత్ స్థాయి అధికారికి అందజేయాలన్నారు. 1987 కంటే ముందు పుట్టిన వారు స్వంతంగా, 1987 నుండి 2004 మధ్యలో పుట్టిన వారు స్వంతం తో పాటు తల్లిదండ్రుల్లో ఒకరి, 2004 తర్వాత పుట్టిన వారు స్వంతంతో పాటు తల్లిదండ్రులు, తల్లిదండ్రులు లేకపోతే తాత/నానమ్మ ల ధృవీకరణలు ఆధార్ తో పాటు సమర్పించాల్సి ఉంటుందన్నారు.

బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్ లు జూన్ 25 నుండి ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలు రెండు కాపీలు నింపి, ఒకటి ఓటరుకు, ఒకటి బూత్ స్థాయి అధికారుల వద్ద ఉంచుకోవాలన్నారు. మ్యాపింగ్ అయిన వారు ఎటువంటి డాక్యుమెంట్స్ సమర్పించాల్సిన అవసరం లేదని, మ్యాపింగ్ కానివారు 11 రకాల ధృవీకరణలలో ఏదో ఒకటి సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో ప్రజలు భాగస్వామ్యం అవ్వాలని, ఇందుకై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఎస్డీసి సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎంఏ. రాజు, డిటి అన్సారీ, బిజెపి పార్టీ ప్రతినిధులు వి. రాజేష్, బి. శ్యామ్ సుందర్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు లింగనబోయిన సతీష్ బాబు, బి. జసవంత్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పి. నరేందర్ రావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణ ప్రసాద్, సిపిఐ ఎం పార్టీ ప్రతినిధులు నెల్లూరి వీరబాబు, వై. రవి కుమార్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ. గోపాల్ రావు, బీఎస్పీ పార్టీ ప్రతినిధి చెరుకుపల్లి నాగేశ్వరరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరేళ్ల కూతురిని నదిలో తోసేసి.. తానూ దూకిన ప్రవాస భారతీయుడు!



సిడ్నీ, జూన్ 17: ఆస్ట్రేలియాలో ఇటీవల చోటుచేసుకున్న బోటు ప్రమాద ఘటన కేసు కీలక మలుపు తిరిగింది. ప్రవాస భారతీయుడు సహా ఆయన ఆరేళ్ల కుమార్తె ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోలేదని తెలిసింది. చిన్నారిని నీటిలో తోసేసిన తండ్రి.. ఆ తర్వాత బలవన్మరణానికి పాల్పడినట్లు దర్యాప్తు అధికారులు ప్రాథమికంగా నిర్ధరించారు.

భారత్కు చెందిన మాలిక్ ధంధుకియా (47) కొన్నేళ్ల క్రితం ఆస్ట్రేలియాకు వెళ్లి స్థిరపడ్డారు. ఐటీ రంగంలో పనిచేస్తున్న ఆయన.. ఇటీవల తన ఆరేళ్ల కుమార్తెతో కలిసి (జూన్ 13న) సిడ్నీలోని కాంకర్డ్ సమీపంలో ఉన్న పారామట్టా నదిలో బోటింగ్కు వెళ్లారు. ఓ పడవను అద్దెకు తీసుకున్నాడు. తొలుత లైఫ్ జాకెట్లను ధరించినప్పటికీ ఆ తర్వాత వాటిని తొలగించారు. ఈ క్రమంలోనే నదిలో పడి ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. నీటిలో ఓ మృతదేహం తేలియాడుతున్నట్లు గమనించిన ఓ వ్యక్తి.. పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో రంగంలోకి దిగిన రెస్క్యూ సిబ్బంది.. ఏడు గంటల పాటు గాలించి చిన్నారి మృతదేహాన్ని గుర్తించారు.

ప్రమాదవశాత్తు ఈ ఘటన జరిగిందనుకుంటున్న వేళ దర్యాప్తు అధికారులకు పడవలో ఓ నోట్ లభ్యమైంది. అందులో ఉన్న అంశాల ఆధారంగా ఆ చిన్నారిని తండ్రి హత్య చేసి ఉండవచ్చని ప్రాథమికంగా నిర్ధరణకు వచ్చారు. ఇదే సమయంలో సమీపంలోని ఓ భవనంలో ఉన్న సీసీ కెమెరాల్లో ఘటన దృశ్యాలు నమోదయ్యాయి. తొలుత కుమార్తెను నీటిలో తోసేసిన ధంధుకియా, ఆ తర్వాత తానూ నదిలోకి దూకినట్లు అందులో కనిపించింది.

ఈ ఘటనకు కొద్ది రోజులముందు రెండు, మూడుసార్లు ధంధుకియా అదే ప్రాంతంలో బోటింగ్కు వెళ్లినట్లు తెలిసింది. ఓసారి భార్య, చిన్నారితో కలిసి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ముందస్తు ప్రణాళికలో భాగంగానే అలా వెళ్లినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. మరణానికి స్పష్టమైన కారణాలు తెలియనప్పటికీ.. తన జీవితంలో 90శాతం సమస్యలు తీవ్ర మెడ నొప్పి వల్లేనంటూ కొన్ని రోజుల క్రితం అయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టినట్లు సమాచారం.

# భారత సంతతి వ్యక్తికి 5 కోట్ల జాక్‌పాట్




అబుదాబి, జూన్ 17: అబుధాబిలో భారత సంతతి వ్యక్తికి జాక్‌పాట్‌ట్ తగిలింది. ఒక బ్యాంక్ నిర్వహిస్తోన్న మిలియనీర్ క్యాంపెయిన్‌లో అతడిని అదృష్టం వరించింది. ఖాతా తెరిచిన రెండు నెలల్లోనే షజీర్ వెంగా అనే వ్యక్తి ఏకంగా దాదాపు రూ.5.15 కోట్లు గెల్చుకున్నారు. ఇంతకీ విషయం ఏంటంటే..? యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని షార్జా ఇస్లామిక్ బ్యాంక్ ఏటా 'మిలియనీర్ క్యాంపెయిన్' నిర్వహిస్తుంటుంది. వినియోగదారులు పొదుపు వైపు మొగ్గు చూపేలా ప్రతి సంవత్సరం 20మిలియన్ల దిర్హమ్‌లను ప్రైజ్‌మనీగా కేటాయించింది. 10వేల దిర్హమ్‌ల ఖాతాలో డిపాజిట్ చేసేవారు రెగ్యులర్ డ్రాలో పాల్గొనే అవకాశం ఉంటుంది. ప్రతి 10వేల దిర్హమ్‌లకు ఒకసారి ఆ అవకాశం లభిస్తుంది. ఆ డ్రాలో గెలిచిన వారు క్యాష్ రివార్డ్స్, లగ్జరీ వాహనాలు వంటి భారీ బహుమతులు గెల్చుకునే వీలుంటుంది. అబుధాబిలో నివసిస్తున్న షజీర్ వెంగా.. రెండు నెలల క్రితం ఈ బ్యాంకులో ఖాతా తెరిచి, రెగ్యులర్ డ్రాలో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకున్నారు. తాజాగా బ్యాంక్ మిలియనీర్ డ్రా విజేతలను ప్రకటించగా.. వెంగా 2మిలియన్ దిర్హమ్స్ (దాదాపు రూ.ఐదు కోట్లకు పైగా)ను గెల్చుకున్నారు. వెంగాతో పాటు ఇతర విజేతల వివరాలను సదరు బ్యాంకు తన 'ఎక్స్' ఖాతాలో ప్రకటించింది. తనకు వరించిన అదృష్టంపై వెంగా సంతోషం వ్యక్తం చేశారు. ''మిలియనీర్ క్యాంపెయిన్ గురించి తెలుసుకొని, ఏదో ఒకరోజు అందులో గెలవాలని అనుకున్నాను. ఇప్పుడు నాకు వచ్చిన ఈ క్యాష్ రివార్డ్.. నా జీవితాన్ని మార్చేస్తుంది. ఇక భారత్ నుంచి నా కుటుంబాన్ని యూఏఈకి తీసుకు వస్తాను'' అంటూ బ్యాంక్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రభుత్వ పాఠశాలకి భారీగా అడ్మిషన్లు



తిరుమలగిరి, జూన్17 (మనం న్యూస్): తిరుమలగిరి లోని ఎంపిపి ఎస్ పాఠశాలకు వివిధ ప్రైవేట్ పాఠశాలల నుండి 45మంది విద్యార్థులు బుధవారం నూతనంగా అడ్మిషన్లు నమోదు చేసుకున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్ రెడ్డి తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు స్వచ్ఛందంగా పాఠశాలకు విచ్చేసి తమ పిల్లలను పాఠశాలలో చేర్పించారని తెలిపారు. పాఠశాలపై నమ్మకం పెట్టుకొని తమ పిల్లలని చేర్చిన తల్లిదండ్రులందరికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.



## శ్రీకాళహస్తి సబ్ డివిజన్లో ప్రత్యేక కార్యక్రమాలు

- శ్రీకాళహస్తి డ్రగ్ స్క్రీనింగ్ పరీక్షలు 70 మందికి మాదకద్రవ్యాల వినియోగ నిర్ధారణ పరీక్షలు

**శ్రీకాళహస్తి, జూన్ 17 మనం న్యూస్:** తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలు అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా, జిల్లా ఎస్పీ విడుదల చేసిన కార్యాచరణ ప్రణాళిక మేరకు శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. శ్రీకాళహస్తి డీఎస్పీ కె. నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ఈగల్ సీఐ జి. ప్రసాద్ పోలీసు సిబ్బందిపాల్గొన్నారు.మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా అవగాహన, తనిఖీలు, కౌన్సెలింగ్ కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి టూ టౌన్, తొట్టంబేడు, శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్ల ఇన్స్పెక్టర్ల ఆధ్వర్యంలో మొత్తం 70 మందికి డ్రగ్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా, వారిలో ఇద్దరికి మాదకద్రవ్యాల వినియోగం పాజిటివ్గా నిర్ధారణ అయింది. వారికి డ్రగ్ అబ్యూస్ ప్రివెన్షన్ (డీఏపీ) సిబ్బంది ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి, వారి పూర్తి వివరాలను నమోదు చేశారు.



## బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమ సేవలపై ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు వెంకట పద్మలత

**చిత్తూరు, జూన్ 17 మనం న్యూస్:** బాలల హక్కులు, సంక్షేమం కోసం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పనిచేస్తుందని కమిషన్ సభ్యురాలు వెంకట పద్మలత పేర్కొన్నారు, చిత్తూరు జిల్లా రెండు రోజుల పర్యటనలో భాగంగా కమిషన్ సభ్యురాలు బుధవారం చిత్తూరు పట్టణంలో పర్యటించి పలు ప్రభుత్వ, సంక్షేమ, ఆరోగ్య సంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి, స్కానింగ్ కేంద్రాలు, శిశు గృహం, వన్ స్టాప్ సెంటర్, ఆనంద నిలయం, ఎస్సీ వెల్ఫేర్ హాస్టళ్లలో అందుతున్న సేవలను పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.

బాలలు, మహిళలకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో బాలల సంక్షేమం, ఆరోగ్య సేవలు, సంరక్షణ కేంద్రాల పనితీరును మరింత మెరుగుపరిచేందుకు నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించిన ఆమె, విద్యార్థినులకు అందుతున్న విద్యా, వసతి మరియు ఇతర సౌకర్యాలను పరిశీలించారు..ఈ కార్యక్రమంలో. డి వెంకటేశ్వరి పిడి ఐసిడిఎస్, నిర్మల జిల్లా మిషన్ కోఆర్డినేటర్, సుబ్రహ్మణ్యం జిల్లా బాలల సంరక్షణ అధికారి, సంబంధిత శాఖల అధికారులు, సంస్థల నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శక్తి యాప్ ప్రాముఖ్యతలపై అవగాహన



**చిత్తూరు జూన్ 17 మనం న్యూస్:** చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఆదేశాల మేరకు శక్తి టీం నోడల్ అధికారి నాన్ కేడర్ ఎస్పీ ఆపరేషన్స్ ఎస్.ఆర్. రాజశేఖర్ రాజు పర్యవేక్షణలో శక్తి బృందాలు మరియు మహిళా స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస రావు ఆధ్వర్యంలో మహిళ స్టేషన్ ఎస్.ఐ. సుబ్బారెడ్డి ఈరోజు చిత్తూరు పట్టణములోని కన్నన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్ ఎస్.ఐ గారు మాట్లాడుతూ, బాల్యవివాహం ఒక పెద్ద సమస్య. బాలికలు 18 సంవత్సరాలు పూర్తిచేయక ముందే పెళ్లి జరపడం చట్ట విరుద్ధం. చిన్న వయసులో పెళ్లి చేస్తే చదువు ఆగిపోవడం, ఆరోగ్య సమస్యలు రావడం, భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. అందుకే మీరు చదువులో ముందుకు వెళ్లి, జీవితాన్ని సక్రమంగా తీర్చిదిద్దుకోవాలి. పోక్సో చట్టం చాలా కఠినమైనది. 18 సంవత్సరాల లోపు పిల్లలపై లైంగిక వేధింపులు, దాడులు జరిగితే దానికి కఠినమైన శిక్షలు ఉంటాయి. ఇలాంటి సంఘటన ఎప్పుడైనా ఎదురైతే భయపడకుండా పోలీసులకు తెలియజేయాలి. అత్యవసర పరిస్థితుల్లో 112 (ఎమర్జెన్సీ నంబర్), 1098 (చైల్ హెల్ప్లైన్), వంటి హెల్ప్లైన్ నంబర్లను గుర్తుంచుకోవాలి. ఇవి మీకు వెంటనే సహాయం అందిస్తాయి.బాలికల కోసం ప్రభుత్వం అందించిన శక్తియాప్ చాలాఉపయోగకరమైనది. ఎటువంటి ప్రమాదం ఎదురైనా ఆ యాప్లో సులభంగా పోలీసులకు సమాచారం ఇవ్వగలరు. మీ భద్రత కోసం తప్పనిసరిగా ఈ యాప్ ఉపయోగించాలి. మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రారంభించిన శక్తి యాప్ అత్యవసర సమయంలో ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. అత్యవసర సమయంలో ఒకే (ఎస్ఓఎస్) బటన్ ప్రెస్ చేయగానే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం చేరుతుంది. ఈ యాప్ అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు తక్షణ సహాయం అందించేందుకు ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ప్రమాదకర పరిస్థితుల్లో యాప్ ద్వారా పోలీసులకు సమాచారం చేరవేయడం, కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో పాటు, అత్యవసర సేవలు అందించేందుకు ఇది ఎంతో మేలైన సాధనమని పేర్కొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ రైతు పొలాన్ని సందర్శించిన కలెక్టర్



**తిరుపతి, జూన్ 17 మనం న్యూస్:** ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృతంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను అందించే ప్రకృతి వ్యవసాయ విధానాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సూచించారు.బుధవారం శ్రీకాళహస్తి మండలం వేడం గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు ఎ. పుష్ప కు చెందిన మూడు ఎకరాల వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు.

ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో కీలకమైన విత్తన గుళికల తయారీ విధానం, దాని ప్రయోజనాలు, తయారీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ స్వయంగా ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, బూడిద మరియు విత్తనాలను కలిపి విత్తన గుళికలను తయారు చేశారు. అనంతరం రైతు పుష్ప పొలంలో విత్తన గుళికలను బ్రాడ్కాస్టింగ్ పద్ధతిలో చల్లి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా రైతు పుష్పతో మాట్లాడిన జిల్లా కలెక్టర్ పశుగ్రాసం లభ్యత, నేల సారం పెంపు, ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తి వ్యయాల తగ్గింపు, రైతులకు కలుగుతున్న ఆర్థిక ప్రయోజనాల పై ఆరా తీశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటునిస్తుందని పేర్కొన్నారు. అనంతరం యూరియా పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా ఎపిఏఐయంఎస్ మొబైల్ యాప్పు డౌన్లోడ్ చేసుకొని ఎరువుల నిల్వల వివరాలను తెలుసుకోవాలని సూచించారు. అవసరమైన యూరియాను ముందస్తుగా యాప్ ద్వారా బుక్ చేసుకోవడం ద్వారా సమీప ఎరువుల దుకాణాలలో అందుబాటులో ఉన్న ఎరువులు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాశ్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు, జిల్లా అదనపు వ్యవసాయ సంచాలకులు ధనుంజయ రెడ్డి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం, ఏ.డి.ఏ. రమేష్ రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు సూర్యప్రకాశ్ రెడ్డి, వ్యవసాయ అధికారి మమత, అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పట్టాభిరెడ్డి, తహసీల్దార్, ఎంపీడీవోలు, ఏపీఓలు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల ఇన్చార్జీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## అందుబాటులోకి జవాబుదారీతనంతో కూడిన పోలీసు సేవలు

**రైల్వే కోడూరు జూన్ 17మనం న్యూస్:** తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు మరింత సమర్థవంతమైన, వేగవంతమైన పోలీసు సేవలను అందించాలనే లక్ష్యంతో పుల్లంపేట మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన రైల్వే కోడూరు రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించి, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, పరిపాలనా విధానాలు, ప్రజలకు అందించనున్న సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ, తిరుపతి జిల్లా పునర్విభజన అనంతరం రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని రెండు సర్కిల్ కార్యాలయాలు కూడా రైల్వే కోడూరు పట్టణంలోనే కొనసాగుతున్నాయని తెలిపారు. దీంతో రైల్వే



కోడూరు రూరల్ ప్రాంతాలకు చెందిన ప్రజలు, ముఖ్యంగా పుల్లంపేట, పెనగలూరు, ఓబుళవారిపల్లి మండలాల ప్రజలు పిటిషన్లు, పరిపాలనా అవసరాల కోసం రైల్వే కోడూరుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, ప్రజల సౌకర్యార్థం పుల్లంపేట మండల కేంద్రంలో రైల్వే కోడూరు రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి (శాంతిభద్రతలు), ఏ. శ్రీనివాసరావు (క్రైమ్స్), రేణిగుంట సబ్ డివిజన్ అధికారి శ్రీనివాస రావు ఎస్బీ ఇన్స్పెక్టర్ విక్రమ్, పుల్లంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కోడూరు టౌన్ సీఐ చంద్రశేఖర్, రేణిగుంట, గాజులమండ్యం సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఈ కార్యాలయంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ అందుబాటులో ఉండడంతో పాటు, సర్కిల్ పరిధిలోని పుల్లంపేట, పెనగలూరు, ఓబుళవారిపల్లి, చిట్వేల్ పోలీస్ స్టేషన్ల పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఫలితంగా ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ కావడంతో పాటు, ఫిర్యాదుల స్వీకరణ, విచారణ, సమస్యల పరిష్కారం, అత్యవసర పరిస్థితుల్లో స్పందన మరింత వేగవంతం అవుతుందని తెలిపారు.

## పాలచూరు క్యాస్కేడింగ్ సిస్టమ్లో జరుగుతున్న పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**నాయుడుపేట, జూన్ 17 (మనం న్యూస్):** వర్షపు నీటిని ప్రతి బొట్టును సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడే విధంగా చెరువులు, కాలువలు, నీటి వనరులను పునరుద్ధరించడమే జల ధార - జల హారతి లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వేంకటేశ్వర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జలధార - జలహారతి కార్యక్రమం కింద చేపడుతున్న పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీతో కలిసి నాయుడుపేట మండలంలోని పాలచూరు క్యాస్కేడింగ్ సిస్టమ్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాలచూరు సిస్టమ్లో స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతానికి అనుసంధానంగా సుమారు 23 కిలోమీటర్ల మేర విస్తరించిన 12 చెరువులు ఉన్నాయని, ఈ చెరువుల ద్వారా సుమారు 6,000 ఎకరాల ఆయకట్టు సాగునీటి సౌకర్యాన్ని పొందుతోందన్నారు. జలధార - జలహారతి కార్యక్రమం ద్వారా ఇరిగేషన్ శాఖ చేపడుతున్న పనులకు ఎన్ ఆర్ ఈ జి ఎస్ పనులను అనుసంధానం చేస్తూ సమన్వయంతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి వర్షపు నీటి బొట్టును సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడే విధంగా చెరువులు, కాలువలు, నీటి వనరులను పునరుద్ధరించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డ్వామా పిడి మద్దిలేటి, ఇరిగేషన్ ఎస్ఇ రాధాకృష్ణ, ఏపిఐఐసి జెడ్ ఎం.భరత్ కుమార్ రెడ్డి, నాయుడుపేట ఆర్ అండ్ బి డిఈ పరమేశ్వరి, నాయుడు పేట తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఓ రాజేంద్ర, ఇరిగేషన్ ఇఇ బాబు, డిఇ విశ్వనాథ్, ఏఇ శ్రీనివాసులు, ఏపిఓ ఎన్ఆర్ఈజిఎస్ ఎం.భానుప్రియ, జేఇ నాగభూషణం, అధికారులు, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ పై చేస్తున్న ఆరోపణలను తిప్పి కొడదాం

- ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

**కుప్పం, జూన్ 17 మనం న్యూస్:** ప్రజా సంక్షేమాన్ని కోరి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలను ప్రజలకు తెలియజేసి, 2029 సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి ఎన్ డి ఏ సర్కార్ ను అధికారంలోకి తెచ్చుకునేందుకు మన మంతా ఐక్యంగా పనిచేద్దామని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు కూటమి నాయకులు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. అదేసమయంలో కూటమి ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించిన 2025 మెగా డీఎస్సీ పై వైకాపా చేస్తున్న విమర్శలను తిప్పుకొట్టాలని ఆయన సూచించారు. బుధవారం కుప్పం ఏపీఎస్ఆర్టీసీ సమీపంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు సంబంధించి, సంక్షేమ విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ విజయోత్సవ సభ కార్యక్రమానికి చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ముందుగా ఆయన , ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, పికేయం హుడా చైర్మన్ డాక్టర్ సురేష్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మహిళా నేతలు,కుప్పం నియోజకవర్గానికి సంబంధించిన కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పుష్పాలు సమర్పించి ఘన నివాళులర్పించారు. జోహార్ ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా



చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, రెండేళ్ల విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా టిటిడి, బిజేపి, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలకు ఆయన ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ విజయోత్సవ సభా కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్, రెస్కో చైర్మన్ ప్రతాప్, కడ అడ్వైజర్ మెంబర్ రాజ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ రాజు పాల్గొన్నారు.

## తోతాపురి మామిడి రైతులకు కిలోకు రూ.6 కంటే తక్కువ ధర చెల్లిస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

**తిరుపతి, జూన్ 17మనం న్యూస్:** జిల్లాలో తోతాపురి మామిడి కొనుగోలు ప్రక్రియలు సజావుగా కొనసాగుతున్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డితో కలిసి రేణిగుంట మండలంలోని వర్ష ప్రాసెసింగ్ యూనిట్ను సందర్శించిన కలెక్టర్, కొనుగోలు ప్రక్రియలు, ధరల అమలు, రైతులకు అందుతున్న సేవలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత ఏడాది అధిక దిగుబడి కారణంగా రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని



ప్రభుత్వం రైతులకు మద్దతు కల్పించిందన్నారు. ఈ ఏడాది మార్కెట్ పరిస్థితులు మెరుగ్గా ఉన్నప్పటికీ, రైతులకు కిలోకు రూ.6 కంటే తక్కువ ధర రాకుండా చూడాలని రాష్ట్ర ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఇటీవల తిరుపతి పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి స్వయంగా రైతులతో సమావేశమై వారికి భరోసా కల్పించారని, రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందన్నారు.రానున్న 10 నుండి 15 రోజులు తోతాపురి సీజన్లో అత్యంత కీలకమైన కాలమని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు పక్వానికి రాని కాయలను కోయకుండా, పూర్తిగా పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే కోసి విక్రయించాలని సూచించారు. పక్వానికి రాని కాయలను విక్రయించడం వల్ల రైతులకే నష్టం కలుగుతుందని వివరించారు. ప్రాసెసింగ్ యూనిట్ల వద్ద రైతులు, రవాణా వాహనాలు ఇబ్బందులు ఎదుర్కోకుండా టోకెన్ విధానాన్ని అమలు చేయాలని అన్ని యూనిట్లకు ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

## విజిలెన్స్, సెక్యూరిటీల అవగాహన సమావేశం



**తిరుమల జూన్ 17 మనం న్యూస్:** తిరుమలలో భక్తులకు మరింత నాణ్యమైన సేవలు అందించడం, క్షేత్ర పవిత్రతను పరిరక్షించడం, శాంతిభద్రతలను బలోపేతం చేయడం మరియు వ్యాపార కార్యకలాపాలను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం లక్ష్యంగా పోలీసు, విజిలెన్స్ మరియు సెక్యూరిటీ శాఖల ఆధ్వర్యంలో స్థానిక దుకాణాల యజమానులతో అవగాహన సమావేశం తిరుమల ఆస్థాన మండపంలో నిర్వహించబడింది.ఈ సమావేశంలో దుకాణాల యజమానులకు ధరల ప్రదర్శన బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయడం, అనుమతి లేకుండా దుకాణాలను సబ్-లీజ్కు ఇవ్వకపోవడం, లైసెన్స్ లేని హాకర్లను ప్రోత్సహించకపోవడం, నిషేధిత లేదా అనుమతి లేని వస్తువుల విక్రయాన్ని నివారించడం, అగ్నిమాపక భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించడం, అనుమతించిన పరిమితికి మించి నిల్వలను ఉంచకపోవడం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించబడింది.

అదేవిధంగా, దుకాణాల్లో పనిచేసే సిబ్బంది పూర్తి వివరాలను సంబంధిత అధికారులకు నిరంతరం అందించడం, వారి నేపథ్యం మరియు నేర చరిత్రను పరిశీలించిన అనంతరం మాత్రమే నియామకాలు చేపట్టడం, ఎన్యూమరేషన్ డేటాను సకాలంలో సమర్పించడం, భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం ఎటువంటి వివాదాస్పద పరిస్థితులకు తావు ఇవ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించడం వంటి అంశాలపై స్పష్టమైన సూచనలు జారీ చేయబడ్డాయి.ఈ సమావేశం తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు,టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి మురళీకృష్ణ, ఆదేశాల మేరకు, తిరుమల అదనపు ఎస్పీ ఐ. రామకృష్ణ మార్గదర్శకత్వంలో, తిరుమల డీఎస్పీవిజయశేఖర్ టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగానికి చెందిన వీజీవో సురేంద్ర నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సుమారు 350 మంది దుకాణాల యజమానులతో పాటు తిరుమల వన్ టౌన్, టూ టౌన్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు, సెక్టార్-3 సెక్టార్-4 ఏవీఎస్వోలు, పోలీసు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.తిరుమలలో శాంతిభద్రతలు, భద్రతా ప్రమాణాలు, క్షేత్ర పవిత్రత భక్తుల సంక్షేమ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు పిలుపునిచ్చారు.

## ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్



**తిరుపతి జూన్ 17 మనం న్యూస్:** ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తిరుపతి నగరంలో కుళ్ళిపోయిన మాంసం, నాసిరకం ఆహార పదార్థాల విక్రయం ద్వారా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న హోటళ్లు, రెస్టారెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని వివిధ ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. తిరుపతి నగరంలోని యశోదానగర్లో గల సిపిఎం కార్యాలయంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ మేరకు వక్తలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశం సిపిఎం నగర కార్యదర్శి కె. వేణుగోపాల్ అధ్యక్షతన జరిగింది.సమావేశంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, సి పి యం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు,సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి పి. వెంకటరత్నం, స్థానిక హక్కుల పోరాట కమిటీ కన్వీనర్ డి.ఎం.సి. భాస్కర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి నగరంలో ప్రజల ఆరోగ్యం, భద్రత, సంక్షేమం వంటి అత్యంత కీలకమైన అంశాలు పక్కనపెట్టి అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పర విమర్శలకే పరిమితమవుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి బండి చలపతి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి. సుబ్రహ్మణ్యం, జిల్లా కమిటీ సభ్యులు ఎస్. జయచంద్ర, ఆర్. లక్ష్మీ, పి. బుజ్జి, ఎం. నరేంద్ర, ఎం. జయంతి, టి. రామకృష్ణ, డి. పార్థసారథి, ఎన్. మునిరత్నం, జి. వాసు, మునిరాజా, ఈ. సుజాతమ్మ, వీరేష్, వినోద్, పవిత్ర, పద్మ, షకీలా, ప్రసూన పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన జీవితానికి యోగా ఉత్తమ మార్గం

జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు



**చంద్రగిరి జూన్ 17 మనం న్యూస్:** ఆరోగ్యవంతమైన జీవితానికి యోగ ఉత్తమ మార్గమని ప్రతి ఒక్కరి నిత్యజీవితంలో యోగా ను భాగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు,రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ లు తెలిపారు. బుధవారం తిరుపతి జిల్లా పరిధి లోని చంద్రగిరి కోటలో జరిగిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర -2026 కార్యక్రమంలో భాగంగా జిల్లా పర్యాటకశాఖ ఆధర్వంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, జిల్లా పర్యాటక శాఖ అధికారి జనార్దన్ రెడ్డి,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నా ఈ కార్యక్రమంలో భాగంగా యోగా గురువు చెప్పిన విధంగా ఆసనాలు ఆసక్తిగా ఉంటూ ప్రజలు, అధికారులు ఆసనాలు వేయడం జరిగింది. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ జూన్ 21 వ తేదీన జరుపుకోవడం జరుగుతుందని అందులో భాగంగా జూన్ 7 వ తేదీ నుంచి జూన్ 21 వ తేదీ వరకు గ్రామ, సచివాలయ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో వివిధ రకాల పోటీలనునిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. జూన్ 7వ తేదీన జూ పార్కు నందు పెద్ద ఎత్తున యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈసారి రాష్ట్రంలో ఎక్కడికక్కడ యోగ డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై యోగాసనాలు నిర్వహించారు.

# స్మోకింగ్ వదిలేసిన మెలోనీ..

## మెక్రాన్ వాచ్ కావాలన్న ట్రంప్

## జీ-7లో ఆసక్తికర సంగతులు



**పారిస్, జూన్ 17:** అంతర్జాతీయ సమావేశాల్లో దేశాధినేతల మధ్య దౌత్య చర్చలు, అధికారిక ప్రసంగాలు, కీలక ప్రకటనలు వంటివి సాధారణమే. అయితే, వాటి మధ్యలో సభ్యుల సరదా సంభాషణలు కూడా ఉంటాయి. ఒక్కోసారి అలాంటివి నేతలకు తెలియకుండానే మైక్రోఫోన్లలో రికార్డ్ అవుతుంటాయి. తాజాగా ఫ్రాన్స్ వేదికగా జరుగుతోన్న జీ-7 సదస్సులోనూ అలాంటి సంగతులు కొన్ని ఉన్నాయి. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహా పలువురు నేతల మధ్య ఆసక్తికర సంఘటనలు చోటుచేసుకున్నాయి. అవేంటో చూద్దాం..! జీ-7 దేశాల నేతలు సమావేశానికి సిద్ధమవుతుండగా.. జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్.. ఇటలీ ప్రధాని మెలోనీని సిగరెట్ గురించి అడిగారు. దానికి మెలోనీ స్పందిస్తూ.. 'నేను స్మోకింగ్ చేయట్లేదు. మే ఒకటి నుంచే వదిలేశా' అని చెప్పారు. దీంతో అక్కడున్న మిగతా నేతలంతా ఆమెను అభినందించారు. గతంలో మెలోనీ స్మోకింగ్ గురించి ట్రంప్ ఓసారి ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ఆమె సిగరెట్ మానేస్తే మరింత అందంగా ఉంటారని నాడు అమెరికా అధ్యక్షుడు వ్యాఖ్యానించారు.

సమావేశం అనంతరం దేశాధినేతలు లంచ్‌కు వెళ్లే సమయంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తన వాచ్‌ను మీటింగ్ రూమ్‌లో మర్చిపోయారు. దాన్ని గుర్తించిన కెనడా ప్రధాని మార్క్ కార్నీ .. 'మాకు మెక్రాన్ వాచ్ దొరికింది' అని సరదాగా అన్నారు. వెంటనే ట్రంప్ స్పందిస్తూ.. 'ఆ వాచ్ నాకిచ్చేయండి' అని అనడం మైక్రోఫోన్‌లో రికార్డ్ అయ్యింది.

ట్రంప్ కోసం జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ ఓ కానుక తీసుకొచ్చారు. ట్రంప్ పేరు, 47 నంబరుతో ఉన్న జర్మన్ నేషనల్ ఫుట్‌బాల్ జట్టు జెర్సీని అందించారు. ట్రంప్ అమెరికాకు 47వ అధ్యక్షుడు అన్న సంగతి తెలిసిందే.

జీ-7 సదస్సుకు విచ్చేసిన దేశాధినేతలకు మెక్రాన్ కూడా ప్రత్యేక బహుమతులు ఇచ్చారు. వచ్చే ఏడాది ఆలప్స్ వేదికగా సైక్లింగ్ వరల్డ్ ఛాంపియన్షిప్ జరగనుంది. దాన్ని ప్రమోట్ చేసేందుకు ప్రత్యేక సైకిళ్లను నేతలకు కానుకగా ఇచ్చారు. అయితే, సాధారణంగా సైక్లింగ్ వంటి వ్యాయామాలను ట్రంప్ ఇష్టపడరు. దీంతో సైకిల్ను చూడగానే ఆయన ఓ వింత రియాక్షన్ ఇచ్చినట్లు తెలిసింది.

యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు అంటానియో కోస్టాతో మాట్లాడుతూ ట్రంప్ 'మీకు అర్థమవుతోందా.. గ్రీన్‌లాండ్' అనే పదాలు అనడం మైక్‌లో రికార్డ్ అయ్యింది. వారిద్దరూ ఏం మాట్లాడుకున్నారో తెలియదు గానీ.. గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ ఆసక్తి ఈ సమావేశంలో మరోసారి బయటపడినట్లయ్యింది.

జీ-7 గ్రూప్ ఫొటో కోసం నేతలంతా సిద్ధమవుతుండగా భారత ప్రధాని మోడీని మెలోనీ పలకరించారు. 'మనం ఇన్‌స్టాలో ఎంతో ఫేమస్' అని చెప్పడంతో అక్కడున్నవారంతా చిరునవ్వులు చిందించారు. వీరిద్దరూ భేటీ అయినప్పుడల్లా సోషల్‌మీడియాలో 'మెలోడీ' మూమెంట్ వైరల్ అవుతోన్న సంగతి తెలిసిందే.

# అది భారత 'తోమహాక్'!

**ఢిల్లీ, జూన్ 17:** మన వ్యూహాత్మక లక్ష్యాలను నెరవేర్చనున్న కొత్త క్రూజ్ క్షిపణి భూతల లక్ష్యాలపై దాడి చేసే దీర్ఘశ్రేణి క్రూజ్ క్షిపణి (ఎల్ఆర్ఎల్ఏసీఎం) భారత్‌కు అదనపు బలాన్ని ఇవ్వనుందని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. దీన్ని అమెరికా అమ్ములపొదిలోని తోమహాక్ క్షిపణితో పోలుస్తున్నారు. సుదూర లేదా పటిష్ఠమైన లక్ష్యాల్ని ఛేదించాలనుకున్నప్పుడు అగ్రరాజ్యం ఎక్కువగా తోమహాక్‌లను రంగంలోకి దింపుతుంది.

సోమవారం ఒడిశా తీరానికి చేరువలోని ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి జరిగిన ఎల్ఆర్ఎల్ఏసీఎం క్షిపణి పరీక్ష విజయవంతమైన సంగతి తెలిసిందే. దీని పూర్తి వివరాలను ప్రభుత్వం వెల్లడించకపోయినప్పటికీ ఈ అస్త్రం పరిధి 1,000 నుంచి 1,500 కిలోమీటర్ల వరకు ఉండొచ్చని అంచనా. గతంలో ఎన్నో వైఫల్యాలు చవిచూసిన నిర్భయ్ క్షిపణి ప్రాజెక్టుకు ఇది మరింత ఆధునిక వెర్షన్ అని తెలుస్తోంది.

సాధారణంగా బాలిస్టిక్ క్షిపణులు అంతరిక్షంలోకి వెళ్లి అక్కడి నుంచి కింద ఉన్న శత్రువులపైకి దూసుకొస్తాయి. ఆలోపు వాటిని అడ్డుకునేందుకు అవకాశం ఉంటుంది. కానీ ఎల్ఆర్ఎల్ఏసీఎం వంటి క్రూజ్ క్షిపణుల సాంకేతికత భిన్నంగా ఉంటుంది. నేల లేదా సముద్ర మట్టానికి అత్యంత చేరువలో ప్రయాణించడం వల్ల శత్రుదేశాల రాడార్లు, వైమానిక రక్షణ వ్యవస్థలు దీనిని గుర్తించడం దాదాపుగా అసాధ్యం. తోమహాక్ తరహాలోనే భారత్‌కు చెందిన ఎల్ఆర్ఎల్ఏసీఎం కూడా మార్గమధ్యంలో అడ్డంకుల్ని తప్పించుకుంటూ, శత్రు స్థావరాన్ని అత్యంత కచ్చితత్వంతో చేరుకునే సామర్థ్యాల్ని కలిగి ఉందని చెబుతున్నారు. 1983లో అమెరికా నౌకాదళంలో చేరిన తోమహాక్.. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన క్రూజ్ క్షిపణుల్లో ఒకటిగా చెబుతుంటారు. 1991 నాటి గల్ఫ్ యుద్ధం నుంచి ఇటీవల ఇరాన్ దాడుల వరకు దాదాపుగా ప్రతి యుద్ధంలోనూ దీనిని అగ్రరాజ్యం వినియోగిస్తూ వస్తోంది.

పాకిస్థాన్ సరిహద్దుకు చేరువలో ఎల్ఆర్ఎల్ఏసీఎంను మోహరిస్తే ఆ అస్త్రం పరిధిలోకి ఇస్లామాబాద్, రావల్పిండి (పాక్ సైనిక ప్రధాన కేంద్రం), లాహోర్, ఫైసలాబాద్, కరాచీ వంటి నగరాలు వస్తాయి. ఈ క్షిపణి చైనాకూ హెచ్చరికలు పంపిస్తోంది. ఆ దేశ సరిహద్దు ప్రాంతాల్లో దీనిని మోహరిస్తే అక్కడి సైనిక, పాలనాపరంగా కీలకమైన లాసా, చెంగ్డు, కున్మింగ్, ఉరుమ్‌కీ వంటి ప్రాంతాలు ఈ క్షిపణి పరిధిలోకి వచ్చే అవకాశం ఉంది. అత్యంత వేగవంతమైన క్రూజ్ క్షిపణి బ్రహ్మోస్.. భారత్ అమ్ములపొదిలో ఉంది. సుదీర్ఘ కాలం యుద్ధం చేయాల్సి వస్తే ఇదొక్కటే చాలదు. ఎల్ఆర్ఎల్ఏసీఎం.. బ్రహ్మోస్కు సరైన జోడీగా కనిపిస్తోంది. బ్రహ్మోస్‌తో పోలిస్తే ఎల్ఆర్ఎల్ఏసీఎం ధర చాలా తక్కువ. అందువల్ల దీర్ఘకాలం పోరాడటానికి ఇది ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ అస్త్రం.. భారత సైన్యంలో చేరడానికి మరో రెండేళ్లు పట్టే అవకాశం ఉంది.



## పాఠశాల కరిక్యులంలో కేంద్రం జోక్యం వద్దు

- కేరళ సీఎం వీడీ సతీశన్



**తిరువనంతపురం, జూన్ 17:** పాఠశాలల్లో అమలుచేసే కరిక్యులం ఎంపిక చేసే విషయంలో రాష్ట్రాలకు స్వేచ్ఛ ఉండాలని కేరళ సీఎం వీడీ. సతీశన్ పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్రం జోక్యం చేసుకోకూడదన్నారు. కేంద్రం రూపొందించిన పీఎం శ్రీ (ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని పరిశీలించేందుకు నలుగురు మంత్రులతో కూడిన ఉపకమిటీని ఏర్పాటుచేసినట్లు తెలిపారు.ఆయన అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బుధవారం విలేకరులతో చెప్పారు. ఈ పథకాన్ని అమలుచేసేందుకు పాఠశాలలను ఎంపిక చేసే విషయంలో కూడా రాష్ట్రానికే స్వేచ్ఛ ఉండాలని వ్యాఖ్యానించారు. ఈ పథకం కింద రాష్ట్రానికి రూ.99 కోట్లు అందాయని తెలిపారు. దీని అమలుకు గత ప్రభుత్వ హయాంలోనే ఒప్పందం జరిగిందని.. దీనికి సంబంధించిన నిధులను కూడా ఆ ప్రభుత్వమే తీసుకుందన్నారు. కాబట్టి అనివార్య పరిస్థితుల్లో దీన్ని ముందుకు తీసుకెళ్తున్నామన్నారు.

## ఇరాన్ వద్ద అణ్వాయుధం కంటే శక్తిమంతమైంది ఉంది: అమెరికా ఇంటెలిజెన్స్



**వాషింగ్టన్, జూన్ 17:** పశ్చిమాసియా సంక్షోభం, అమెరికాతో కాల్పుల విరమణ నేపథ్యంలో.. ఇరాన్ అణ్వాయుధం కంటే శక్తిమంతమైన ఆయుధాన్ని సంపాదించింది. అదే చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి. యుద్ధం తర్వాత ఈ జలసంధిపై ఇరాన్ తన పట్టును బిగించిందని.. తన ఇష్టానుసారం దాన్ని మూసివేసే సామర్థ్యాన్ని సంపాదించుకుందని అమెరికా ఇంటెలిజెన్స్ స్వయంగా తన నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇంటెలిజెన్స్ వర్గాలను ఉటంకిస్తూ అమెరికా మీడియాలో కథనాలు వస్తున్నాయి. వాటి ప్రకారం.. ఒప్పందంతో సంబంధం లేకుండా హర్మూజ్‌తో ప్రపంచ ఆర్థికవ్యవస్థను కుదేలు చేసే సామర్థ్యం ఇరాన్‌కు ఉందని ఇంటెలిజెన్స్ పేర్కొంది. గల్ఫ్ దేశాల ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులను తనకు అనుకూలంగా ఎలా మలుచుకోవాలో నేర్చుకోవడంతో పాటు.. వాటి విషయంలో అమెరికా బలహీనత కూడా దానికి ఓ ఆయుధంగా మారిందని తెలిపింది. జలసంధిపై దాని నియంత్రణ అణ్వా యుధం కంటే శక్తిమంతమైనదని హెచ్చరించింది. అమెరికా- ఇరాన్ ఒప్పందంలో హర్మూజ్ కీలకం. దాన్ని పూర్తిగా తెరిపించేందుకు ఇరాన్‌తో అమెరికా తీవ్ర చర్చలు జరపాల్సి వచ్చింది. దీన్నిబట్టి హర్మూజ్‌పై టెహ్రాన్ ఎంత పట్టు సాధించిందో స్పష్టమవుతోంది. రెండు రోజుల్లో ఇరుదేశాల మధ్య ఒప్పందాలపై సంతకాలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఇంటెలిజెన్స్ రిపోర్ట్ బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది.

### జేడీ వాన్స్ కీలక వ్యాఖ్యలు..

ఇరాన్తో ఒప్పందం గురించి అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడదనేది తమ ప్రథమ లక్ష్యమన్నారు. హర్మూజ్‌ను పూర్తిగా తెరిచి ఉంచాలన్నారు. దీంతోపాటు ఇరాన్ సముచితంగా వ్యవహరిస్తే.. దానికి లభించే ఎన్నో ప్రయోజనాలు ఈ ఒప్పందంలో ఉన్నాయన్నారు. అలా కాకపోతే.. వారికి ఏమీ దక్కదని వ్యాఖ్యానించారు. అయితే, ఆ ప్రయోజనాలు ఏంటనే వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు.

## ప్రపంచ దేశాల్లోని గ్యాస్ ట్యాంకర్లను వెనక్కి రప్పిస్తున్న ఖతార్



**ఖతార్, జూన్ 17:** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో కొంతకాలం చమురు ఎగుమతులను తగ్గించిన ఖతార్ మళ్లీ జోరు పెంచనుంది. అమెరికా-ఇరాన్ ఒప్పందం కుదరడంతో హర్మూజ్ తిరిగి తెరుచుకోగానే ప్రపంచదేశాలకు చమురు ఎగుమతులను పెంచేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందులోభాగంగా నాలుగు ఖాళీ ఎల్ఎన్జీ ట్యాంకర్లు, మరో అద్దె ట్యాంకర్‌ను ప్రసిద్ధ రస్ లఫాన్ చమురు క్షేత్రానికి తరలిస్తోంది. షిప్-ట్రాకింగ్ డేటా ప్రకారం.. ఖతార్‌కు చెందిన మరో నాలుగు ట్యాంకర్లు ఇప్పటికే ఒమన్ వద్ద నిలిచిఉన్నాయి. హర్మూజ్ ద్వారా పర్షియన్ గల్ఫ్‌లోకి ప్రవేశించడానికి అవి ఎదురు చూస్తున్నట్లు తెలుస్తోంది.

ఫిబ్రవరిలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఖతార్ ఒక్క ఖాళీ నౌకను కూడా గల్ఫ్‌లోకి తిరిగి తీసుకురాలేదు. దీంతో రెండు నెలల్లోగా తన ఎగుమతి సామర్థ్యాన్ని వీలైనంత వేగంగా పునరుద్ధరించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటోంది. ఖతార్లోని లఫాన్ చమురు క్షేత్రం ప్రపంచంలోనే గ్యాస్ వాణిజ్యానికి ఆయువుపట్టుగా ఉంది. దాదాపు 20ఏళ్లలో ఈ ప్రదేశం లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ పరిశ్రమకు హబ్‌గా ఎదిగింది. భౌగోళికంగా వ్యూహాత్మక ప్రదేశంలో విశాలమైన తీర ప్రాంతం ఉండటంతో ఇది ఆసియా, ఐరోపా ఎగుమతులకు అత్యంత అనుకూలమైన ప్రదేశంగా పేరొందింది. ఇక్కడి నుంచి భారత్ జపాన్, దక్షిణ కొరియా, ఐరోపా సమాఖ్య, చైనా వంటి 30కి పైగా దేశాలకు గ్యాస్ ఎగుమతి అవుతోంది. యుద్ధం సమయంలో ఈ చమురు క్షేత్రం పైనా ఇరాన్ దాడులు చేయడంతో ఖతార్ కొంతకాలం చమురు ఎగుమతులను నిలిపివేసింది.

### హర్మూజ్‌లో నౌకలపై ఇరాన్ డ్రోన్ దాడులు..!

హర్మూజ్‌లోని పలు వాణిజ్యనౌకలపై ఇరాన్ డ్రోన్ దాడులకు పాల్పడినట్లు ఇజ్రాయెల్ మీడియా ఆరోపించింది. వాటివల్ల నౌకలకు, సైనిక సిబ్బందికి ముప్పు వాటిల్లకముందే ఆ డ్రోన్లను అమెరికా సైన్యం కూల్చివేసినట్లు తెలిపింది. అయితే ఈ ఘటనను ఇరాన్ కానీ, అమెరికా కానీ అధికారికంగా ధ్రువీకరించలేదు.



### ఇరాన్‌కు 300 బిలియన్ డాలర్లు..

## తోసిపుచ్చిన ట్రంప్

### ఒప్పందం ప్రకారమే ప్రైవేట్ ఫండ్

**వాషింగ్టన్, జూన్ 17:** అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందం రెండు రోజుల్లో అధికారికంగా ఖరారు కానుంది. ఈ నేపథ్యంలో ఇరాన్ పునర్నిర్మాణానికి అమెరికా డబ్బులు చెల్లిస్తుందని వార్తలు రాగా.. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాటిని తోసిపుచ్చారు. అయితే ఇరాన్‌లో పెట్టుబడులను ప్రోత్సహించేలా 300 బిలియన్ డాలర్లతో ప్రైవేట్ ఫండ్ ఏర్పాటు ప్రస్తావన ఈ రెండు దేశాల అవగాహన ఒప్పందంలో ఉందని తెలుస్తోంది. శుక్రవారం సంతకాలు జరగడానికి ముందే సగం ఫంన్డ స్పష్టత వచ్చినట్లు సమాచారం.

''ఇరాన్‌కు అమెరికా 300 బిలియన్ డాలర్లు చెల్లించడం లేదు. అలాగే ఎప్పటికీ అణ్వాయుధాలను అభివృద్ధి చేయనని ఇరాన్ మాట ఇచ్చింది'' అని అవగాహన ఒప్పందంపై సంతకం తర్వాత ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. అమెరికా సమకూర్చే నిధులు ప్రైవేటు పెట్టుబడుల రూపంలో ఇరాన్‌కు వెళ్లనున్నాయని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఇదేమీ నష్టపరిహారం కాదు. అలాగే ఆ నిధుల్లో ప్రభుత్వ నిధులు, గ్రాంట్స్ ఉండవు. అమెరికా, గల్ఫ్ దేశాలు, ఆసియా, దక్షిణ అమెరికా, ఆఫ్రికాకు చెందిన కంపెనీలు ఈ పెట్టుబడులు పెట్టనున్నాయి.

యుద్ధం కారణంగా కలిగిన నష్టాన్ని పూడ్చుకునేందుకు 400 బిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాలని ఇరాన్ డిమాండ్ చేసింది. అయితే దానిని అమెరికా (ఖిఱ) తిరస్కరించిందని ఇరాన్ వర్గాలు వెల్లడించాయి. ఆ తర్వాతే పునర్నిర్మాణ, అభివృద్ధి ఫండ్ కాన్సెప్ట్ ఆలోచన ముందుకువచ్చింది. స్టీల్ కాంప్లెక్స్, రిఫైనరీలు, ఎయిర్పోర్ట్ వంటి వాటి పునర్నిర్మాణానికి రుణాలు, క్రెడిట్ లైన్స్, డైరెక్ట్ ఫైనాన్సింగ్‌తో ఈ దేశాలు సహకరిస్తాయని భావిస్తున్నారు.

కాగా.. అమెరికా, అంతర్జాతీయ ఆంక్షల కారణంగా 40 ఏళ్లుగా ఇరాన్‌లోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం పరిమితంగానే ఉంది. గ్యాస్, చమురు నిల్వలు సమృద్ధిగా ఉన్న ఆ దేశంలో విద్యావంతులైన యువ జనాభా అధికమే. ఆ మానవ వనరులతో పాటు పెట్రోకెమికల్స్, మైనింగ్, టూరిజం, వ్యవసాయ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెప్తున్నారు. ఇదిలాఉంటే.. ఆంక్షల కారణంగా విదేశాల్లో ఇరాన్ ఆస్తులు ఫ్రీజ్ అయిన సంగతి తెలిసిందే. దానికి ఈ ప్రైవేట్ ఫండ్‌కు సంబంధం లేదు.

## తర్వాత వాట్సప్‌ను బ్యాన్ చేస్తారా?

### కేంద్రం తీరుపై రాహుల్ ఫైర్

**ఢిల్లీ, జూన్ 17:** నీట్ పునఃపరీక్ష నేపథ్యంలో ప్రముఖ మెసేజింగ్ యాప్ 'టెలిగ్రామ్'పై కేంద్రం నిషేధం విధించడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. కేంద్రం చర్య దొంగను పట్టుకోవడానికి బదులుగా.. బాధితుడి ఇంటి తలుపునకు తాళం వేయడంలా ఉందంటూ ఎద్దేవా



చేశారు. నోట్స్, టెస్ట్ సిరీస్లు, చర్చలు, ప్రిపరేషన్ కోసం లక్షలాది మంది విద్యార్థులు ఎప్పటినుంచో టెలిగ్రామ్ ను ఉపయోగిస్తున్నారని.. దీనిపై నిషేధం విధించడం వల్ల వారు నష్టపోయే ప్రమాదముందని పేర్కొన్నారు. అసలు ఈ ఆలోచన పేపర్ లీక్లు అరికట్టడానికి ఎలా ఉపయోగపడుతుందని ప్రశ్నించారు. నిందితులు టెలిగ్రామ్ కాకుంటే వాట్సప్లోనూ పేపర్లు లీక్ చేస్తారని అన్నారు. అలా అని వాట్సప్ను కూడా బ్యాన్ చేస్తారా? అంటూ ప్రశ్నించారు.

ఈ నిషేధం తీరు పరీక్షల్లో మోసాలకు పాల్పడే పేపర్ లీక్ నెట్వర్క్ను కాకుండా, విద్యార్థులనే లక్ష్యంగా చేసుకున్నట్లుగా ఉందని రాహుల్ ఆక్షేపించారు. నీట్ అభ్యర్థులకు జరిగిన అన్యాయం నుంచి దృష్టి మరల్చడానికే కేంద్రం ఈ ఎత్తుగడ వేసిందని విమర్శించారు. దేశంలో పదేపదే పేపర్ లీక్లకు పాల్పడుతున్న నిందితులపై చర్యలు తీసుకోవడంలో మోదీ యంత్రాంగం విఫలమైందన్నారు. ప్రభుత్వ కనుసన్నల్లోనే పేపర్ లీక్ మాఫియా నడుస్తోందని.. దానిని కప్పిపుచ్చుకొనేందుకే పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా బలగాలను మోహరించడం, ప్రశ్నపత్రాలను వైమానిక దళం ద్వారా పంపించడం వంటి నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం మాట వినకపోతే తమ హక్కులను ఎలా సాధించుకోవాలో యువతకు తెలుసని అన్నారు.

## పీఎం కిసాన్ నిధులు విడుదల తేదీ ఖరారు




**ఢిల్లీ, జూన్ 17:** రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం- కిసాన్ నిధులు జూన్ 20న విడుదల కానున్నాయి. పశ్చిమ బెంగాల్లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్లో నిర్వహించనున్న కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ చేయనున్నారు. పీఎం-కిసాన్ పథకాన్ని 2019లో మోదీ సర్కారు ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తంగా రూ.6వేలను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు.

**మీ పేరుందా?**

పీఎం కిసాన్ నిధులు పొందే వారి జాబితాలో మీ పేరుందో లేదో తెలుసుకోవచ్చు. ఇందుకోసం పీఎం కిసాన్ వెబ్సైట్లోకి వెళ్లిఅందులో 'ఫార్మర్ కార్నర్' సెక్షన్లోకి వెళ్లాలి. అందులో లబ్ధిదారుల లిస్ట్‌పై క్లిక్ రాష్ట్రం, జిల్లా, బ్లాక్, గ్రామం ఎంచుకుంటే లబ్ధిదారుల జాబితా కనిపిస్తుంది. అందులో మీ పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు. ఇ-కేవైసీ చేయని వారికి నిధులు జమ కావు. కాబట్టి అదే పోర్టల్లో ఇ-కేవైసీ ఆప్షన్ ఎంచకుని ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చు.

## టెక్సాస్‌లో కూలిన విమానం




**టెక్సాస్, జూన్ 17:** దక్షిణ టెక్సాస్‌లోని హైవేపై ఓ విమానం కుప్పకూలింది.ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా మిగిలినవారు సురక్షితంగా బయటపడ్డారు. నెట్‌జెట్‌కు చెందిన సెస్నాసిటేషన్ లాటిట్యూడ్ విమానం శాన్ జోస్ డెల్ కాబో నుంచి లారెడో విమానాశ్రయానికి వస్తుండగా మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు లారెడో పోలీసులు వెల్లడించారు. విమానం రోడ్డుపై కూలడంతో పలు వాహనాలు ధ్వంసమయ్యాయన్నారు. విమానం నుంచి భారీగా మంటలు చెలరేగడంతో అగ్నిమాపక బృందాలు మంటలను ఆర్పేశాయి.ప్రమాదం జరిగిన వెంటనే విమానం కాక్‌పిట్ అద్దాలను పగలగొట్టి ప్రయాణికులను బయటకు తీసుకువచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. చిన్న విమానం కావడంతో పదుల సంఖ్యలోనే ప్రయాణికులు ఉన్నారన్నారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటన నేపథ్యంలో కొన్ని గంటల పాటు హైవేను మూసేసినట్లు తెలిపారు. అయితే ఈ ప్రమాదానికి గల కారణం ఇంకా తెలియరాలేదు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## బ్యాన్‌ను ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసిన టెలిగ్రామ్




ఢిల్లీ, జూన్ 17: నీట్ పునఃపరీక్ష నేపథ్యంలో తప్పుడు ప్రచారాలకు కొన్ని ముఠాలు వినియోగిస్తున్న ప్రముఖ మెసేజింగ్ యాప్ 'టెలిగ్రామ్'పై కేంద్ర ప్రభుత్వం తాత్కాలికంగా నిషేధం విధించింది. ఈ చర్యలను టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు పావెల్ దురోవ్ వ్యతిరేకించారు. పేపర్ లీక్ సమస్యను పరిష్కరించకుండా.. నిందితులపై చర్యలు తీసుకోకుండా యాప్ను నిషేధించడం ఏంటని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనివల్ల కోట్లాది మంది వినియోగదారులు ప్రభావితమవుతారన్నారు. టెలిగ్రామ్ను నిషేధించినంత మాత్రాన లీకులు ఆగవని.. నిందితులు ఇతర యాప్ల నుంచి కూడా అక్రమాలకు పాల్పడతారని అన్నారు. మరో వైపు ఈ నిషేధాన్ని టెలిగ్రామ్ సంస్థ దిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. దీంతో ఈ విషయంపై హైకోర్టు అత్యవసర విచారణ చేపట్టింది. నీట్ యూజీ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం లేపిన నేపథ్యంలో.. ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌ను బ్లాక్ చేస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. నీట్ రీటెస్ట్ జూన్ 21న నిర్వహిస్తుండగా.. జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించింది. ప్రశ్నపత్రాల లీకేజీ, తప్పుడు వార్తల వ్యాప్తిని నివారించేందుకు, మోసపూరిత నెట్‌వర్క్‌ను అరికట్టడానికి ఈ తాత్కాలిక నిషేధం విధించినట్లు తెలిపింది. టెలిగ్రామ్‌లోని మెసేజ్-ఎడిటింగ్ ఫీచర్‌ను కూడా నిలిపివేయాలని ఆదేశించింది. పరీక్షలు జరిగిన తర్వాత, టైమ్‌స్టాంప్‌ను అలాగే ఉంచుతూ, మెసేజ్లను ఎడిట్ చేయడం, ప్రశ్నలను చొప్పించడం ద్వారా 'పేపర్ లీక్' సాక్ష్యాలను సృష్టించడానికి ఈ ఫీచర్‌ను దుర్వినియోగం చేశారని ఎన్టీఏ ఆరోపించింది.

# ప్రజాసేవలో ఎమ్మెల్యేకు సాటి ఎవరూ లేరు



**కోదాడ, జూన్ 17(మనం న్యూస్) :** కాంగ్రెస్ నాయకులు బాషబోయిన భాస్కర్ రావు ఆధ్వర్యంలో స్థానిక శాసన సభ్యురాలు ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి జన్మదిన వేడుకలను స్థానిక బస్టాండ్ సెంటర్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాసేవను పరమావధిగా భావిస్తూ ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆమె చూపుతున్న చొరవ, అభివృద్ధి పట్ల ఉన్న నిబద్ధత, ప్రజల పట్ల ఉన్న అంకితభావం ఆమెను ప్రత్యేక నాయకురాలిగా నిలబెట్టాయని పేర్కొన్నారు. కోదాడ నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సుమారు రూ.1938 కోట్ల నిధులను తీసుకువచ్చి రహదారులు, తాగునీటి సదుపాయాలు, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, పట్టణ మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాల అమలులో వేగం పెంచి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ప్రగతి ప్రదాతగా పద్మావతి, ఉత్తమ్ కుమార్ రెడ్డి నిలిచారని తెలిపారు. ప్రజల అవసరాలను నేరుగా తెలుసుకునేందుకు నిరంతరం ప్రజల్లో ఉంటూ, ప్రతి వర్గానికి అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఆమె ప్రజా ప్రతినిధిగా విశేష గుర్తింపు పొందారని అన్నారు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత, పారదర్శకతకు ప్రతీకగా నిలుస్తూ ప్రజా విశ్వాసాన్ని చూరగొన్న నాయకురాలిగా పద్మావతి ఉత్తమ్ రెడ్డి ఎదిగారని కొనియాడారు. నియోజకవర్గంలోని గ్రామాలు, తండాలు, పట్టణ ప్రాంతాల్లో సమాన అభివృద్ధి లక్ష్యంతో ముందుకు సాగుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి అర్హుల కుటుంబానికి చేరేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ, సామాన్య ప్రజలకు అండగా నిలుస్తూ, నిస్వార్థ సేవతో రాజకీయాలకు ఆదర్శంగా నిలిచిన ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కోదాడ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఆమె చేపడుతున్న కృషి మరింత విజయవంతం కావాలని, భగవంతుడు ఆమెకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని కోరుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సుమారు 500 మందికి కేకు పులిహోరలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పంది తిరుపతయ్య, రాయపూడి వెంకటనారాయణ, హనుమంతరావు, కాంపాటి శ్రీనివాసరావు, తాటికొండ నాగిరెడ్డి, లక్ష్మీనారాయణ, మహమ్మద్ రఫీ, మైకు నాగులు, కొరివి రామారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఫాతిమా స్కూల్‌లో పుస్తకాల విక్రయం

## తెలంగాణ విద్యాపరిషత్ రాష్ట్ర కో ఆర్డినేటర్ హరీష్

## డిఈఓతో ఫోన్‌లో మాట్లాడిన విద్యార్థి సంఘ నాయకులు

## వెంటనే స్పందించిన డిఈఓ..చర్యలు తీసుకుంటామని హామీ



**తిరుమలగిరి,జూన్17 (మనం న్యూస్):** తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలోని ఫాతిమా పాఠశాలలో పెద్ద ఎత్తున పుస్తకాలు అమ్ముతున్నారని సమాచారంతో తెలంగాణ విద్యా పరిషత్ రాష్ట్ర కో అర్డేనేటర్ హరీష్ ఆధ్వర్యంలో పాఠశాల ను బుధవారం తనిఖీ చేశారు.పుస్తకాలు అమ్ముతున్న విషయాన్ని గమనించి విద్యాశాఖ అధికారులకు ఫోన్ చేయగా ఏలాంటి స్పందన లేకపోవడంతో డిఈఓ దృష్టికి తీసుకు వెళ్లగా వెంటనే స్పందించి ఫాతిమా స్కూల్ లో బుక్స్ సీజ్ చేయమని మండల అధికారులు మౌలిక ఆదేశాలు ఇచ్చి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని హరీష్ తెలిపారు. పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు రాకేష్, మదన్, లింగస్వామి పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పోశారు క్యూరింగ్ మరిచారు



- సీసీ రోడ్డు ఎక్కువ కాలం ఉండేనా?

**కోదాడ, జూన్ 17(మనం న్యూస్):** మండల పరిధిలోని గణపవరం గ్రామంలో ఆంజనేయస్వామి గుడి వద్ద సిసి రోడ్డు గత ఐదు రోజుల క్రితం పోశారు. పోసిన నాటి నుండి నేటి వరకు క్యూరింగ్ చేయలేదని ప్రజలు వాపోతున్నారు. కాంట్రాక్టర్ రోడ్డు పోశాడు వెళ్లిపోయాడు దానిని క్యూరింగ్ ఎవరు చేయాలని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు మన్నిక ఎక్కువకాలం ఉండదని ప్రజలు వాపోతున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లకు పనులు కట్ట పెట్టొద్దని ప్రజలు వాపోతున్నారు. రోడ్డు పోసేనాటి నుండి ఈరోజు వరకు కాంట్రాక్టర్ ఇటు పక్క వచ్చి వర్క్ చూసిన దాఖలాలు ఇంతవరకు లేవు అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని కాంట్రాక్టర్ తో వాటర్ కొట్టించాలని వాపోతున్నారు.

# హద్దు దాటితే దండనే

## నాన్ బెయిలబుల్ వారెంట్‌తో జైలుకు పంపుతాం

## రౌడీ షీట్స్ నమోదు చేసి వ్యక్తిగత వివరాలు జియో టాగింగ్

## చట్టాన్ని ఉల్లంఘిస్తే కోర్టు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సినదే

## జిల్లా ఎస్పీ నరసింహ

**సూర్యాపేట, జూన్ 17 (మనం ప్రతినిధి):** జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ నరసింహ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ సందర్భంగా సమాజంలో అభద్రతా భావాన్ని సృష్టించే వారిపై, ఇరు వర్గాల దాడులు, మద్యం మత్తులో దాడులకు పాల్పడే యువతపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాం, కఠిన చర్యలు తీసుకుంటాం అని స్పష్టం చేశారు, నాన్ బెయిలబుల్ వారెంట్స్ తో జైలుకు పంపడం, రౌడీ షీట్స్ నమోదు చేసి ప్రతి నెలా పోలీస్ స్టేషన్ కు పిలిచి కౌన్సిలింగ్ చేస్తాం. ప్రజలను ఇబ్బందులకు గురి చేసినా, సమాజంలో అభద్రతా వాతావరణం కల్పించిన అలాంటి వారిని ఉపేక్షించం, చట్టాన్ని ఉల్లంఘిస్తే కోర్టుల చుట్టూ, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సినదే అన్నారు. సందర్భాన్ని తీవ్రతను బట్టి ఫ్రెండ్లీ పోలీసింగ్ పక్కన బెట్టి చట్టానికి పని చెప్తాం అని హెచ్చరించారు. పాత నేరస్తులు, తీవ్రమైన కేసుల్లో ఉన్న నిందితుల పై నిఘా ఉన్నది ఎక్కడ తిరుగుతున్నారు అనేది పరిశీలించడానికి వ్యక్తిగత



వివరాలు, ఫోన్స్ జియో టాగింగ్ చేసి ప్రత్యేక బీట్ బృందాలతో పర్యవేక్షణ చేస్తున్నాం.కాలనీల్లో రోడ్ల వెంట అడ్డాల చేసుకుని ఇబ్బందులు పెడుతున్న ఆకతాయిల సమాచారాన్ని ఫోటోలు, విడియోలు తీసి 8712686026 కు పోలీసు వారికి సమాచారం ఇవ్వండి వివరాలు గోప్యంగా ఉంచుతాం. ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# ఇరాన్‌తో యుద్ధంలో 'గ్రోక్' సాయం

- 96 గంటల్లో 2,000 టార్గెట్లు బూడిద


**వాషింగ్టన్, జూన్ 17:** ఇరాన్‌తో యుద్ధంలో తాము ఏఐ టూల్ 'గ్రోక్'ను వినియోగించినట్లు అమెరికా వెల్లడించింది. ఈ సాంకేతికతను ఉపయోగించి 2వేల టార్గెట్లను ధ్వంసం చేసినట్లు పేర్కొంది. ఎలాన్ మస్క్‌కు చెందిన 'ఎక్స్ఏఐ' కంపెనీపై నమోదైన ఓ కేసు విచారణ సందర్భంగా పెంటగాన్ ఈవిషయాన్ని వెల్లడించింది. 'ఎక్స్ఏఐ' కంపెనీ తమ అతిపెద్ద డేటా సెంటర్ల కోసం గ్యాస్ ట్బర్బన్‌లను వినియోగించడంపై ఓ పౌరహక్కుల సంస్థ కోర్టులో దావా వేసింది. ఈ టర్బన్‌ల వల్ల పర్యావరణానికి హాని కలుగుతోందని ఆరోపించింది. ఈ కేసుపై తాజాగా కోర్టులో విచారణ జరగ్గా.. మస్క్ కంపెనీని అమెరికా న్యాయశాఖ సమర్థించింది. "దేశ మిలిటరీ




ఆపరేషన్‌లలో ఈ కంపెనీ కృత్రిమ మేధ ఆవిష్కరణలు కీలకంగా పనిచేస్తున్నాయి. మన దేశ జాతీయ భద్రతకు సహకరించే అతికొద్ది శక్తిమంతమైన ఏఐల్లో గ్రోక్ ఒకటి. అలాంటి కంపెనీకి వ్యతిరేకంగా దావా వేయడం అంటే.. అమెరికా జాతీయ, ఆర్థిక, ఇంధన భద్రతకు ముప్పు తీసుకురావడమే" అని న్యాయశాఖ పేర్కొంది. ఈ సందర్భంగా పెంటగాన్ ఏఐ చీఫ్ కామెరూన్ స్టాన్లీ కోర్టులో తన వాంగ్మూలం ఇచ్చారు. "ప్రాజెక్ట్ మావెన్లో భాగంగా గ్రోక్‌ను యుద్ధ ఆపరేషన్‌లలో వినియోగిస్తున్నాం. మావెన్ స్మార్ట్ వ్యవస్థ ఆధారంగా ఇటీవల ఇరాన్‌లో కేవలం 96 గంటల్లోనే 2,000 లక్ష్యాలపై 2,000 ఆయుధాలతో విరుచుకుపడి వాటిని పూర్తిగా ధ్వంసం చేయగలిగాం. గ్రోక్ సమర్థత వల్లే ఇది సాధ్యమైంది" అని స్టాన్లీ వెల్లడించారు. ప్రాజెక్ట్ మావెన్ కోసం అమెరికా రక్షణశాఖ తొలుత ఆంత్రోపిక్ క్లాడ్ ఏఐ మోడల్‌తో జట్టు కట్టింది. అయితే, నిఘా విషయంలో ఈ రెండింటి మధ్య విభేదాలు రావడంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆంత్రోపిక్‌తో కాంట్రాక్టులను ట్రంప్ సర్కారు రద్దు చేసుకుంది. అనంతరం ఏఐ సాంకేతికత కోసం ఎక్స్ఏఐ సంస్థతో కలిసి పనిచేస్తోంది.

# బాస్ పేరిట మెసేజ్.. ఐనాక్స్‌కు రూ.10.4కోట్లు ఫట్!

**ముంబయి, జూన్ 17:** ముంబయిలోని ఐనాక్స్ కంపెనీకి కొందరు కేటుగాళ్లు టోకరా వేశారు. బాస్‌లా బురిడీ కొట్టించి.. రూ.10 కోట్లకు పైగా కాజేశారు. ఈ ఘటనకు సంబంధించి నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఐనాక్స్ కంపెనీలోని అకౌంట్స్ విభాగంలో గిరీష్ అమిన్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల ఆరంభంలో అతడి ఫోన్‌కు గుర్తు తెలియని నంబర్ నుంచి వాట్సాప్ సందేశం వచ్చింది. దాన్ని పంపిన వ్యక్తి తనని తాను కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిద్ధార్థ్ జైన్‌గా పరిచయం చేసుకున్నాడు. అది తన వ్యక్తిగత నంబర్ అని.. దాన్ని ఎవరికీ ఇవ్వొద్దని తెలిపాడు. ఆ నంబర్‌కు సంబంధించి డీపీ కూడా జైన్ ఫొటో ఉండటంతో ఆ



ఉద్యోగి అది బాస్ నంబరేనని నమ్మేశారు. అత్యవసరంగా ఓ మీటింగ్‌కు వెళ్తున్నా అని చెప్పి.. ఓ బ్యాంకు ఖాతాకు నగదు బదిలీ చేయాలని ఆ నకిలీ బాస్ ఆదేశించాడు. దీంతో, నిజంగా తన బాస్ అనుకొని ఆ ఉద్యోగి రూ.46.5 లక్షలను పంపించారు. ఇలా జూన్ 3 నుంచి 15 మధ్య బాస్ అని నమ్మించిన వ్యక్తికి 63 సార్లు దాదాపు రూ. 10.4 కోట్లు మేర బదిలీ అయ్యాయి. ఇటీవల అకౌంట్స్ చెక్ చేసే సమయంలో.. ఈ నకిలీ బాస్ వ్యవహారం బయటపడింది. ఈ ఘటనపై ఉద్యోగి ఫిర్యాదు మేరకు ముంబయి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన సమాచారం ఆధారంగా నలుగురిని అరెస్టు చేశారు. ఈ నెట్‌వర్క్‌లో మరికొంత మంది ప్రమేయం ఉన్నట్లు భావిస్తున్న పోలీసులు.. తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# నా మాటలను బీప్ చేయొద్దు: సంజయ్ రౌత్



**ముంబయి, జూన్ 17:** మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే మరోసారి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది. పలువురు ఎంపీలు ఏక్నాథ్ శిందే నేతృత్వంలోని శివసేనలో చేరనున్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశానికి ముగ్గురు ఎంపీలు మాత్రమే హాజరయ్యారు. ఈ సందర్భంగా రెబల్స్‌ను ఉద్దేశించి రౌత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన మాటలను బ్రీప్ చేయొద్దని పాత్రికేయులకు సూచించడం గమనార్హం. "ద్రోహులు వెళ్లిపోవాలి. అసమ్మతివాదులు మొదట రాజీనామా చేయాలి. పార్టీ టిక్కె గెలిచినవారికి ప్రజాతీర్పును మోసగించే హక్కు లేదు. పార్టీ మారేందుకు కొందరు ఎంపీలకు రూ.50 కోట్లు ఆఫర్ చేస్తున్నారని తెలుస్తోంది. అయితే మాకు చీలిక గురించి అధికారికంగా ఎలాంటి సమాచారం లేదు. మీడియాలో చక్కర్లు కొడుతోన్న వార్తలతో ఈ విషయం మా దృష్టికి వచ్చింది" అని రౌత్ మాట్లాడారు. ఈ పరిణామాల నేపథ్యంలో శివసేన (యూబీటీ) చట్టపరమైన చర్యలు ప్రారంభించిందని చెప్పారు. ఇప్పటికే పశ్చిమబెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్లో కూడా చీలికలు వచ్చాయి. వీటిని సంజయ్ ప్రస్తావించారు. చీలికలు ఇలా ఉంటే.. ఎన్నికల్లో పోటీపడటంలో అర్థమే లేదన్నారు. 2022 తరహా తిరుగుబాటు మరోసారి జరిగితే మహారాష్ట్ర ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఆ ఏడాది శివసేన రెండుగా చీలిపోయింది. అప్పటివరకు ఉన్న పార్టీ పేరు, గుర్తు ఏక్నాథ్ శిందే నేతృత్వంలోని చీలిక వర్గానికి దక్కాయి. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని పార్టీ పేరు శివసేన (యూబీటీ)గా మారింది. లోక్సభలో శివసేన (యూబీటీ)కి తొమ్మిది ఎంపీలు ఉన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఏడు రోజులు జైలు శిక్ష

**పిఠాపురం జూన్17(మనం న్యూస్):** పిఠాపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పిఠాపురం నుండి సామర్లకోట రోడ్డులో పకురుద్ధీన్ పాలెం సెంటర్ వద్ద యస్ ఐ షేక్ జాన్ భాష తన సిబ్బంది తో వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం సేవించి ఆటో నడుపుతున్న గడ్డం సుబ్రహ్మణ్యం అను వ్యక్తి పై కేసు నమోదు చేసి గౌరవ కోర్ట్ లో పెట్టగా ఏడు రోజులు జైలు శిక్ష విధిస్తూ పిఠాపురం సెకండ్ క్లాస్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ బొమ్మిడి భారతి తీర్పు చెప్పారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని పిఠాపురం రూరల్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత -2023లోని సెక్షన్ 105 కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్ కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంటుందని తెలిపారు.

# జిల్లా ప్రజా రవాణా అధికారిగా బాధ్యతల స్వీకరణ

**అమలాపురం జూన్ 17 మనం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీపీటిడి) డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజా రవాణా అధికారిగా నియమితులైన జి. సత్యనారాయణ బుధవారం తన పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఇంతకుముందు విజయనగరం జిల్లాలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (ఆపరేషన్స్ అండ్ కమర్షియల్)గా సేవలందించిన ఆయనకు రవాణా రంగంలో విశేష అనుభవం ఉంది. ప్రజలకు మరింత మెరుగైన రవాణా సేవలు అందించడంతో పాటు, సంస్థ ఆదాయ వృద్ధి, సేవల నాణ్యత పెంపు, ప్రయాణికుల సౌకర్యాల అభివృద్ధికి కృషి చేస్తారని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. కోనసీమ



జిల్లాలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించడంలో ఆయన నాయకత్వం కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు, సిబ్బంది పేర్కొన్నారు.

# ఉచిత యోగా తరగతులు

**పిఠాపురం జూన్17(మనం న్యూస్):** అంతర్జాతీయ యోగా దినోత్సవం -యోగాంధ్ర 2026 సందర్భంగా పిఠాపురం శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం, నూతన ఆశ్రమ ప్రాంగణంలో పీఠాధిపతి డా. ఉమర్ అలీషా స్వామి వారి అధ్యక్షతన, 18-6-26 గురువారం సాయంత్రం 4.30 గంటలకు, అంతర్జాతీయ యోగా కోచ్ శ్రీ కరిబండి రామకృష్ణ గారు ఉచిత యోగా శిక్షణ తరగతి నిర్వహించడం జరుగుతుంది. కావున శారీరక, మానసిక ఆరోగ్యం పొందాలనుకునే ప్రతీ ఒక్కరూ వచ్చి, యోగా శిక్షణ లో పాల్గొని, పీఠాధిపతి డా. ఉమర్ అలీషా స్వామి వారి ఆశీస్సులు పొందవలసినదిగా పీఠం కన్వీనర్ శ్రీ పేరూరి సూరిబాబు తెలియ చేసారు.



# ఉపాధి హామీ మస్టర్లను పరిశీలించిన ఎంపీడీఓ

**కాట్రేనికోన, జూన్ 17 మనం ప్రతినిధి:** కాట్రేనికోన మండలం దొంతికుర్రు, పల్లం గ్రామ పంచాయతీలో జరుగుతున్న వీబీజీ రామ్ జీ పనులను ఎంపీడీఓ బి రాజేశ్వర్ రావు బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు .కొంతమంది ఉపాధిశ్రామికులకు వేతనం జాప్యం జరుగుతుందన్న విషయంపై తక్షణ చర్యలు చూపి వేతనం సమకూరే విధంగా చర్యలు చూపాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో మస్టర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రాథమిక చికిత్సకి సంబంధించిన కిట్లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని క్షేత్ర సహాయకులను ఆదేశించారు. వడదెబ్బకు గురి కాకుండా ఉపాధి శ్రామికులు తగు జాగ్రత్తలు పాటించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం వేగవంతం చేయాలి

**అమలాపురం, జూన్ 17(మనం న్యూస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ, ఇంటింటి సర్వేను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ బూత్ స్థాయి అధికారులను ఆదేశించా రు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించి ఎన్యూమరేషన్ పత్రాలు పంపిణీ ఇంటింటి సర్వే ప్రక్రియ పురోగతిని సమీక్షించారు ఈ సందర్భం గా ఆయన ప్రసంగిస్తూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, గడువులోగా పూర్తి చేయా లని ఆదేశించారు. జిల్లా లోని అన్ని నియోజకవర్గా ల్లో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితా సవరణ పక్కాగా జరగాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరా ల సేకరణకు సంబంధించిన ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ ప్రక్రియను వంద శాతం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు ప్రతి బి ఎల్ ఓ కు అవసరమైన పత్రాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు ప్రతి బి ఎల్ ఓ తమకు కేటాయించిన భౌగోళిక పరిధి ప్రకారమే ఖచ్చితం



గా ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలన్నారు ఏ ఒక్క ఇల్లు లేదా అర్హుడైన ఓటరు వివరాలు విడి పోకుండా జాగ్రత్త వహిం చాలన్నారు సర్వే సమ యంలో మరణించిన వారి వివరాలు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లను గుర్తించి నిబంధనల ప్రకారం జాబితా నుండి తొలగించడానికి చర్యలు తీసుకోవాలన్నారు అదే విధంగా కొత్తగా పెళ్లి వచ్చిన వారి వివ రాలు, ఇళ్లు మారిన వారి ఓట్ల బదిలీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు జూలై 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటరుగా నమోదు చేసేలా బి ఎల్ ఓ లు చొరవ చూపాలన్నారు. ఓటర్ల జాబితాలో అస్ప ష్టంగా ఉన్న ఫోటో లను, తప్పుగా ముద్రితమై న వివ రాలను సరిచేసే ప్రక్రియను ఈ సర్వేలోనే పూర్తి చేయా లన్నారు.సర్వే ప్రక్రియలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని సిబ్బంది పనితీరు ను, ఎన్యూమ రేషన్ ప్రక్రియను నిరంతరం పర్యవే క్షించాలని కలెక్టర్ స్పష్టం చేశా రు. ఎలాంటి తప్పులు లేని స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొం దించేందుకు అధికా రులు సమన్వయంతో పనిచే యా లని ఆయన పిలు పుని చ్చారు.ఈ సమీక్షా సమా వేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి సుబ్బారావు సెక్షన్ సూప రింటెండెంట్ నాగలక్ష్మ మ్మ, వివిధ నియోజకవర్గాల ఈఆర్ఓ లు, ఏఈఆర్ఓలు మరియు ఎన్నికల విభా గపు సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలకు అలంకార చేపల పెంపకంపై శిక్షణ

**పిఠాపురం జూన్17(మనం న్యూస్) :** జిల్లా కలెక్టర్ శ్రీ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్, ఐఏఎస్ గారి ఆదేశాల మేరకు గ్రీన్ క్లైమేట్ ఫండ్ - భారతదేశ తీర ప్రాంత వాసులలో ప్రతికూల వాతావరణ పరిస్థితులను అధిగమించే సామర్థ్యాన్ని పెంపొందించడం జీసీఎఫ్-ఈసీఆర్ఐసీసీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో, మత్స్యశాఖ, జిల్లా



గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) మరియు పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (పాడా) సంయుక్తంగా అలంకార చేపల పెంపకంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా జీవనోపాధి అవకాశాలను పెంపొందించడం మరియు మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్హెచ్జీ) సభ్యుల సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమంలో 80 మందికి పైగా ఎస్హెచ్జీ మహిళలు పాల్గొని అలంకార చేపల పెంపకానికి సంబంధించిన జాతుల ఎంపిక, సంతానోత్పత్తి పద్ధతులు, ఆహార నిర్వహణ, నీటి నాణ్యత పరిరక్షణ, వ్యాధి నియంత్రణ మరియు మార్కెటింగ్ అవకాశాలపై ప్రాయోగిక శిక్షణ పొందారు.ఈ కార్యక్రమంలో డా. ఎన్. శివరామ్, ప్రాజెక్ట్ డైరెక్టర్, పాడా, వి. కృష్ణారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి, వి. కొండబాబు, డైరెక్టర్, అప్సడా; డా. జి. గోపి, సహాయ మత్స్యశాఖ సంచాలకులు, పి. వసంత మాధవి, అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్, పాడా; ఎల్. శ్రీహర్ష, జిల్లా సమన్వయకర్త, జీసీఎఫ్-ఈసీఆర్ఐసీసీ; మత్స్య అభివృద్ధి అధికారులు కె. రామకృష్ణ మరియు పి. శ్రీ దత్తాత్రేయ; రాష్ట్ర మత్స్య సాంకేతిక సంస్థకు చెందిన వి. నాగబాబు; అలాగే బి. మల్లేశ్వరరావు, ఏపీఎం పాల్గొన్నారు. తీర ప్రాంత సమాజాల్లో మహిళలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలను కల్పించడం, వాతావరణ అనుకూల జీవనోపాధులను ప్రోత్సహించడం మరియు సుస్థిర మత్స్య ఆధారిత ఉపాధి అవకాశాలను విస్తరించడం లక్ష్యంగా జీసీఎఫ్-ఈసీఆర్ఐసీసీ ప్రాజెక్టు చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

# పారిశుద్ధ్యమా.. నీ జాడెక్కడా?



**99 రోజుల ప్రణాళిక గాలికి**
**పెద్ద కోమటిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ముందు అపరిశుభ్రత**
**ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడుస్తున్న పంచాయతీ పాలకవర్గం**
**సీజనల్ వ్యాధుల భయంతో ఆందోళన చెందుతున్న ప్రజలు**

మొగులపల్లి జూన్ (మనం న్యూస్ ): రాష్ట్ర ప్రభుత్వం అతి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రణాళికకు పెద్ద కోమటిపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గం తూట్లు పొడుస్తుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని పెద్ద కోమటిపల్లి గ్రామంలో పంచాయతీ పాలకవర్గం పట్టింపులేని ధోరణితో వ్యవహరిస్తుంది. ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించాల్సిన పంచాయతీ పాలకవర్గ కార్యాలయ ఆవరణమే స్వయంగా అపరిశుభ్రతకు నిలయంగా మారడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినూత్న రీతిలో ప్రజాదర్బార్, 99 రోజుల ప్రణాళికను అమలు చేస్తూ..విద్యా, వైద్యం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పదే పదే అధికారులను ఆదేశించినప్పటికీ పెద్ద కోమటిపల్లి పంచాయతీ పాలకవర్గం పెడచెవిన పెట్టడం తీవ్ర విమర్శలకు గురిచేస్తుంది.

**పంచాయతీ కార్యాలయం చెత్తకుప్పలకు నిలయం**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని పెద్ద కోమటిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణం చెత్తకుప్పలకు నిలయంగా మారింది. పంచాయతీ పాలకవర్గం పట్టించుకోకపోవడంతో అక్కడ ప్రజలకు చెత్తా, చెదారం దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం సంభవిస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాల్సిన పంచాయతీ పాలకవర్గ కార్యాలయం సాక్షాత్తు చెత్త కుప్పలకు దర్శనమివ్వడంతో పెద్ద కోమటీ పల్లి గ్రామంలో అసలు పంచాయతీ పాలకవర్గం ఉన్నట్లా..? లేనట్లా..? అని ప్రజలు అధికారులను నిలదీస్తున్నారు. ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీలను పర్యవేక్షించాల్సిన అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంతో పంచాయతీ పాలకవర్గాల ఇష్టారాజ్యం కొనసాగుతోందని పలు విమర్శలు లేవనెత్తుతున్నాయి. గ్రామపంచాయతీలలో చెత్త నిలువ ఉండకుండా ట్రాక్టర్ ను కొనుగోలు చేసి, పారిశుధ్య కార్మికులను నియమించి, కార్మికులకు వేతనాలను మంజూరు చేస్తున్నప్పటికీ, ఈ తంతు కొనసాగడం వెనుక మండల అధికారుల వైఫల్యం ఉందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పెద్ద కోమటీ పల్లి గ్రామాన్ని అధికా రులంతా సందర్శించి..గ్రామంలో చెత్తాచెదారం నిల్వలు లేకుండా చూడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# విధుల్లో రాణిస్తూనే పిల్లల అభ్యున్నతికై కృషి చేయాలి

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్




హనుమకొండ జూన్ 17(మనం ప్రతినిధి): నిరంతరం విధినిర్వహణలో భాగంగా తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తునే తమ పిల్లల అభ్యున్నతి కృషి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ప్రతిష్టాత్మకమై ముంబాయి ఐఐటీ కళాశాలలో అడ్మిషన్ సాధించిన ఇన్‌స్పెక్టర్ కుమార్తెను వరంగల్ పోలీస్ కమిషనర్ ఘనంగా సత్కరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సతీష్ తనయురాలు యడ్లపల్లి సాత్విక జెఈఈ మెయిన్స్ పరీక్షలో 99.65 పర్సంటైల్ సాధించ గా, ఇటీవల నిర్వహించిన జె.ఈ.ఈ అడ్వాన్స్ పరీక్షల్లో రాణించి 8808 ర్యాంక్తో ముంబాయి ఐఐటీకళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం సీటు సాధించడం జరిగింది. దీనితో సాత్వికను వరంగల్ పోలీస్ కమిషనర్ తన చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిపి సాత్వికతో ముచ్చటిస్తూ రాబోవు రోజుల్లో మరింత కష్టపడాల్సి వుంటుందని. దేశంలోనే అత్యున్నతమైన విద్యా సంస్థలో సీటు సాధించడం గొప్ప విషయమని, ఇదే రీతిలో కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని, ముఖ్యంగా నిరంతరం విధుల్లో వుండే పోలీసుల పిల్లలు గత కొద్ది సంవత్సరాలు చదువుల్లో రాణించడం, ఉన్నత ఉద్యోగాలను సాధించడం సంతోషాన్ని కలిగిస్తోందని సిపి తెలియజేసారు.

# ముల్కనూర్ పోలీసులకు సన్మానం



భీమదేవరపల్లి, జూన్ 17 మనం న్యూస్: ముల్కనూర్ పోలీస్ స్టేషన్ లో స్థాన చలనం తో బదిలీపై వెళ్తున్న పోలీస్ అధికారులకు ఘన సన్మానం జరిగింది. బుధవారం రోజున ముల్కనూర్ పోలీస్ స్టేషన్లో గత కొన్ని సంవత్సరాలుగా హెడ్ కానిస్టేబుల్ గా పనిచేసే, ఏఎస్ఐ గా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న పాడి రాజిరెడ్డి, మరొక హెడ్ కానిస్టేబుల్ అయినా నాగేశ్వరరావు బదిలీపై దుగ్గొండి పోలీస్ స్టేషన్ కు స్థాన చలనం వెళ్తున్న పోలీసులకు స్థానిక ఎస్సై ఎం రాజు, పోలీస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శంకర్, మోహన్ బాబు, శోభన్ బాబు, శివ, రమేష్, తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ములుగు ఏజెన్సీ జిల్లాలో తొలి ప్రైవేట్ ఐటీ కంపెనీ ప్రారంభం

**గ్రామీణ యువతకు స్థానికంగానే ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించాలి**
**అభివృద్ధి, ఉపాధి అవకాశాలు వికేంద్రీకరణ ద్వారానే ప్రతి ప్రాంతానికి చేరాలి**
**ములుగులో ఐటీ రంగ అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుంది**

- **మంత్రి సీతక్క**

ములుగు, జూలై 17, మనం ప్రతినిధి: ములుగు ఏజెన్సీ జిల్లాలో తొలిసారిగా ప్రైవేట్ రంగంలో ఐటీ సంస్థ ఏర్పాటు కావడం సంతోషకరమని, గ్రామీణ ప్రాంత యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పిస్తూ సాంకేతిక రంగంలో కొత్త భవిష్యత్తుకు దారులు వేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన శ్రియా ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇప్పటివరకు ఐటీ రంగం ప్రధానంగా నగరాలకు మాత్రమే పరిమితమైందని, ఐటీ అవకాశాలు గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాలకు కూడా చేరుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, అభివృద్ధి అన్నీ ఒకే ప్రాంతంలో కేంద్రీకృతం కాకుండా వికేంద్రీకరణ జరిగితేనే మారుమూల ప్రాంతాల యువతకు సమాన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. శ్రియా ఇన్ఫోటెక్ సంస్థ గత ఒక సంవత్సరం కాలంగా ములుగు ప్రాంత యువతకు వివిధ రంగాల్లో సాంకేతిక శిక్షణ అందిస్తూ, యాప్ డెవలప్మెంట్ వంటి ఆధునిక నైపుణ్యాలను నేర్పిస్తూ ముందుకు సాగుతోందన్నారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా యాప్లను అభివృద్ధి చేసి వివిధ పాఠశాలలు, సంస్థలు, ఐటీ రంగానికి సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం సంస్థలో సుమారు 15 మంది యువత ఐటీ రంగంలో ఉద్యోగాలు పొందడం అభినందనీయమన్నారు. హైదరాబాద్ వంటి నగరాలకు మాత్రమే ఐటీ పరిశ్రమలు పరిమితం కాకూడదని, ములుగు, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం వంటి ప్రాంతాల్లో కూడా ఐటీ రంగం




విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.నేటి సాంకేతిక యుగంలో ఎక్కడి నుంచైనా పని చేసే అవకాశాలు ఉన్నాయని, అభివృద్ధి, ఉద్యోగాల వికేంద్రీకరణ ద్వారానే సమాజంలో సమాన అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ములుగు జిల్లాలో ఇతర ఐటీ సంస్థలు, కంపెనీలు స్థాపించడానికి ముందుకు రావాలని, పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అన్ని విధాల సహకారం అందిస్తుందని తెలిపారు. శ్రియా ఇన్ఫోటెక్ వ్యవస్థాపకులు రవికుమార్ రంగారి తీసుకున్న ఈ ముందడుగు అభినందనీయమని పేర్కొంటూ, భవిష్యత్తులో సంస్థ మరింత విస్తరించి మరెందరో స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ములుగు మున్సిపాలిటీ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, శ్రియా ఇన్ఫోటెక్ వ్యవస్థాపకులు రవికుమార్, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా భద్రఖాళీ అమ్మవారి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం



- **ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు, విష్ణువర్ధన్ రెడ్డి హాజరు**

హనుమకొండ, జూన్ 17( మనం ప్రతినిధి): హనుమకొండలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రఖాళీ అమ్మవారి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి దంపతులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే నాయిని దంపతులు భద్రఖాళీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ప్రత్యేకంగా అలంకరించిన ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోగా, భక్తులు భారీ సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



# అన్నప్రాసన్న కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్

మహాదేవపూర్ జూన్ 17మనం న్యూస్: మహాదేవపూర్ మండల కేంద్రంలోని బుధవారం రోజున అంగన్వాడి కేంద్రంలో చిన్నారుల కోసం ప్రత్యేకంగా అన్నప్రసన్న కార్యక్రమం మరియు యూనిఫామ్లు పంపిణీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ హసీనాబాను అక్బర్ ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు స్వయంగాఅన్నప్రసన్నచేయించారుఈసందర్భంగా సర్పంచ్హసీనాబానుమాట్లాడుతూచిన్నారులఆరోగ్యం మరియువిద్యాభివృద్ధి కోసంఅంగన్వాడికేంద్రాలు కీలకపాత్రపోషిస్తున్నాయనిపేర్కొన్నారు. గ్రామంలో పిల్లలకు పోషకాహారం, విద్య మరియు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. చిన్నారులతో సర్పంచ్ సాన్నిహితంగా మెలగడం, స్వయంగా అన్నప్రసన్న చేయించడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.చిన్నారుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేస్తున్న సర్పంచ్హసీనాబాను అక్బర్ఖాన్గ్రామ ప్రజలుఅభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు నల్లబుగ్గ సమ్మయ్య కొండపల్లి రాములు అంగన్వాడి టీచర్లు ఆయమ్మలు మరియు చిన్నారులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు



హనుమకొండ, జూన్ 17 (మనం ప్రతినిధి): 30వ డివిజన్ పరిధిలోని బాలసముద్రం కి చెందిన వివిధ రాజకీయ పార్టీలకు చెందిన సుమారు 100 మంది నాయకులు, కార్యకర్తలు మరియు యువకులు ఈ రోజు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కొత్తగా చేరిన వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంతాలు, ప్రజా ప్రభుత్వ లక్ష్యాలు, అభివృద్ధి కార్యక్రమాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం మరియు ప్రాంతీయ అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో విశ్వాసం పెరగడంతోనే పెద్ద ఎత్తున పార్టీ చేరికలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. బాలసముద్రం ప్రాంత అభివృద్ధి, కాలనీల్లో మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేయాలని కొత్తగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు సూచించారు.కాంగ్రెస్ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరేలా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తోట పవన్, స్వామి, శ్రీనివాస్ మరియు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పాల్గొన్నారు.

# పాఠశాల పారిశుధ్యంపై కలెక్టర్ ఆగ్రహం

## ఇద్దరు పాఠశాల సిబ్బందికు షోకాజ్ నోటీస్‌లు

వరంగల్, జూన్ 17(మనంన్యూస్): వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇంతేజార్ గంజ్లో విద్యా ప్రమాణాలు, పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరుపై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్లు పరిశీలించిన కలెక్టర్, తనిఖీ సమయంలో ఇద్దరు పాఠశాల సిబ్బంది ముందస్తు అనుమతి లేకుండా వెళ్లినట్లు గుర్తించారు. దీనిని తీవ్రంగా పరిగణించిన జిల్లా కలెక్టర్ వారికి షోకాజ్ నోటీస్ లు జారీ చేయవలసింది గా అదనపు కలెక్టర్ వై.వి. గణేష్‌కు సిఫారసు చేశారు.తనిఖీలో పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలని హెడ్మాస్టర్ ను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు ప్రధానోపాధ్యాయుడిని మందలించి, స్కావెంజర్ను మార్చాలని సూచించారు. పాఠశాల ముందు ప్రవహిస్తున్న మురికి కాలువ విద్యార్థులకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని హెచ్చరిస్తూ, వెంటనే కాలువకు పై కప్పు గా బండలతో కాలువను కప్పాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యార్థుల హాజరు, పాఠ్యపుస్తకాల పంపిణీ తదితర అంశాలపై పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న సౌకర్యాలు, విద్యా నాణ్యత, మధ్యాహ్న భోజనం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం, భద్రత, విద్యా ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ లేదని స్పష్టం చేశారు. పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరు, మౌలిక సదుపాయాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.



# శుభకార్యంలో పాల్గొన్న సర్పంచ్



మహాదేవపూర్ జూన్ 17మనం న్యూస్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చాకలి వెంకటి కుమార్తె నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొని కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలుతెలియజేసిన గ్రామ సర్పంచ్ హసీనాబాను అక్బర్ ఖాన్ పాలకవర్గ సభ్యులు చీర్లవంచ చంద్రశేఖర్ గడ్డం స్వామి మహమ్మద్ బిన్ అలీ నల్ల బుగ్గ సమ్మయ్య కొండపల్లి రాములు మాజీ దేవస్థానం చైర్మన్ గుడాల శ్రీనివాస్ తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొనడం జరిగింది

# నూతన వధూవరులను ఆశీర్వదించిన సర్పంచ్



మహాదేవపూర్ జూన్ 17మనం న్యూస్: మహాదేవపూర్ మండలంని వివాహానికి హాజరై నూతన వధూవరులను బుధవారం రోజున మహాదేవపూర్ గ్రామ సర్పంచ్ హసీనా అక్బర్ ఖాన్ ఆశీర్వదించారు. మండలంలోని కాపువాడ వాస్తవ్యులు పెంట కమల రాజబాబు కూతురు వివాహానికి హాజరై నూతన వధూవరులను దంపతులను ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్య క్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గంతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జన్ను విజయ్‌కుమార్‌కు డాక్టరేట్



మహాదేవపూర్ జూన్ 17మనం న్యూస్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కేంద్రంలోనిస్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.జన్ను విజయ్కుమార్కు కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానంచేయడంఅభినందనీయమనికళాశాలఅధ్యాపకులు,విద్యార్థులు పేర్కొన్నారు.కాకతీయ విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగంలో కరీంనగర్ జిల్లాలో గిరిజన అభివృద్ధి పరిపాలన ట్రైబల్ డెవలప్మెంట్అడ్మినిస్ట్రేషన్ అనే అంశంపై పరిశోధన నిర్వహించి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించినందుకు డా.జన్ను విజయ్కుమార్కు డాక్టరేట్ ప్రదానం చేయబడింది. ఈ పరిశోధనను రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ వీరన్న పర్యవేక్షణలో పూర్తి చేశారు.ఈసందర్భంగాప్రముఖసినీ గేయ రచయిత వేటూరి సుందరరామమూర్తి కృషి ఉంటే మనుషులు ఋషులౌతారు, మహాపురుషులౌతారు, తరతరాలకు తరగని వెలుగౌతారు అనే గేయం అక్షరాలా డా. జన్ను విజయ్కు మార్కి సరిపోతుందని పలువురు అభిప్రాయపడ్డారు. గత 16 సంవత్సరాలుగా డిగ్రీ కళాశాలలో విద్యాబోధన చేస్తూ అపారమైనఅనుభవాన్నిసంపాదించిన ఆయన, తన కృషి,పట్టుదల, ఆత్మవిశ్వాసంతో 57 ఏళ్లవయసలో డాక్టరేట్ సాధించడంవిశేషమని కొనియాడారు.డాక్టరేట్ సాధించిన సందర్భంగా కళాశాల అధ్యాపక, అధ్యాపకే తర సిబ్బంది, విద్యార్థులు డా. జన్ను విజయ్కుమార్ను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్న-అక్క మెంటర్షిప్ కార్యక్రమం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోమాస్టర్ట్రైనర్రవికుమార్కళాశాలనోడల్ అధికారులకు,విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించారు.డిగ్రీ తుదిసంవత్సరం విద్యార్థులుపాఠశాలవిద్యార్థులకు డిజిటల్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించే విధంగా శిక్షణ పొందాలని సూచించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు చేపట్టనున్న బోధన కార్యక్రమాలపై వివరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్నఅక్క మెంటర్షిప్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషిచేయలని ప్రిన్సిపల్ జన్నువిజయకుమార్ సూచించారు.

# ఉపాధి హామీ పనిని అడ్డుకున్న రైతులు



భీమదేవరపల్లి, జూన్ 17 మనం న్యూస్: గొల్లపల్లి గ్రామం లో ఉపాధి హామీ పనిని రైతులు అడ్డుకున్నారు. గొల్లపల్లి గ్రామానికి చెందిన ఊరి చెరువులో ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి హామీ కూలీ లు గత కొన్ని రోజులుగా నల్ల మట్టి తీసి రైతులకు తరలిస్తుండగా గ్రామానికి చెందిన రైతులు కొందరు చెరువులో పట్టా భూములు ఉన్నాయి అడ్డుకున్నారని గ్రామ సర్పంచి నేతల మోహన్ తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ కు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. సంబంధిత అధికారులు చర్య తీసుకొని ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలని సర్పంచ్ అధికారులను కోరారు



# కార్తిక్ ఆర్యన్ తో శార్వరి?

'మైవాపస్ ఆవుంగా'తో థియేటర్లలో సందడి చేస్తోంది బాలీవుడ్ కథానాయిక శార్వరీ వాఘ్. ప్రస్తుతం వరుస ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపుతున్న ఈ భామ.. ఇప్పుడు మరో అవకాశాన్ని తన ఖాతాలో వేసుకున్నట్లు తెలుస్తోంది. హిందీ హీరో కార్తిక్ ఆర్యన్ ప్రధాన పాత్రలో దర్శకుడు లవ్ రంజన్ ఓ సినిమాని తెరకెక్కిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలొస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో కార్తిక్ సరసన నటించేందుకు శార్వరీ వాఘ్ ను ఎంపిక చేసిందట చిత్రబృందం. యువతను ఆకట్టుకునే చిత్రాలను తెరకెక్కించిన లవ్ రంజన్ తో పనిచేయడానికి శార్వరి కూడా ఉత్సాహంగా ఉందని, ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఈ ఏడాది ఆఖర్లో చిత్రీకరణను ప్రారంభించాలని నిర్ణయించుకున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.

# జోడీ కట్టేదెవరు?

కథానాయకుడు రామ్ పోతినేని తన కొత్త సినిమా కోసం స్వయంగా మెగాఫోన్ చేతపట్టారు. ఈ నెలలోనే చిత్రీకరణ ప్రారంభమవుతోంది. రాపో సినిమాటిక్స్ పతాకంపై కృష్ణ పోతినేని నిర్మిస్తున్న ఈ సినిమా స్టైలిష్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్గా రూపొందనుంది. వీర అనే యువకుడి పాత్రలో సందడి చేయనున్నారు రామ్. ఆయన 23వ సినిమా ఇది. కొన్ని రోజులుగా కథానాయిక ఎంపికకు సంబంధించిన కసరత్తులు జరుగుతున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం కయాదు లోహర్ పేరు గట్టిగా వినిపిస్తోంది. ఇదివరకు శ్రీనిధిశెట్టి పేరు కూడా తెరపైకి వచ్చింది. ఈ చిత్రాన్ని డిసెంబరులో విడుదల చేయాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నారు రామ్. త్వరలోనే కథానాయిక ఎంపికపై స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి.





# రెండో వన్డేలో అఫ్గాన్ పై ఘన విజయం..

- భారత్ దే సిరీస్

అఫ్గానిస్థాన్ తో మూడు వన్డేల సిరీస్ ను భారత్ 2-0తో కైవసం చేసుకుంది. లఖ్ నవూలో బుధవారం జరిగిన రెండో వన్డేలో భారత్ 170 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా 49.5 ఓవర్లలో 402 పరుగుల భారీ స్కోరు చేసి ఆలౌటైంది. లక్ష్యఛేదనలో అఫ్గాన్ 44.3 ఓవర్లలో 232/9 స్కోరుకు పరిమితమైంది. గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్గా మైదానాన్ని వీడిన దర్విష్ రసూలీ (6) తిరిగి బ్యాటింగ్కు రాలేదు. రహ్మత్ షా (79; 89 బంతుల్లో) చివరి వరకు పోరాడాడు. రహ్మనుల్లా గుర్బాజ్ (41), సెధికుల్లా అటల్ (42), ఇబ్రహీం జద్రాన్ (21) పరుగులు చేశారు. భారత బౌలర్లలో అర్షదీప్ సింగ్, గుర్నూర్ బ్రార్ మూడేసి వికెట్లు పడగొట్టారు. అరంగేట్ర బౌలర్ ప్రిన్స్ యాదవ్ 2, వాషింగ్టన్ సుందర్ ఒక వికెట్ తీశారు. నామమాత్రపు మూడో వన్డే జూన్ 20న చెన్నైలో జరగనుంది.





MCRHRD లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రముఖ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత ఈషా సింగ్. ఇటీవల జరిగిన ISSF వరల్డ్ కప్ (రైఫిల్/పిస్టల్) 2026 పోటీల్లో స్వర్ణం సాధించి ప్రపంచ రికార్డు కైవసం చేసుకున్న నేపథ్యంలో ఈషా సింగ్ ని సత్కరించి అభినందించిన సీఎం.

# 77 పరుగులకే ఖేల్ ఖతం..

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్-2026 టోర్నీలో ఆస్ట్రేలియా వరుసగా రెండో విజయం నమోదు చేసింది. తొలి మ్యాచ్ లో సౌతాఫ్రికా వుమెన్ను 65 పరుగుల తేడాతో చిత్తు చేసిన మొలినెక్స్ బృందం.. తాజాగా బంగ్లాదేశ్ మహిళా జట్టుపై కూడా ఘన విజయం సాధించింది.



లీడ్స్ వేదికగా హెడింగ్లీ మైదానంలో బుధవారం నాటి మ్యాచ్ లో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో బ్యాటింగ్ కు దిగిన బంగ్లా టాపార్డర్ కుదేలైంది. ఆసీస్ పేసర్ కిమ్ గార్త్.. ఓపెనర్లలో దిలారా అక్తర్ ను డకౌట్ చేయడంతో పాటు.. జువేరియా ఫిర్దోస్ ను 8 పరుగులకే పెవిలియన్కు పంపింది.

వన్ డౌన్ బ్యాటర్ షర్మిన్ అక్తర్ (5)ను ఆసీస్ కెప్టెన్ సోఫీ మొలినెక్స్ వికెట్ల ముందు దొరకబుచ్చుకుంది. అనంతరం బంగ్లా సారథి నిగర్ సుల్తానా (27)ను కూడా మొలినెక్స్ ఔటగా వెనక్కి పంపింది. ఇక మిగిలిన వారిలో శోభనా మొస్తరీ (4), షోర్నా అక్తర్ (0) వికెట్లను ఎలిస్ పెర్రీ తన ఖాతాలో వేసుకోగా.. రీతూ మోనీ (16)ని జార్జియా వారేహామ్.. రెబెయా ఖాన్ (8)ను అన్నాబెల్ సదర్లాండ్ పెవిలియన్కు పంపారు.

ఫలితంగా నిర్ణీత 20 ఓవర్లలో బంగ్లాదేశ్ మహిళా జట్టు ఎనిమిది వికెట్ల నష్టానికి కేవలం 77 పరుగులే చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ఆస్ట్రేలియా జట్టు కేవలం 9.3 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి పని పూర్తి చేసింది.

ఓపెనర్ జార్జియా వోల్ (32 బంతుల్లో 45)తో పాటు.. వన్ డౌన్ బ్యాటర్ ఎలిస్ పెర్రీ (15 బంతుల్లో 19) అజేయంగా నిలవగా.. మరో ఓపెనర్ బెత్ మూనీ (10) మాత్రం మరూఫా అక్తర్ బౌలింగ్ లో వెనుదిరిగింది. కాగా బంగ్లాపై విజయంతో గ్రూప్-'ఎ'లో ఆస్ట్రేలియా అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఇప్పటికి ఆడిన రెండు మ్యాచ్ లలో గెలిచి నాలుగు పాయింట్లతో టాపర్ గా నిలిచింది.



# అఫ్గానిస్తాన్ను చిత్తు చేసి.. ఫైనల్కు దూసుకెళ్లిన భారత్

ముక్కోణపు వన్డే సిరీస్ లో భారత్- 'ఎ' జట్టు తమ ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడేసింది. దంబుల్లా వేదికగా అఫ్గానిస్తాన్- 'ఎ'తో బుధవారం నాటి మ్యాచ్ లో తిలక్ వర్మ సేన 101 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. తద్వారా నెట్ రన్ రేటు భారీగా మెరుగుపరుచుకుని ఫైనల్ చేరుకుంది.

# అభిమానిని కలిసి చలించిపోయిన పవన్

సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక చిన్నారి వీడియో పవన్ కళ్యాణ్ హృదయాన్ని కదిలించింది. అరుదైన వ్యాధితో పోరాడుతూనే, తన అభిమాన నాయకుడిని ఒక్కసారైనా చూడాలని ఆశపడ్డాడు వరంగల్ జిల్లా హనుమకొండకు చెందిన నిరంజన్. ఆ చిన్నారి కోరికను మన్నించిన పవన్.. ఏకంగా అతని ఇంటికే వెళ్లి సర్ప్రైజ్ చేశారు. ప్రస్తుతం ఈ కలయికకు సంబంధించిన ఎమోషనల్ దృశ్యాలు నెట్టింట వైరల్ గా మారాయి. మంచంపై ఉన్న ఆ చిన్నారి చేయి పట్టుకుని పవన్ ఆప్యాయంగా పలకరించిన తీరు చూస్తుంటే ఎవరికైనా కంటతడి రాక మానదు. తన పర్యటన గురించి పవన్ సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ షేర్ చేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నా నిరంజన్ చూపిస్తున్న అసాధారణ ధైర్యం, ఆత్మవిశ్వాసం తనను ఎంతగానో స్ఫూర్తినిచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఇంతటి కష్టకాలంలోనూ ఆ చిన్నారి ముఖంలో చిరునవ్వు చెదరలేదని, అతని మనోధైర్యం ప్రశంసనీయమని కొనియాడారు. నిరంజన్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామితో పాటు, భద్రకాళి అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.



ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో చూడాలని కోరుకుంటున్నాను అంటూ పవన్ రాసుకొచ్చారు. ఇదే సమయంలో తన హనుమకొండ పర్యటనకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సహకరించిన తెలంగాణ ప్రభుత్వానికి పవన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పోలీసు ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి కానిస్టేబుల్ వరకు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు చెప్పారు. తెలంగాణ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయతలను జీవితాంతం గుండెల్లో దాచుకుంటానని పవన్ ఉద్వేగానికి లోనయ్యారు. ఒక స్టార్ హీరో, తన అభిమాని కోసం ఇంతలా పరితపించడం అభిమానులనే కాదు, సామాన్యులను సైతం ఆకట్టుకుంటోంది.

# మహేష్ బిగ్గెస్ట్ ప్రాజెక్ట్.. లైన్‌లో ఆ ఇద్దరు దర్శకులు!

సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పుడు డైరెక్ట్ ఇంటర్నేషనల్ సినిమాకి వెళుతున్న సంగతి తెలిసిందే. తన చరిష్మా లుక్స్ తో ఎప్పుడో తను ఇంటర్నేషనల్ లెవెల్ కటౌట్ అనిపించుకున్నారు. అయితే ఫైనల్ గా తన ఇంటర్నేషనల్ లెవెల్ ఎంట్రీ వారణాసి తో ఇప్పుడు జరగబోతుంది. ఇది తన కెరీర్ 29వ సినిమా కాగా ఇక దీని తర్వాతి బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ అందులోని బెంచ్ మార్క్ నెంబర్ 30వ సినిమా కోసం ఇప్పుడు నుంచే డిస్కషన్ లు జరుగుతున్నాయి.



తన 30వ సినిమా కోసం సెన్సేషనల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా అలాగే వరుస హిట్ సినిమాల దర్శకుడు బుచ్చిబాబు సానాలు ఫ్రంట్ రేస్ లో ఉంటే ఈ కాంబినేషన్ లలో ఏదో ఒకటి పక్కా కన్ఫర్మ్ అని తెలుస్తోంది. అంతే కాకుండా సందీప్ వంగా, మహేష్ కాంబినేషన్లో సినిమాకి ఓ టాలీవుడ్ టాప్ నిర్మాత కం డిస్ట్రిబ్యూటర్ అడ్వాన్స్ కూడా ఆల్రెడీ ఇచ్చేందుకు ముందుకొచ్చారని తెలుస్తోంది. సో ఇలా మహేష్ బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ కోసం ప్రస్తుతం సినీ వర్గాల్లో ఈ రచ్చ నడుస్తోంది.




# శర్వా సినిమాలో ప్రీతి ముకుందన్..?

ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ ప్రస్తుతం సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'భోగి' చిత్రంతో బిజీగా ఉన్నాడు. ఈ సినిమాను ఆగస్టు 28న థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. 'భోగి' షూటింగ్ పూర్తి కాగానే, శర్వానంద్ డైరెక్టర్ శ్రీను వైట్ల దర్శకత్వంలో ఒక అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్ను పట్టాలెక్కించనున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు చివరి దశకు చేరుకోగా, ఈ ఆసక్తికరమైన ప్రాజెక్ట్కు 'జార్జ్ క్రిష్' అనే టైటిల్ను పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ క్రేజీ ప్రాజెక్ట్లో శర్వానంద్ సరసన నటించేందుకు యంగ్ బ్యూటీ ప్రీతి ముకుందన్ను హీరోయిన్గా సెలెక్ట్ చేసినట్లు తెలుస్తోంది. గతంలో మంచు విష్ణు హీరోగా నటించిన 'కన్నప్ప' చిత్రంతో తెలుగు ఇండస్ట్రీలోకి ప్రీతి అడుగుపెట్టింది. రీసెంట్గా 'బ్లాస్ట్' చిత్రంతో బాక్సాఫీస్ దగ్గర సందడి చేసిన ఈ బ్యూటీ ఇప్పుడు శర్వా సరసన నటిస్తుందనే వార్త సినీ సర్కిల్స్లో జోరుగా చక్కర్లు కొడుతోంది.

ఇక ఈ చిత్రాన్ని అనిల్ సుంకర నిర్మించనుండగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆగస్టు నెలలో ప్రారంభం కానుంది. శర్వానంద్-శ్రీను వైట్ల కాంబినేషన్లో వస్తున్న ఈ ఎంటర్టైనర్ను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# విజయ్ దేవరకొండ రేర్ ఫీట్.. ఒకరు కాదు ఇద్దరు..!

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్నాడు. ఆయన కెరీర్ లో ఒక రేర్ ఫీట్ సాధించి ప్రస్తుతం టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారాడు. ఒకరు కాదు ఇద్దరు గ్లోబల్ స్టార్స్ తో నటించే అరుదైన రికార్డు విజయ్ దేవరకొండ దక్కించుకున్నాడు. గతంలో 'లైగర్' చిత్రంలో బాక్సింగ్ లెజెండ్ మైక్ టైసన్ ను ఇండియన్ సినిమాకు పరిచయం చేస్తూ, ఆయనతో కలిసి నటించే ఛాన్స్ దక్కించుకున్నాడు విజయ్. ఇక ఇప్పుడు ఆయన నటిస్తున్న 'రణబాలి' చిత్రంలో మరో ఇంటర్నేషనల్ స్టార్ ఆర్నాల్డ్ వోస్లూతో కలిసి నటించే అరుదైన అవకాశం దక్కించుకున్నాడు. 'ది మమ్మీ' సినిమాతో గ్లోబల్ స్థాయిలో మెప్పించిన ఆర్నాల్ వోస్లూని ఇప్పుడు రణబాలి చిత్రంతో ఇండియన్ సినిమాకు పరిచయం చేస్తున్నాడు. ఇలా ఒకరు కాదు.. ఏకంగా ఇద్దరు గ్లోబల్ స్టార్స్ తో నటించే అవకాశం దక్కించుకున్న హీరోగా విజయ్ సరికొత్త రికార్డ్ క్రియేట్ చేశాడు. ఇక రణబాలి సినిమాను దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ డైరెక్ట్ చేస్తుండగా రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తోంది.



# వెంకీ-కళ్యాణ్ కాంబో మూవీ

## ప్రారంభానికి ముహూర్తం ఫిక్స్ చేసిన అనిల్ రావిపూడి

విక్టరీ వెంకటేష్, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్ లో రాబోతున్న మోస్ట్ అవైటెడ్ సంక్రాంతి ఎంటర్ టైనర్ ఎప్పుడెప్పుడు పట్టాలెక్కుతుందా అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సినిమాలో నందమూరి కళ్యాణ్ రామ్ మరో హీరోగా నటిస్తుండటంతో వెంకీ-కళ్యాణ్ రామ్ కాంబినేషన్ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి కథతో రాబోతున్నారా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.

అయితే, ఈ ప్రెస్టీజియస్ సినిమాను అధికారికంగా పట్టాలెక్కించేందుకు రంగం సిద్ధమైంది. ఈ క్రేజీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్ యొక్క గ్రాండ్ పూజా కార్యక్రమం ఈ రోజు ఉదయం 9 గంటల నుండి ఘనంగా జరగనుంది. ఈ మేరకు చిత్ర యూనిట్ సోషల్ మీడియా ద్వారా అధికారిక ప్రకటన చేశారు. వెంకటేష్, అనిల్ రావిపూడి కాంబోలో గతంలో వచ్చిన 'ఎఫ్2', 'ఎఫ్3', 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలు బాక్సాఫీస్ వద్ద నవ్వుల పండగను సృష్టించగా.. ఇప్పుడు కళ్యాణ్ రామ్ కూడా తోడవడంతో ఈ సంక్రాంతి ఎంటర్ టైనర్ నెక్స్ట్ లెవెల్ లో ఉండబోతోందని స్పష్టమవుతోంది. ఇక ఈ సినిమాకు జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి ప్రొడ్యూస్ చేస్తున్నారు.

ఈ భారీ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ మరియు జీ స్టూడియోస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. స్టార్ కంపోజర్ జి.వి. ప్రకాష్ కుమార్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. పూజా కార్యక్రమంతో ఈ క్రేజీ మూవీ షూటింగ్ జర్నీ మొదలుకానుండగా, రేపు రాబోయే అప్ డేట్స్ కోసం ఇటు నందమూరి, అటు దగ్గుబాటి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.